# మూసీ

# MUSI

◆ Samputi : 28 ◆ Sanchika : 07 ◆ Pages : 64 ◆ Rs. 20
◆ May 2025

- వైషమ్యంలో వైరుధ్యాలు
- రామాయణం - బాలకాండం - ఒక పరిశీలన
- జాషువా ఖండకావ్యాలు - తెలుగు కవి ప్రశంస
- శీర్షికే సర్వస్వం - పరిశోధన 'శీర్షిక'ల లక్షణాలు
- తెలుగు భాషా సాహిత్యాలు-పరిశోధన పద్ధతులు
- శ్రీ శంకరాచార్యుల జీవితం - తత్త్వం
- భౌతికవాదం నుండి భావవాదం వైపు గజేంద్రమోక్షం
- స్త్రీ పాత్రల పట్టాభిషేకానికి అర్హతగల కథలు








# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన పత్రిక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 7
మే - 2025
'విశ్వావసు' వైశాఖ మాసం

సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
B. MANOHARI

*Type Setting at :*
Kavyasree Graphics
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక, 2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

ISSN 2457-0796

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

వైషమ్యంలో వైరుధ్యాలు ... డా. శ్రీవల్లీ రాధిక 7
నలిమెల భాస్కర్ అనువాద కథలు-కళా సౌందర్యం...డా. తత్వాది ప్రమోద కుమార్ 15
రామాయణం - బాలకాండం - ఒక పరిశీలన ... ఆచార్య జి. నరసింహన్ 21
జాషువా ఖండకావ్యాలు - తెలుగు కవి ప్రశంస ... ప్రొ. ఎ.కె. వేణుగోపాల్ రెడ్డి 27
శీర్షికే సర్వస్వం - పరిశోధన 'శీర్షిక'ల లక్షణాలు ... డా. వెంకటరామయ్య గంపా 30
తెలుగు భాషా సాహిత్యాలు - పరిశోధన పద్ధతులు (చర్చ) ... ఘట్టమరాజు 37
శ్రీ శంకరాచార్యుల జీవితం - తత్త్వం ... డా. వీపూరి వేంకటేశ్వర్లు 39
భౌతిక వాదం నుండి భావవాదం వైపు గజేంద్ర మోక్షం ... డా. మంథని శంకర్ 41
మారిషస్ దేశంలో తెలుగు : నాటి స్థితి - నేటి గతి ... డా. ప్రవాసీ చిన్నయ్య 45
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంధ్ర లక్ష్మణరావు 49
స్త్రీ పాత్రల పట్టాభిషేకానికి అర్హత గల కథలు ... పెద్దోళ్ల శ్రావణ్ కుమార్ 51
పేగు బంధము (కథ) ... ఐతా చంద్రయ్య 53

### కవితలు

భక్తా ! మారుతి రామదూత ... జి. లింగేశ్వర శర్మ - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; ఆకురాలిన చప్పుడు ... మెర్సీ మార్గరెట్ - 25; పునాదిలో రాళ్ళలా ... పి.సువర్ణ - 29; అమ్మ ... విను - 56; హింసాధర్మ ... డా. వొజ్జల శరత్ బాబు - 60; మరక మిగిలిన రోజు .. ధూళిపాళ అరుణ - 60; పేరేంటో తెలుసా! ... డా. మేఘ స్రవంతి - 62;

### సమీక్షలు

మధ్య తరగతి మందహాసాలు - ఈ 'సుదూర తీరాలు ... వి. హరికృష్ణ చారి - 57

❖ ❖ ❖ ❖ ❖

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.

*Printed, Published and Owned by :*
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 4 హైదరాబాద్ మే : 2025

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి

దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
అమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# యంత్రము

యచ్ఛతి ఉపరమతి యేన, యమ్+త్ర, దీనితో ఆనందింతురు, యంత్ర ; యచ్ఛతి అత్ర, యమ్+త్ర, దేవాధిష్ఠానం కలది. లోకంలో అన్నీ యంత్రాలే. శరీరంలో ఉన్నవన్నీ యంత్రాలే. కన్ను చూస్తుందంటే ఒక యంత్ర భావన, చెవి వినడానికి ఒక యంత్రమే, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలన్నింటి నిర్వహణ ఒక యంత్రమే. తిన్నది అరగడానికి ఒక యంత్రమే, భార్యాభర్తల సంభోగాదులు, దాని ద్వారా సంతాన ఉత్పత్తి జరగడం ఒక గొప్ప యంత్రం. ఈ ప్రకృతిలో పంచీకరణ విధానం ఒక యంత్రం. పంచభూతాలు చేసే వేరు వేరు కార్యాలు ఒక యంత్రంలోని విశేషాలు. మనకు బాహ్యంగా కనిపించే కనిపించేవే కొన్ని యంత్రాలుగా భావిస్తాం. ఒక ప్రదేశం నుండి మరో ప్రదేశానికి వెళ్ళాలంటే ఒక యంత్రం వినియోగించుకుని వెళ్తుంటాం. ప్రతి చోట యంత్రాలనే ఉపయోగిస్తున్నాం. అంతర, బాహ్య భాగాల్లో అన్నీ యంత్రాలే. మనం వినియోగించు కునే వన్నీ యంత్రాలే.

మన స్థాయిని బట్టి యంత్ర వినియోగం ఉంటుంది. శరీర స్థాయిని బట్టి శరీరంలోని యంత్రాలు ఉంటాయి. ఆర్థిక స్థాయిని బట్టి వినియోగించుకునే సైకిలు నుండి విమానం వరకు ప్రయాణ సాధనాలు ఉంటాయి. చిన్న పరిశ్రమ నుండి భారీ పరిశ్రమల వరకు వినియోగించుకునే యంత్రాలు అనేకంగా ఉంటాయి. యంత్రాలలో లోపాలు రాకుండా ఎప్పటికప్పుడూ వాటిని సరిచేస్తూ ఉండాల్సిన అవసరం ఉంటుంది. శరీర యంత్రంలో లోపాలు రాకుండా యోగ, ప్రాణాయామాదుల ద్వారా శుద్ధి చేసుకుంటూ ఉంటే ఈ యంత్రం శుభ్రమై చాలా కాలం పాటు సంతోషాన్నిస్తుంది. వేగంగా తిరుగుతుంది. అదేవిధంగా సైకిల్, మోటర్ సైకిల్, కార్ లాంటి అనేక ప్రయాణ సాధనాలు కూడా శుద్ధం చేసి కొనసాగిస్తాం. అన్ని యంత్రాలను శుద్ధి చేయడం ద్వారానే వేగంగా కార్యనిర్వహణ ఉంటుంది.

భారతీయ ధర్మంలో సృష్టిలోని అన్నింటినీ యంత్ర రూపంలోనే దర్శించినారు. అటువంటివే దేవతా సంబంధమైన యంత్రాలుగా ఉంటాయి. వేరు వేరు శక్తులను చైతన్య పరచే విధానం లేదా శుద్ధి చేసి నడిపించే విధానమే యంత్ర విధానం. శ్రీయంత్రంతో మొదలు పెట్టి అందరు దేవతా మూర్తుల మూల భావనలకు అనుగుణంగా ఆ యా చైతన్యాలు ఈ ప్రకృతిలో విలసిల్లేందుకు అనుగుణంగా నిర్వహించే ప్రక్రియలే యంత్ర చైతన్యతా ప్రక్రియలు. ఏ యంత్రం బాగు చేయాలన్నా ఆ యంత్రానికి సంబంధించిన వ్యక్తి కావాలి. అదేవిధంగా సృష్టికి సంబంధించిన అనేక వ్యవహారాలలో ఆ యా యంత్ర వ్యవహారాలు శుద్ధి చేసి, చైతన్యవంతం చేయడానికి ఆ యా సాధకులుంటారు. ఆ సాధకులు చేసే ప్రయత్నం వల్ల తమలోని, తమ చుట్టూ ఉన్న పంచభూతాలు, ప్రకృతి అంతా దైవమయంగా మారి సంతోషాన్నిస్తుంది. ఆకర్షణను పెంచుతుంది. అవి తెలియని వారు చేయడం ద్వారా ఆ యంత్రం పాడు అవుతుంది.

యంత్రం కార్యాన్ని వేగంగా నిర్వర్తించడానికి సహకరిస్తుంది. యంత్రం తక్కువ కాలంలో ఎక్కువ కార్యశీలత కలిగే ఫలితాలను ఇస్తుంది. యంత్రం వల్ల అసాధ్యాలన్నీ సుసాధ్యాలవుతాయి. ఈ సృష్టిలోని అనేక అంశాలను గమనించి వానిని అధ్యయనం చేయడం ద్వారా అనేక యంత్రాలను తయారు చేయవచ్చు. మార్చుకోవచ్చు. మానవ శరీంలోనూ ఇటువంటి విషయాలను గమనిస్తూ వేరు వేరు వ్యవస్థల నిర్వహణ పరిశీలించినా ఇటువంటి వ్యవహారాలు తెలుస్తూనే ఉంటాయి. భారతీయతలో అన్నీ అద్భుతాలే ఉంటాయి. పిచ్చిగీతలుగా కనిపించే దేవతా యంత్రాలను కూడా జాగ్రత్తగా పరిశీలిస్తే సృష్టి రహస్యాలే కనిపిస్తుంటాయి.

ISSN 2457-0796


# భక్తా ! మారుతి రామదూత!





శ్రీరామామృతదివ్యమంత్రమహిమన్ శ్రీరామకార్యార్థివై !
నోరారన్ జపియించిముందుకరుగన్నుత్సాహముప్పొంగగా !
పారావారము తోడు నిల్పిహృదిలో, ప్రార్థించిలంఘించుచున్ !
జేరెన్ లంకనుసీతజాడ కొరకై శీఘ్రంబుతామారుతీ !

ధ్యాసన్నిల్పుచు మారుతాత్మజుడుతా ధైర్యంబుగాసాగుచున్ !
చేసెన్ సేవలు భక్తిరాముకవనిన్సేవించిపూజించుచున్ !
శ్రీసాకేతపురాధిపున్! రఘుపతిన్! సీతామనోవల్లభున్ !
బాసన్దప్పకముందుకేగి సతమున్ భాషించిశోభిల్లుచున్ !

పండేమోయని మ్రింగిబోతివిగదా బాల్యమ్ములో బింబమున్!
మండేసూర్యుని మారుతాత్మజుడనీ మాహాత్మ్యమున్ గాంచగా!
బండల్పిండిని చేయగల్గుబలుడా బాలార్కతేజప్రభో!
దండున్ముందుకుసాగజేయుచునరిన్ ధైర్యంబునింపారగన్!

సీతాశోకవినాశకాయనిలజా శ్రీరామసంసేవకా
త్రాతాభక్తజనాశ్రితాభయకరాతప్పించికష్టాలనే
ఖ్యాతిన్ వానరయోధముఖ్యవినుతాయర్చించిపూజించగా
ప్రీతిన్మీరగనందజేసిఫలముల్వీక్షించిరక్షించురా

భక్తాగ్రేసరుడాంజనేయదదిగోబాలార్కతేజంబుతో
రక్తిన్ పొంగగరామకర్యమనగాలంకాపురీజేరియున్
శక్తిన్జూపుచు సీతజాడనుగనీసంతోషముప్పొంగగా
భక్తా మారుతిరామదూతహనుమాప్రార్థించెదన్ భక్తితో

దీక్షా వస్త్రములన్ ధరించిశుచిగాదేవాసమీరాత్మజా
దీక్షన్ బూనిభక్తిభావములతోదివ్యంబుగాగొల్చుచున్
భిక్షన్నైకొని నొక్కపూట మదిలో ప్రీతిన్సదావేడగా
రక్షా భక్తపరాయణా హనుమతే రక్షింతువే భక్తులన్

సిద్ధింపంగసమస్తకార్యములనశ్రేయంబులన్ గూర్చగా
బుద్ధిన్ ధైర్యముశక్తులన్నొసగిసంపూర్ణమ్ముగామారుతీ
నిద్రాత్రిన్ కొనసాగనిమ్ముసతమున్ నిస్సత్తువేలేకయున్
ఉద్దీపింపగజేయమాదుహృదిలోనుత్సాహముప్పొంగగా

లంకాపట్టణమందుజేరిమొదటన్ రాకాసులామధ్యలో
లంకేషున్ సభలోసమీరతనయారామున్ని ప్రార్థించియున్
బింకంబింతయు లేక వీరుడివిగా భీతావహాజ్వాలమై
లంకన్ వాలముచే దహించితివిగా ప్రజ్వల్యమానంబుతో

శ్రీమన్మంగళ దివ్యరూప మదియే శ్రీయంజనేయండినే
నేమంబెన్నడు వీడకుండ నిలిపి నీయంతరంగంబునన్
స్వామీభక్త పరంధమాయని సదాప్రార్థించి సేవించినన్
క్షేమమ్మున్ కలిగించి బ్రోవును పసదా క్షిప్రమ్ముగాభక్తులన్

ధారాళమ్ముగమారుతీ స్మరణయే ధైర్యంబు నందించియున్
పారద్రోలు భయమ్ములన్ని మదిలో ప్రార్థించగా భక్తులే
ఆరోగ్యమ్మును కీర్తిసంపదలతో హాయిన్ ప్రసాదించుగా
శ్రీరామామృత నామకీర్తన పరాచిన్మంగళాకారుడా!

జి. లింగేశ్వర శర్మ

## మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం - (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు-మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రక్రియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యధాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (" ") తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు-మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. ప్రచురణ సంవత్సరం). గ్రంథం పేరు, ప్రచురణసంస్థ, ప్రచురణ స్థలం.) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. **'భారత ధ్వని దర్శనము'**. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యధాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

సద్గురువుల త్రోవ నడవరే
సద్గుణములలో జనులా వరలరే
సద్గురువు మాటలు మంత్రములుగా
జీవన నౌకను నడుపుకొనవలే

గురువే బ్రహ్మము జూపును
సన్మార్గమున మిము నడుపును
పలు విధముల పాప కర్మలు
సేయకుండా మిము ముద్దుగ మలుచును

సత్యము నిత్యము గెలుచును
పీడన మనసును తొలచును
ప్రభు పాండురంగని నామ స్మరణ
మీ పాపముల హరియించును

తుకారాముడి పలుకులు
గురు మూర్తులు చెప్పిన గురుతులు
గురుతుంచుకోరే జనులా... మీ
గురుతర బాధ్యత ఇది మరలా




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 7 హైదరాబాద్ మే : 2025

# వైషమ్యంలో వైరుధ్యాలు

✍ డా. టి. శ్రీవల్లీ రాధిక, ఫోన్ : 9441644644




రామాయణ విషవృక్షం పుస్తకంలో రంగనాయకమ్మగారు తాను చెప్పాలనుకున్న విషయాన్ని విమర్శ రూపంలో చెప్పకుండా, కొన్ని కథల రూపంలో వ్రాశారు. **"చెప్పుల పాలైన సింహాసనం"** అన్న కథ వాటిలో ఒకటి.

రంగనాయకమ్మ గారు రామాయణం గురించి ప్రధానంగా చేసిన విమర్శ ఒకటి ఉంది. రామాయణాన్ని అర్థం చేసుకోవడానికి చాలా కీలకమైన విషయంగా ఆవిడ భావించిన (పీఠికలో పేర్కొన్న) అంశమది. "చెప్పుల పాలైన సింహాసనం" కథకు ఆధారం ఆ అంశమే.

అది రాజ్యంపై అసలు రాముడికి హక్కే లేదన్న విషయం. పీఠికలోనే రచయిత్రి దాని గురించి చెప్తారు.

**"రాముడు జ్యేష్టుడైనా అతడికి రాజ్యంపై హక్కులేదు. రాజ్యం భరతుడిదే. ఎందుకంటే దశరథుడు కైక బిడ్డకే రాజ్యం ఇస్తానని వాగ్దానం చేసి కైకని పెళ్ళి చేసుకున్నాడు"** అంటారు. ఈ విషయాన్ని చెప్పి, ఇది రామాయణానికంతటికీ ఆధారమయినంత ముఖ్య విషయమనీ, ఇంత ముఖ్యమైన విషయాన్ని వాల్మీకి చాలా అల్ప విషయంగా ఒక మూలకి తోసేసి దాని సంగతి ఎప్పుడో ఎత్తాడనీ అంటారు. వాల్మీకిలోను రాముడిలోను రచయిత్రి ప్రధానంగా చూసిన దోషం ఇదే. ఈ తప్పును దాచుకునేందుకే మిగిలిన వైరుధ్యాలన్నీ రాముడి పాత్రలోను, రామాయణ రచనలోను వచ్చాయన్న విషయాన్ని నిరూపించేందుకు ఈ పుస్తకంలో పలుచోట్ల ఆవిడ ప్రయత్నిస్తారు.

నిజమే, ఈ మాట – కైకను పెళ్ళి చేసుకునేటపుడు కైకకు పుట్టే బిడ్డకే రాజ్యం ఇస్తానని దశరథుడు కైక తండ్రితో అన్నాడన్న మాట– అయోధ్యకాండ మొదట్లో, దశరథుడు రాముడికి పట్టాభిషేకం తలపెట్టిన సందర్భంలో రాదు. కానీ అదే కాండలో అంటే అయోధ్యకాండలోనే చివర్లో వస్తుంది.

రాముడిని వెతుక్కుంటూ భరతుడు అడవికి వచ్చి నువ్వే రాజ్యం చేయాలని పట్టుబట్టినపుడు రాముడు రానని నిరాకరించి భరతుడికి నచ్చచెప్పే సందర్భంలో ఈ మాట కూడా అంటాడు. అంతే. అక్కడ 'ఒక్కచోటే' రాముడు 'ఒక్కడే' ఈ మాట అంటాడు. ఇంకెక్కడా మరెవరూ రామాయణంలో ఈ ప్రస్తావన చేయరు.

ఆ లెక్కన రంగనాయకమ్మగారు అన్నట్లు కవి దీనిని చాలా అల్పవిషయంగానే చెప్పాడు.

వాల్మీకి ఈ కావ్యాన్ని రాముడికి అనుకూలంగా వ్రాయాలను కున్నాడు కాబట్టి రాజ్యంపై రాముడికి హక్కు ఉందని చెప్పాడని, కానీ రాజ్యంపై భరతుడికి హక్కు లేకపోతే రాముడికి పట్టాభిషేకం చేయాలనుకున్నపుడు దశరథుడు భరతుడిని ఎందుకు శంకించవలసి వచ్చిందనే అనుమానం రామాయణం చదివే పాఠకులకు వస్తుందని రచయిత్రి అంటారు.

నిజానికి పాఠకులందరికీ ఈ అనుమానం రాలేదు. ఈ సందేహం రాని పాఠకులు, వచ్చినా దీనిని దోషంగా చూడని పాఠకులు కూడా ఉన్నారు. ఎందుకంటే దశరథుడు భరతుడిని శంకించడం అనేది భరతుడి హక్కుకి ప్రమాణమేమీ కాదు. ప్రమాదం హక్కు ఉన్నవాడివైపు నుంచి మాత్రమే రాదు. హక్కు ఉన్నా లేకపోయినా రాజ్యం కావాలనుకునే ఎవరి వైపు నుంచైనా వస్తుంది. కాబట్టి ఇక్కడ దశరథుడు భరతుడి గురించి శంకగా మాట్లాడినంత మాత్రాన భరతుడికి హక్కు ఉంది అని తీర్మానించలేము.

ఇక ఈ విషయాన్ని దోషంగా చూడని పాఠకులను గమనించి నపుడు, ఈ విషయంలో వారి అవగాహన ఏమిటి అని పరిశీలించినపుడు, వారు కవి అల్పవిషయంగా చెప్పిన ఈ విషయాన్ని అల్పవిషయంగానే తీసుకోవాలని అర్థం చేసుకున్నారని తెలుస్తుంది.

**'ఇక్ష్వాకు వంశంలో జ్యేష్ఠ పుత్రుడే రాజు కావడం ఆనవాయితీ. అయితే కైకను పెళ్ళి చేసుకునే నాటికి కౌసల్యాదులకు సంతానం కలగలేదు కనుక ఒకవేళ వివాహమయిన వెంటనే కైకకు సంతానం కలిగితే ఆ సంతానానికే రాజ్యం ఇస్తానని దశరథుడు అని ఉండవచ్చు. ఆమెకు మొదట సంతానం కలిగితే దూరప్రాంతపు స్త్రీ కావడం, పట్టమహిషి కాకపోవడం వంటి అభ్యంతరాలకు తావివ్వకుండా ఆమెకు పుట్టినవాడు పెద్దవాడనే విషయానికే ప్రాముఖ్యం ఇచ్చి ఆమె సంతానాన్ని రాజ్యానికి వారసునిగా పరిగణిస్తానన్నదే బహుశా ఆ వాగ్దానంలోని భావం అయి ఉంటుంది. అయితే ఎప్పుడైతే కైకకు**

**కూడా సంతానం కలగలేదో, పట్టమహిషి కౌసల్యకే మొదట సంతానం కలిగిందో అప్పుడు ఆ మాట దానంతట అదే వీగిపోయింది. ప్రాముఖ్యం లేని విషయం అయిపోయింది'** అని ఆ పాఠకులు అర్థం చేసుకున్నారు. అందుకే రామాయణంలో రాముడి పట్టాభిషేక సమయంలో కానీ, ఆ తర్వాత కానీ, ఎవరూ దాని గురించిన ప్రస్తావన చేయకపోవడంలో వారికి అనౌచిత్యం కనబడలేదు.

ఇక భరతుడితో రాముడు దాని గురించి ప్రస్తావించడాన్ని కూడా అతనికి నచ్చచెప్పడంలో భాగంగానే వారు చూశారు. భరతుడు రాజ్యం తీసుకోవడానికి చాలా బాధపడుతున్నాడు కనుక అతడు తన మనసుకు సర్ది చెప్పుకోవడానికి అవకాశమిచ్చే ఒక అంశంగా రాముడు ఆ విషయాన్ని ముందుకు తెచ్చాడని భావించారు.

ఇది సాధారణంగా లోకంలో గమనిస్తూ ఉండే విషయమే. మొదట ఒక విషయం అనుకుంటారు. ఆతర్వాత మరొక ముఖ్యమైన అనివార్యమైన అందరికీ ఆమోదదాయకమైన పరిస్థితి రావడంతో మొదటి విషయం ప్రాధాన్యం దానంతట అదే వీగిపోతుంది. అదసలు ఎవరికీ గుర్తు కూడా ఉండదు. దానిని ఎవరూ ప్రస్తావించరు. అటువంటి పరిస్థితిలో ఒకవేళ మళ్ళీ అందరికీ ఆమోదమైన రెండవ విషయాన్ని పాటించలేని పరిస్థితి వస్తే, ఆ బాధను ఉపశమింప చేసుకోవడానికి **"సరే, మొదట మనం అనుకున్నది అదేగా! అలాగే కానిద్దాములే"** అని సర్ది చెప్పుకుంటారు. ఇది లోకంలో చూస్తూనే ఉంటాము.

రామాయణానికి సంబంధించిన విషయాన్ని కూడా ఎక్కువమంది పాఠకులు ఇలాగే అర్థం చేసుకున్నారు. ఈవిధంగానే సమన్వయించు కున్నారు. కొందరు పాఠకులు తీసుకున్న ఈ అర్థాన్ని అందరూ ఒప్పుకోకపోవచ్చు. అందరికీ ఈ సమన్వయం అంత బలంగా కనిపించకపోవచ్చు. అయితే ఈ అవగాహన సరయినదా కాదా, ఈ విషయాన్ని ఇలా సమన్వయించుకోవడం సబబా కాదా అన్న ప్రశ్న అలా ఉంచితే, దీనిని ఒప్పుకుంటే ఈ విషయానికి సంబంధించినంతవరకూ మరింకే కొత్త ప్రశ్నా రాదన్నది మాత్రం నిజం. కానీ రంగనాయకమ్మగారు చెప్పిన అవగాహన అటువంటిది కాదు. ఆవిడ చెప్పిన అర్థాన్నీ, అవగాహననీ తీసుకుంటే, మరెన్నో సమాధానం దొరకని ప్రశ్నలు వస్తాయి.

రంగనాయకమ్మగారు చెప్పిన అర్థం తీసుకుంటే, అంటే దశరథుడు కేకయ రాజుకు ఇచ్చిన మాటకు రాముడు పుట్టాక కూడా విలువ ఉందనీ, ఆ విషయం తెలిసీ దశరథుడూ రాముడూ కుట్రపూర్వకంగా వ్యవహరించారనీ అనుకుంటే చాలా విషయాలకు సమన్వయం చిక్కదు. పలుకోణాల నుండి వచ్చే ప్రశ్నలకు సమాధానం దొరకదు.

ఈ పుస్తకంలో తాను వ్రాసిన కథలలో మూలగ్రంథంలోని విషయాలను తానేమీ మార్చి వ్రాయలేదని రంగనాయకమ్మగారు ఈ పుస్తకం పీఠికలో చెప్పారు. కానీ మూలగ్రంథంలోని అంశాలలో తన ప్రతిపాదనకు ఇబ్బంది కలిగిస్తాయనుకున్న వాటిని అసలు వ్రాయకుండా ఎగరగొట్టడం, లేదా కొద్దిగా మార్చి వ్రాయడం చాలాచోట్ల కనిపిస్తుంది. మూలగ్రంథంలోని విషయాన్ని అలాగే వ్రాసి, దానిని ఇలా కూడా భావించే అవకాశం ఉంది అని వ్యాఖ్యానించడం వేరు, అసలు మూలంలోని విషయాన్ని దాచేయడం, మార్చడం వేరు.

అయితే ఇలా కొన్ని విషయాలను దాచీ, కొన్నిటిని మార్చీ వ్రాసినప్పటికీ ఇంకా రంగనాయకమ్మగారి **"చెప్పుల పాలైన సింహాసనం"** కథలో ఎన్నో వైరుధ్యాలు, అనౌచిత్యాలు కనిపిస్తాయి.

అటువంటి కొన్ని వైరుధ్యాలను ఈ వ్యాసంలో వివరించేందుకు ప్రయత్నిస్తున్నాను.

**మూలరచనతో పొసగమి :**

మొదట మూల రచనతో అంటే వాల్మీకి రామాయణంతో పొసగని విషయాలు చూద్దాము.

1.రాముడి పట్టాభిషేకం గురించి దశరథుడు భార్యలతో చర్చించినట్లూ మర్నాడు సభలో ఏమి చేయబోతున్నాడో ముందురోజు వారితో సంప్రదించినట్లూ రామాయణంలో ఉండదు; కానీ సభలో చర్చించాక, రాముడికి చెప్పాక, ఆ రాత్రి కైకకు మాత్రం ఆ వార్తను తానే స్వయంగా చెప్పాలనుకుంటాడు దశరథుడు. మిగిలిన రాణులందరికీ ఇతరుల ద్వారా తెలిసింది. కైకకి కూడా అప్పటికే తెలిసి ఉండవచ్చునని కూడా బహుశా ఆయనకి తెలుసు. ఎందుకంటే **"ప్రసిద్ధమైన"** అనే మాట ఆ శ్లోకంలో ఉంటుంది. అయినా తాను స్వయంగా తన నోటితో చెప్పాలనుకున్నాడు, దాచాలనుకోలేదు. **"ప్రియవార్త చెప్పదగిన కైకేయికి ఈ ప్రియవార్త చెప్పడం కోసం దశరథుడు ఆమె అంతఃపురంలో ప్రవేశించాడు"** అన్న వాక్యం అక్కడ ఉంటుంది.

రంగనాయకమ్మగారు అన్నట్లు దశరథుడు కుట్ర చేయదలచుకుని ఉంటే ఈ వాక్యం పొసగదు. అందుకే ఈ వాక్యాన్ని ఆవిడ తన కథలో చేర్చలేదు.

2. సభలో పట్టాభిషేక వార్త ప్రకటించాక మళ్ళీ రామునితో ఏకాంతంగా సమావేశమైనపుడు తాను అంత హడావుడిగా పట్టాభిషేకాన్ని నిర్ణయించడానికి దశరథుడు కారణం చెప్తాడు.

**"కొద్దిరోజులుగా నాకు చాలా దుస్స్వప్నాలు వస్తున్నాయి. జాతకంలో కూడా ప్రస్తుతం రవి-కుజ-రాహువులు నా జన్మనక్షత్రాన్ని ఆక్రమించి ఉన్నాయని చెప్తున్నారు, ఇటువంటి పరిస్థితులలో రాజుకు మరణమో మరొక పెద్ద ఆపదో వస్తుందని అంటారు. కనుక వెంటనే నీకు పట్టాభిషేకం చేయాలను కుంటున్నాను"** అని చెప్తాడు.

ఈ మాటలు రంగనాయకమ్మగారు తీసేశారు. ఈ సమావేశంలో

దశరథుడు మాట్లాడిన మిగిలిన మాటలు అన్నీ వ్రాశారు, ఇవి తప్ప.

మిగిలిన మాటల్ని కూడా కొద్దిగా మార్చి తాను అనుకున్న భావం స్ఫురించేందుకు అనువుగా వ్రాశారు. ఇదే సమావేశంలో దశరథుడు భరతుని గురించి శంక వెలిబుచ్చాడన్న విషయాన్ని వ్రాశారు. దాన్ని కూడా యథాతథంగా వ్రాయకుండా కొంచెం మార్చారు. భరతుడి గురించి దశరథుడు మూలంలో **"భరతుడు ధర్మబుద్ధి గలవాడు, దయాశీలుడు, జితేంద్రియుడు, పెద్దవారి మార్గాన్ని అనుసరించేవాడు. అదంతా నిజమే కానీ సన్మార్గంలో నడిచే వారి మనసు కూడా ఒక్కొక్కప్పుడు చంచలం కావచ్చు"** అని మాత్రమే అంటాడు.

దశరథుడూ రాముడూ కలిసి చేస్తున్నది భరతుడి హక్కుని కాజేసే కుట్రే అయితే వారిద్దరే ఏకాంతంగా కూర్చుని మాట్లాడుకునే మాటలు ఇలా ఉండకూడదు. ఈ మాటలు ఆ సందర్భానికి పొసగవు.

అందుకని వీటిని **"కొద్దిగా"** మార్చి వ్రాస్తారు రంగనాయకమ్మ గారు. పైగా ఆ సంభాషణకు ముందు **"ఇప్పుడు సంగతి ఏమిటంటే.. అంటూ దశరథుడు అటూఇటూ చూసి కంఠం తగ్గించి"** ఈ విషయాన్ని చెప్పాడని చేర్చడం ద్వారా ఒక కుట్రదారుడి రూపాన్ని చిత్రించేందుకు ప్రయత్నిస్తారు. అటూఇటూ చూడటాలూ, కంఠం తగ్గించడాలూ మూలంలో లేవు.

3. మంధర వచ్చి కైకకు వార్త చెప్పగానే కైక చాలా సంతోషించి మంధరకు తన ఆభరణాన్ని బహుమానంగా ఇస్తుంది. మంధర బోధ మొదలుపెట్టాక కూడా **"రాముడు ధర్మాలన్నీ తెలిసినవాడు. దశరథ మహారాజుకు జ్యేష్ఠకుమారుడు. కనుక అతడే యౌవరాజ్యపట్టాభిషేకానికి అర్హుడు. అతనికి పట్టాభిషేకం అంటే నీకు ఎందుకు దుఃఖం కలుగుతోంది?"** అని అడుగుతుంది.

మంధర బోధ అంతా పూర్తయ్యాక, తన బుద్ధి మారాక కూడా **"అయితే రాజ్యం రాముడికి కాకుండా భరతుడికి వచ్చేలా చేయడానికి ఏంచేయాలో నువ్వే ఉపాయం చెప్పు"** అంటుంది. ఇవన్నీ తాను ప్రతిపాదిస్తున్న విషయానికి పొసగవు కనుక ఈ మాటలూ సన్నివేశాలూ మొత్తం తనకథలో తీసేశారు రంగనాయకమ్మగారు. అసలు మంధర పాత్రనే తీసేశారు.

4. రామాయణంలో కైక భరతుడి పట్టాభిషేకాన్నీ, రాముడి వనవాసాన్నీ వరాలుగా అడిగినపుడు ఆమె అలా అడుగుతుందని ఎంతమాత్రమూ ఊహించని దశరథుడు నివ్వెరపోతాడు. ఇది కలేమో నాభ్రమేమో అనుకుంటాడు. దుఃఖంతో స్పృహ కోల్పోతాడు.

దశరథుడు కుట్రతో వ్యవహరించాడన్న రంగనాయకమ్మగారి ప్రతిపాదనను ఒప్పుకోవాలంటే మూలంలోని ఈ విషయాలేవీ పొసగవు. కనుక దీనిని కూడా ఆవిడ తన కథలో కొంత భిన్నంగా వ్రాశారు. అంటే కైక వరాలు అడిగినపుడు దశరథుడు నివ్వెర పోయినట్లు వ్రాస్తారు కానీ అందుకు కారణాన్ని భిన్నంగా చెప్తారు. అసలు ఆ సన్నివేశమంతా కొంత గందరగోళంగా అతకనట్లుగా ఉంటుంది. ఆ సన్నివేశం ఈకథలో ఎలా నడుస్తుందో వ్యాసం తర్వాతి భాగంలో మరికొంత వివరంగా చెప్తాను.

ఇక ఈ అంశంలో ఉదాహరణలు ఇక్కడికి ఆపుతాను. సారాంశం ఏమిటంటే అయోధ్యకాండ చివర్లో రాముడి నోటి వెంట వచ్చిన ఒక్క శ్లోకాన్ని ఆధారం చేసుకుని తాను చేయదల్చుకున్న ప్రతిపాదన కోసం మూలంలోని ఇన్ని శ్లోకాలనీ, సన్నివేశాలనీ, కీలకమైన మంధర పాత్రనీ – అన్నిటినీ రచయిత్రి ఎగరగొట్టేశారు.




ఈ విధంగా కావ్యమంతా పరచుకున్న ఎన్నో సంఘటనలూ సంభాషణలూ రాజ్యం పై హక్కు రాముడిదేనని స్పష్టం చేస్తూ ఉంటాయి. కాబట్టి కావ్యపఠన మర్యాదకు సంబంధించినంతవరకు, రాముడి నోటి వెంట వచ్చిన ఆ ఒక్క శ్లోకాన్నీ కావ్యం మొత్తంలో ఉన్న అంశాలకు అనుకూలంగా సమన్వయించుకోవడం, అక్కడ ఆ పాత్ర చేత (రాముడి చేత) అలా చెప్పించడంలో కవి ఉద్దేశం ఏమై ఉంటుందని ఆలోచించడం సబబు కానీ, ఆ శ్లోకం ఆధారంగా కవినే సందేహించి ఆ ఒక్క శ్లోకమూ **"బయటపడిన నిజము"** అనీ, మిగతాదంతా **"కవి చేసిన వంచన"** అనీ నిర్ణయించడం పద్ధతి కాదు.

మూలరచనకు సంబంధించినంతవరకు రంగనాయకమ్మగారి ప్రతిపాదన పొసగదన్నది చాలా స్పష్టం.

**రచయిత్రి కల్పించిన కథలోని వైరుధ్యాలు:**

తనకు కావల్సిన భావం వచ్చేట్లుగా మూలంలోని సంభాషణలను కొద్దిగా మార్చడం గురించి పైన చెప్పుకున్నాం. అది మాత్రమే కాకుండా అసలు మూలంలో లేని కొన్ని కొత్త సంభాషణలను కూడా కల్పించి వ్రాశారు రచయిత్రి.

**'కైకని పెళ్ళాడినపుడే ఆమె బిడ్డకు రాజ్యం ఇస్తానని దశరథుడు అని ఉంటే, మరి మళ్ళీ కొత్తగా వరాలు అడగవలసిన అవసరం ఏమి వచ్చింది?'** అనే ప్రశ్న పాఠకులకు వస్తుంది కనుక దానిని నివారించడం కోసం కథని కొంత మార్చారు.

రంగనాయకమ్మగారు మార్చిన కథ ప్రకారం **"దశరథుడు రాగానే కైక మొదట పెళ్ళప్పుడు మీరిచ్చిన వాగ్దానం ఏ గంగలో కలిసింది?"** అని నిలదీస్తుంది.

దశరథుడు నిర్ఘాంతపోతాడు. ఎప్పుడో పాతికేళ్ళ క్రితం ఇచ్చిన మాటను గుర్తుపెట్టుకుని తనపట్ల ఎంతో వినయం చూపే భార్య ఇంత నిర్భయంగా నిలదీస్తుందని ఆయన ఊహించడు. భరతుడినీ అతడి తాతనీ ఏమార్చగలిగితే చాలనుకున్నాడు కానీ ఇదేమిటిలా అయిందని మొదట ఆశ్చర్యపోతాడు కానీ అంతలోనే ఆయనకి పట్టరాని కోపం వస్తుంది. కైక **"రామపట్టాభిషేకానికి నేను అంగీకరించను"** అంటే, **"నీ అంగీకారం ఎవరికి కావాలి? నేను వాగ్దానం చేసింది నీకు కాదు"** అని నిర్లక్ష్యంగా తల తిప్పుతాడు.

అప్పుడు కైక మండిపడుతూ **"నీ సత్యవ్రతంలో సత్యం ఎంతో నువు నిరూపించుకున్నావు, నా హక్కేమిటో నేనూ నిరూపించు కుంటాను"** అంటూ వరాలు అడుగుతుంది. దశరథుడు మళ్ళీ నిర్ఘాంతపోతాడు.

ఇక ఆతరువాత అయిదారు పేజీలలో దశరథుడికీ కైకకు మధ్య సంభాషణను ఇంతకు ముందు చెప్పుకున్నట్లుగానే **"కొద్దిగా"** మార్చీ, కొన్ని కొత్త మాటలు చేర్చీ తన ప్రతిపాదనకు అనుకూలత తీసుకువచ్చే ప్రయత్నం చేస్తారు రచయిత్రి. చివరికి దశరథుడు కైకకి వరాలు ఇవ్వాలా మానాలా అని ధర్మసంకటంలో పడి కొట్టుకుని, ఇవ్వకపోతే తాను నరకంలో పడిపోతానని భయపడి, అది ఎంత అప్రతిష్ట! ఎంత అపకీర్తి! అని బాధపడి, తన పూర్వీకులందరూ పొందిన స్వర్గసుఖాలు తనకు దక్కవేమోనన్న భయంతో తండ్రెవరు కొడుకెవరు అన్న వైరాగ్యంలోకి దిగుతాడు. సత్యమే బ్రహ్మం, సత్యమే ధర్మం, సత్యపాలన వలనే మోక్షం అని వేదాలు చెప్తున్నాయి కదా అని తలపోస్తూ స్వర్గారోహణ సౌఖ్యాన్ని ఊహించుకుంటూ దశరథుడు కళ్ళుమూసుకోవడంతో ఆ అధ్యాయాన్ని ముగిస్తారు రచయిత్రి.

ఈ కల్పనలో ఎన్ని పొసగని విషయాలున్నాయో చూడండి.

1. కడుపులో అంత కుట్ర పెట్టుకుని ఉన్న దశరథుడు, ఒకప్పుడు తాను ఇచ్చిన వాగ్దానం ఇపుడు తనకు నచ్చిన పని చేయడానికి అడ్డం వస్తుందేమోనన్న భయంతో అప్పటిదాకా రాముడితో మంతనాలు జరిపి వచ్చినవాడు, **"ఎప్పుడో పాతికేళ్ళ క్రితం ఇచ్చిన మాటని కైక గుర్తు పెట్టుకుని నిలదీస్తుందని ఊహించలేదు"** అనడం ఎలా పొసగుతుంది?

2. దశరథుడు భరతుడినీ అతడి తాతనీ ఏమార్చగలిగితే చాలనుకున్నాడు కానీ కైక విషయంలో అనుమానించలేదంటారిక్కడ రచయిత్రి. కానీ ఆవిడ కల్పన ప్రకారం కూడా తండ్రి వాగ్దానం విషయం భరతుడికి అసలు ఏమాత్రం తెలియదు. విషయం తెలిసిన కైక నుంచి కాక తెలియని భరతుడి నుంచి ప్రమాదం వస్తుందని దశరథుడు ఊహించడం అసంబద్ధంగా ఉంది. నిజానికి అంతఃపురంలో చర్చల వల్ల సీతకు కూడా తెలిసిన విషయం భరతుడికి అసలేమాత్రమూ తెలియదని వ్రాయడం కూడా అసంబద్ధంగానే ఉంది.

**"ఈ రాజ్యాధికారాల విషయం చిన్నతనం నుంచీ భరతుడికేమీ తెలీదు. అతని తాతగానీ, మేనమామగానీ, తల్లిగానీ ఎన్నడూ ఆ సంగతి అతనితో ప్రస్తావించలేదు. అందరూ దశరథుడి సత్యవ్రతం మీదే నమ్మకం పెట్టుకుని ఊరుకున్నారు. తండ్రి రాజ్యం తనకే హక్కు అనే సంగతి భరతుడు ఎంత మాత్రం ఎరగడు. రాజ్యం కోసం ఎలాంటి ఆలోచనలూ లేవు. ఎలాంటి మంత్రాంగాలూ లేవు. ముందు జాగ్రత్తలు లేవు. అసలు రాజు కావాలనే ధ్యాసే లేదు భరతుడికి"** అని చాలా స్పష్టంగా చెప్తారు రచయిత్రి తన కథలో (పుట 426).

అంత జాగ్రత్తపడి వాగ్దానం తీసుకున్న కేకయరాజు కానీ, ఆ వాగ్దానాన్ని గుర్తుపెట్టుకుని భరతుడికే రాజ్యం వస్తుందని భావిస్తున్న కైక కానీ ఆ విషయం అతనికి ఎందుకు చెప్పలేదు!? తర్వాత రాజు కావలసిన వాడిని అంతటి అజ్ఞానంలో ఎందుకు ఉంచారు? రాముడు రాజవుతాడు నేను ఆయనకి సేవ చేస్తూ ఉండాలి అనే భావనలో భరతుడిని అతని తల్లీ, తాతగారూ ఎందుకు ఉంచారు? ఈ ప్రశ్నలేవీ రచయిత్రి వేసుకున్నట్లు కనబడదు.

ఒకవేళ రంగనాయకమ్మగారు చెప్పిన ఈ విషయం – కైక గానీ ఆమె తండ్రిగానీ ఈ ప్రస్తావన భరతుడి దగ్గర ఎప్పుడూ చేయలేదన్న విషయం – నిజమే అనుకోవాలంటే, దానికి **"అందరూ దశరథుడి సత్యవ్రతం మీదే నమ్మకం పెట్టుకుని ఊరుకున్నారు కనుక చెప్పలేదు"** అన్న కారణం బాగా పొసగుతుందా! **"ఎప్పుడైతే కైకకు కూడా సంతానం కలగలేదో, పట్టమహిషి కౌసల్యకే మొదట సంతానం కలిగిందో అప్పుడు ఆ మాట దానంతట అదే వీగిపోయింది, కాబట్టి ఇక భరతుడి దగ్గర ఆ ప్రస్తావన ఎవరూ చేయలేదు"** అన్న కారణం బాగా పొసగుతుందా? పాఠకులు ఆలోచించాలి.

3. ఇక **"నేను వాగ్దానం చేసింది నీకు కాదు"** అని నిర్లక్ష్యంగా తల తిప్పుకున్న దశరథుడిని మళ్ళీ ఒకప్పుడు ఇచ్చిన వరాలు నెరవేర్చమని అడగడం, ఆయన సత్యవ్రతంలో సత్యం లేదని అర్థమయిపోయాక కూడా మళ్ళీ ఆయన సత్యవ్రతం మీదే కైక ఆధారపడడం ఒక వింత అయితే, మొదటి వాగ్దానం విషయంలో అసత్య దోషానికి వెరవకుండా బుకాయించిన దశరథుడు వరాల విషయంలో మాత్రం మాట తప్పితే నరకంలో పడిపోతానేమోనని భయపడటం మరొక వింత.

ISSN 2457-0796


సత్యవ్రతం మీద నమ్మకమూ నరకంలో పడిపోతానన్న భయమూ దశరథుడికి ఉంటే మొదటి వాగ్దానాన్నీ వదిలేయడు కదా! లేదు, అలాంటి నమ్మకాలేమీ ఆయనకు లేవంటే రెండవ దాన్నీ పాటించడు కదా! అంటే రంగనాయకమ్మగారి కథ ప్రకారం చూసినా కూడా రాముని జననంతో మొదటి మాట వీగిపోయిందనీ, దానిని పాటించ వలసిన అవసరం లేదనీ, అందుకే దశరథుడికి ఆ మాట విషయంలో నరకభయమూ అపకీర్తి భయమూ కలగలేదనీ స్పష్టమవుతోంది.

**పాత్రల వైపు నుంచి వైరుధ్యాలు :**

కథను ఆధారం చేసుకుని పరిశీలిస్తే, అటు మూలకథ లోనూ ఇటు రంగనాయకమ్మ గారి కథలోనూ కూడా రాజ్యం భరతుడికి చెందాలన్న విషయం పొసగడం లేదని పైన చూశాము.

ఇదే విషయాన్ని పాత్రలని ఆధారం చేసుకుని పరిశీలిస్తే, అపుడు కూడా **'రాజ్యంపై హక్కు భరతుడిదే'**నన్న రంగనాయకమ్మగారి వాదన ఏ పాత్ర వైపు నుంచి చూసినా కూడా పొసగదు.

ఈ పరిశీలనకు మూల కథను చూడవద్దు. వాల్మీకి చెప్పినదాన్ని పూర్తిగా నమ్మదలచుకోలేదు కనుక ఆయన చెప్పిన మాటలని తీసుకోవద్దు. రంగనాయకమ్మ గారి కథనే తీసుకుందాం. ఆవిడ చేస్తున్న ప్రతిపాదన పొసగుతుందా లేదా అన్న విషయాన్ని ఆవిడ తన ఇచ్ఛానుసారంగా మార్చిన ఆవిడ కథలోనే పరిశీలిద్దాము.

**దశరథుడు :**

దశరథుడి పాత్రచిత్రణలోని అసంబద్ధతను పైన కొంత చెప్పుకున్నాం. ఒకపక్కన కేకయరాజుకు ఇచ్చిన వాగ్దానాన్ని అమలుపర్చనని దబాయించడం, మరొకపక్కన కైకకు ఇచ్చిన వరాలను అమలుపర్చకపోతే నరకంలో పడిపోతాననీ అపకీర్తి వస్తుందనీ భయపడటం! ఎంతటి వైరుధ్యమిది! ఇదొక్కటే కాదు, అసలు ఈ సన్నివేశం మొత్తం అనౌచిత్యాలతోనే నిండి ఉంటుంది.

కైక అలిగినపుడు నీకేం కావాలో కోరుకో ఇస్తాను అని బ్రతిమిలాడుతున్న సందర్భంలోనే దశరథుడు **"ఎందుకింత పట్టుబట్టింది?"** అని ఆలోచనలో పడ్డాడని వ్రాస్తారు రచయిత్రి (పుట 264). కైక ఇంకా మౌనాన్ని వీడకముందే, పట్టాభిషేకం గురించీ, పెళ్ళప్పుడు ఇచ్చిన వాగ్దానం గురించీ నిలదీయకముందే, **"ఎందుకింత పట్టుబట్టింది?"** అని ఆలోచనలో పడిన దశరథుడు, ఆమె పట్టాభిషేకం గురించీ భరతుడి హక్కు గురించీ నిలదీశాక, ఇద్దరికీ కొంత వాదన జరిగాక, అప్పుడు ధిక్కారంగా మాట్లాడుతూ వరాల ప్రసక్తి తెస్తే ఆమె ఏమి అడుగుతుందో ఊహించలేడా! ఏమీ ఆలోచించకుండా వరాలివ్వడానికి సిద్ధమేనంటాడా?

నిజానికి ఇక్కడ రచయిత్రి **"దశరథుడు లోపల కంపిస్తూ తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో 'నీ వరాలు నీకివ్వడానికి ఈ దశరథ మహారాజు ఎప్పుడూ సిద్ధమే' అంటూ మీసం సవరించుకున్నాడు"** అని వ్రాయడాన్ని బట్టి కైక అడగబోయేదాన్ని ఆయన ఎంతో కొంత



ఊహించాడనే అనుకోవాలి. అయితే తీరా కైక వరాలడిగాక దశరథుడు వెర్రిచూపు చూశాడనీ, నిర్ఘాంతపడి కూర్చున్నాడనీ అంటారు మళ్ళీ. అంతేకాదు భార్యలు పట్టుచీరలో రత్నహారాలో అడగడం మాత్రమే దశరథుడికి తెలుసుననీ అందుకని కైక ఇంత చిత్రమైన కోరికలు కోరుతుందని **"లీలగానయినా ఊహించలేక పోయా"**డనీ వ్రాస్తారు.

**'నీ సత్యవ్రతంలో సత్యమేమిటో నిరూపించుకున్నావు కదా ఇప్పుడు నా హక్కేమిటో నేను నిరూపించుకుంటా'**నన్న ధిక్కారమైన మాట తర్వాత కైక వరాల ప్రసక్తి తెస్తే, ఆమె ఏమడుగుతుందో దశరథుడు లీలగానయినా ఊహించలేకపోవడమేమిటన్నది ఒక ప్రశ్న అయితే, లీలగా కూడా ఊహించనివాడు **'లోపల కంపిస్తూ తెచ్చి పెట్టుకున్న గాంభీర్యంతో'** ఎందుకు మాట్లాడాడన్నది మరొక ప్రశ్న. ఈ విధంగా ఒక వాక్యానికీ మరొక వాక్యానికీ పొంతన లేకుండానే ఈ సన్నివేశమంతా నడుస్తుంది.

ఇక దశరథుడు కేకయరాజుకు ఇచ్చిన వాగ్దానం గురించి కూడా ఈ కథలో ఒక్కొక్క చోట ఒక్కొక్క రకంగా ఉంటుంది. **"అంతఃపురంలో రాముడికి పట్టపురాణి కొడుకనే గౌరవం, భరతుడు కాబోయే యువరాజనే మర్యాద"** ఉంటాయనీ, **"దశరథుడి వాగ్దానం సంగతి పురోహితులకీ రాణులందరికీ తెలుసు"** ననీ పుట 256 లో ఉంటే, **"రాజ్యం భరతుడికే హక్కు అనే విషయం అంతఃపురాలలో తప్ప ప్రజలకెవరికీ తెలీదు"** అని పుట 260 లో ఉంటుంది. ప్రజల లోనూ ఈ విషయంపై గుసుగుసలు ఉన్నట్లు మరొకచోట ఉంటుంది. **"అసలు కత శానా ఉంది నే సెప్తా ఇను. భరతుడికే అక్కుంటయ్యా రాజ్యం, కైకమ్మని పెళ్ళాడినప్పుడు నా రాజ్యవంతా నీకొడుక్కే ఇచ్చేత్తానన్నాడంట"** అని ఒక రైతు అన్నట్లు పుట 324లో ఉంటుంది.

కాబట్టి ఈ వాగ్దానం విషయం ఎవరెవరికి తెలుసు ఎవరెవరికి తెలీదు, లక్ష్మణుడికి శత్రుఘ్నుడికి తెలుసా తెలియదా వంటి వివరాలు ఈ కథను బట్టి కచ్చితంగా చెప్పలేకపోయినా, రాణులకు,

పురోహితులకి, ప్రజల్లో కొందరికీ తెలుసని అర్థమవుతోంది. ఇక కైక వరాలడిగినదేమో ఏకాంతంలో కోపగృహంలో. మొదటిది ఇప్పటికే బయటకు తెలిసిపోయిన విషయం. రెండవది మూడో కంటికి తెలియకుండా నియంత్రించగలిగిన విషయం. అటువంటపుడు దశరథుడు మొదటిదాన్ని లెక్కచేయలేదనీ రెండవదానికి లొంగిపోయాడనీ చెప్పడం ఏవిధంగానూ పొసగదు. రాముడికి రాజ్యం కట్టబెట్టే కుట్ర చేయగల దశరథుడికి అంతఃపురంలోని కైక మాటలు బయటకు పొక్కకుండా చేసే పాటి తెలివితేటలుండవని అనుకోవడం కుదరదు.

నిజానికి ఈ మాట రంగనాయకమ్మ గారు కూడా వ్రాస్తారు.

అయోధ్యలోని మేధావులు **"మహారాజు చాలా తెలివితక్కువ పని చేశాడు సుమా! కైకని పుట్టింటికి పంపించి రాముడికి పట్టాభిషేకం చేస్తే సరిపోదూ!"** అని తలపోస్తున్నారనీ, ఆమాట విని **"అంత మోసం చేస్తే కేకయరాజు ఊరుకుంటాడా? సైన్యాలతో రాడూ?"** అని కొందరూ, **"వొస్తే రాముడు చూసుకుంటాడు! అతనేం చేతకాని వాడా? మహారాజు ఇన్నేళ్ళు రాజ్యం చేసి ఇంత చిన్న రాజకీయం గ్రహించలేకపోయాడేం చెప్మా?"** అని మరికొందరూ అన్నారనీ వ్రాస్తారు.

వాల్మీకి కథ ప్రకారం అయితే ఈ సమస్య లేదు. అక్కడ దశరథుడు సత్యానికి కట్టుబడటం వలన రాముడికి పట్టాభిషేకం చేయలేక పోయాడని కవి వ్రాశాడు కాబట్టి రాజుగారికి ఆమాత్రం రాజకీయం తెలియదా అన్న ప్రశ్న రాదు. కానీ ఇక్కడ రంగనాయకమ్మగారి కల్పనలో దశరథుడు రాజకీయంగా వ్యవహరించాలని, కుట్ర చేయాలని ప్రయత్నించాడు. ఈ దశరథుడికి సత్యంతో పనిలేదు. రాముడికి రాజ్యం కట్టబెట్టడం కోసం ప్రణాళిక ప్రకారం వ్యవహరించిన దశరథుడు, బయట నలుగురిలో తిరిగే భరతుడిని దూరంగా పంపిన దశరథుడు, అంతఃపురంలో అలకగృహంలో ఉన్న కైకనీ కైక మాటనీ బయటకి రాకుండా ఎందుకు నిగ్రహించలేదు? ఈ ప్రశ్నకు ఇక్కడ సమాధానం చెప్పవలసిన అవసరం ఉంది. కానీ రచయిత్రి ప్రశ్న మాత్రం వ్రాసి సమాధానాన్ని దాటవేశారు.

**కైక :**

కైక పాత్రలోని అసంబద్ధతని కూడా పైన చెప్పుకున్నాం. మొదటి వాగ్దానం తీర్చను పొమ్మని దబాయిస్తున్న వాడిని ఏ విధంగా నమ్మి కైక మరొక వాగ్దానం అడుగుతుంది? ఈ సన్నివేశంలో **"రాజ్యం ఇస్తానని మీ నాన్నకి చెప్పాను గానీ నీకు చెప్పానా!"** అని దశరథుడు అనడం, వెంటనే కైక **"సరే అయితే నాకు వరాలిస్తానన్నావు కదా అవి ఇయ్యి"** అని అడగడం చిన్నపిల్లల పోట్లాటలా ఉంది కానీ, కుట్రలు చేయగల రాజుగారూ, ఆ కుట్రని ఛేదించగల రాణీగారూ మాట్లాడుకోవడంలా లేదు.

**కేకయరాజు**

కైక పెళ్ళప్పుడు జరిగిన చర్చలని కాస్త వివరంగానే వ్రాస్తారు రచయిత్రి ఈ కథలో. అయితే పెళ్ళప్పుడు అంత దూరదృష్టితో వాగ్దానం తీసుకున్న కేకయరాజు అసలు ఈ విషయాన్ని మళ్ళీ ఎక్కడా పట్టించుకోడు. కనీసం భరతుడికి ఆ వాగ్దానం విషయం చెప్పనైనా చెప్పడు.

**భరతుడు :**

రాజ్యం తన హక్కు అయినపుడు, తనకు రాజ్యం రావడం న్యాయమే అయినపుడు భరతుడు మళ్ళీ రాజ్యాన్ని రాముడికి ఎందుకు ఇచ్చేయాలనుకున్నాడు?

అందుకు చాలా చిత్రమైన కారణం చెప్తారు రచయిత్రి. చిన్నప్పటినుంచీ ఈ రాజ్యాధికారాల విషయమేమీ భరతుడికి తెలియదనీ, అతనికసలు తాను రాజు కావాలనే ధ్యాసే లేదనీ, అందుకని హఠాత్తుగా రాజ్యం దక్కినప్పటికీ, తన రాజ్యాధికారం కారణంగానే అన్నగారు అడవులపాలవడం, తండ్రి మరణించడం వంటివి జరగడం అతడికి సంతోషం కలిగించలేదనీ, తనకు దక్కిన సిరిసంపదల మీద అతడికి జుగుప్సే కలిగిందనీ చెప్తారు. (పుట 427).

ఈ కారణం సహజంగాను సమంజసంగాను అనిపించడం లేదు. చనిపోయినది తనకు ద్రోహం చేయాలనుకున్న తండ్రి, అడవులకు వెళ్ళినది న్యాయంగా తనకు దక్కాల్సిన రాజ్యాన్ని కాజేయాలనుకున్న అన్నగారు - అటువంటపుడు భరతుడు వాళ్ళ గురించి అంత బాధపడటం, కైక చేసినది పాపకార్యమనీ దానివలన తనకూ కళంకం వచ్చిందనీ భావించడం సహజంగా లేదు. భరతుడు కైకను అంతగా నిందించడం ఈ కథకు పొసగదు.

వాల్మీకి రామాయణం ప్రకారమయితే కైక చేసింది ద్రోహం కానీ ఈ కథ ప్రకారం కాదు కదా! రంగనాయకమ్మ గారి కథ ప్రకారం కైక తన కొడుక్కి జరుగుతున్న ద్రోహాన్ని అడ్డుకుంది కానీ తానెవరికీ ద్రోహం చేయలేదు కదా! మరి భరతుడు అంత ఘోరంగా ఆమెని ఎందుకు నిందించాడు?

పుట 427లో చెప్పిన ఈ కారణం తనకే సమంజసంగా అనిపించనందువల్లనేమో రచయిత్రి కథ చివర్లో భరతుడు రాముడికి రాజ్యం ఇచ్చేయడానికి కారణం **"కీర్తికాంక్ష"** అని తేలుస్తారు. అందుకు వాల్మీకి రామాయణంలోని శ్లోకాన్ని ఆధారం చేసుకుంటారు. పాదుకలకు పట్టాభిషేకం చేశాక భరతుడు ఉపన్యాసమిచ్చాడనీ, ఆ ఉపన్యాసాన్ని **"ఈ పద్నాలుగు సంవత్సరాల తర్వాత రాజ్యం నా అన్నగారికి అప్పగించేశానంటే, నాకీ రాజ్యాన్ని మించి నాలుగురెట్లు కీర్తిప్రతిష్టలు కలుగుతాయి"** అంటూ ముగించాడనీ చెప్పి, భరతుడు చెప్పిన ఈ మాటలకి ఆధారం 115వసర్గలోని 21వ శ్లోకమని అథోజ్ఞాపికలో వివరిస్తారు. అక్కడ **"భరతుడు తన రాజ్యం రాముడికి ఎందుకు ఇచ్చేశాడో భరతుడే స్వయంగా కారణం చెప్తున్నాడు చూడండి"** అని వ్రాస్తారు (పుట 507).

**115వసర్గలోని ఆ శ్లోకం ఇది :**

అభిషిక్తే తు కాకుత్స్థే ప్రహృష్టముదితే జనే

ప్రీతిర్మమ యశశ్చైవ భవేద్రాజ్యాచ్చతుర్గుణమ్ ॥2.115.21॥

దాని భావం: **"రాముడు అభిషిక్తుడైన పిమ్మట జనులందరు మిక్కిలి సంతోషముతో ఆనందించెదరు. అప్పుడు నాకు రాజ్యము వలన వచ్చినదానికంటే నాలుగు రెట్లు ఎక్కువ ఆనందము, కీర్తి కలుగును"**

మూలంలోని భావాన్ని రచయిత్రి ఎలా మార్చేశారో ఇక్కడ స్పష్టంగా చూడవచ్చు. జనులందరు మిక్కిలి సంతోషముతో ఆనందిస్తారన్న మాట పోయింది, నాకు ఆనందం కలుగుతుంది అన్న మాట పోయింది. అవి రెండూ తీసేసి నాలుగురెట్లు కీర్తిప్రతిష్టలు కలుగుతాయి అన్న ఒక్క మాట మాత్రమే చెప్పిస్తారు భరతుడితో రచయిత్రి తన కథలో. ఆమాట విన్న పౌరులు **"చూశావా? భరతుడు గొప్పకోసం కాకపోతే ఊరికే రాజ్యం ఇచ్చేస్తాడా ఏమిటని మొదటే చెప్పలేదూ నేను?"** అని ఒకరూ, **"ఎన్ని రెట్లయితే ఏవిట్లే, మొత్తంగా కీర్తి వస్తుందని రాజ్యం ఇచ్చేశాడబ్బాయ్. అదీ సంగతి!"** అని మరొకరూ అన్నట్లు కల్పన చేస్తారు (పుట 508).

సరే, ప్రజలంటే రకరకాలుగా ఉంటారు కాబట్టి రకరకాలుగా మాట్లాడతారు. కానీ రచయిత్రి ఈ మాటలని పట్టుకుని **"భరతుడు తన రాజ్యం రాముడికి ఎందుకు ఇచ్చేశాడో భరతుడే స్వయంగా కారణం చెప్తున్నాడు చూడండి"** అనడమే చిత్రం.

పోనీ మూల శ్లోకాన్ని వదిలేసి రంగనాయకమ్మగారు వ్రాసిన భావాన్నే తీసుకున్నా, భరతుడు కీర్తి కోసం రాజ్యం ఇచ్చేశానని ఎక్కడ చెప్పాడు? **"రాజ్యం నా అన్నగారికి అప్పగించేశానంటే, నాకీ రాజ్యాన్ని మించి నాలుగురెట్లు కీర్తిప్రతిష్టలు కలుగుతాయి"** అన్నాడు కానీ **"రాజ్యాన్ని మించి నాలుగురెట్లు కీర్తిప్రతిష్టలు సంపాదిద్దామని రాజ్యం నా అన్నగారికి అప్పగించేశాను"** అనలేదు కదా!

ఈలెక్కన ఎవరైనా **"ఈపూట విందులో నాకు పడని పదార్థాలన్నీ తినేశానోయ్, రేపు కడుపునొప్పితో బాధపడాలి"** అంటే **"చూశావా, రేపు కడుపు నొప్పితో బాధపడదామనుకుని ఈపూట పడని పదార్థాలన్నీ తిన్నాడట"** అని చెప్పుకోవాలి కాబోలు!

**రాముడు :**

రాముడి పాత్రచిత్రణకు సంబంధించి రెండు అంశాలు చెప్పుకుందాం.

**'చెప్పులపాలైన సింహాసనం'** కథ ప్రకారం రాముడికి విపరీతమైన రాజ్యకాంక్ష, దానిని మించిన కీర్తికాంక్ష. అందుకే మొదటిసారి భరతుడికి హక్కయిన రాజ్యాన్ని తండ్రి తనకు కట్టబెడుతుంటే అభ్యంతరం చెప్పకుండా ఆనందించినవాడు కూడా చివరికి కీర్తికాంక్షతో అడవులకు బయల్దేరతాడు. అలాగే రెండవసారి భరతుడు వచ్చి రాజ్యాన్ని అప్పగించినపుడు మనసు లోలోపల తీసుకోవాలనే అనిపిస్తున్నా కీర్తికాంక్షతోనే రాజ్యాన్ని తిరస్కరిస్తాడు.

రాముడికి రాజ్యకాంక్ష కీర్తికాంక్ష ఉన్నాయన్న విషయాన్ని ఈ కథలో కొన్నిచోట్ల వాచ్యంగా చెప్తారు రచయిత్రి. (ఉదా: అటువంటి తల్లిని విడచి రాముడు పితృభక్తితో, కీర్తికాంక్షతో తర్వాతి కార్యానికి కదిలాడు – పుట 296). మరికొన్నిచోట్ల రాముడి ఆలోచనలద్వారా మాటల ద్వారా చెప్పే ప్రయత్నం చేస్తారు.

అయితే ఈ ప్రయత్నం ఎంతవరకూ సఫలీకృతమయింది? ఏ వైరుధ్యాలూ అనౌచిత్యాలూ లేకుండా ఈ విషయాన్ని రచయిత్రి ఈ కథలో చెప్పగలిగారా అన్న విషయాన్ని కొంచెం చూడాలి.

భరతుడు వచ్చి రాజ్యాన్ని అప్పగిస్తే తీసుకోకపోవడం కీర్తికాంక్షతో అన్న విషయాన్ని ఆ సన్నివేశానికి చివర్లో తేలుస్తారు కానీ అంతకన్నా ముందు రాముడి మనసులో మెదిలిన ఆలోచనలనీ భావాలనీ రకరకాలుగా చెప్తారు రచయిత్రి.

ఆ సన్నివేశంలో అందరూ రాముడికి నచ్చచెప్పడం అయిపోయాక వశిష్టుడు కూడా ప్రయత్నిస్తాడు. అప్పుడాయన లోకోత్పత్తి క్రమం అంతా చెప్పి **"నాయనా జ్యేష్ఠపుత్రుడివి కనుక నువ్వే రాజ్యార్హుడివి"** అంటే రాముడికి ఒళ్ళు మండిపోతుంది.

**"అయోధ్యలో ఏంచేశాడీ పెద్దమనిషి? ఈ దండకం అంతా దశరథుడి మొహం మీదే చదివి ఆయన్నే వొప్పించలేకపోయాడేం? అక్కడ తనకేమీ పట్టనట్టు ఊరుకున్నాడేం? ఛీ ఈ బ్రాహ్మలు ఎంతకయినా తగుదురు"** అనుకుంటాడు. అతని పట్టుదల ఇంకా ఎక్కువవుతుంది. ఆస్థాన పురోహితులై వుండి, ఎప్పుడేది చెప్పాలో అది చెప్పకుండా – **"ఈ పండితులందరూ తమకేమీ పట్టనట్టు ఊరుకోవడం ఏమిటి? వాళ్ళకిష్టమైనప్పుడు రమ్మని పిలిస్తే వెళ్ళేదెవరు? ఏమయినా సరే వెళ్ళకూడదంతే"** అనుకుంటాడు.

ఈ వాక్యాలు చదవగానే ఫక్కున నవ్వొస్తుంది. ఈ పిచ్చితండ్రినా రాజ్యం కోసం కుట్రలు చేసేంతటి వాడిగా ఇప్పటివరకూ రచయిత్రి వర్ణిస్తున్నది! అనిపిస్తుంది.

రాముడిని ఎలా చిత్రించాలి? దుర్మార్గుడిగానా, అసమర్థుడిగానా, లౌక్యుడిగానా, డాంబికుడిగానా, మరొక మరొక రకంగానా అన్న విషయాన్ని రచయిత్రి బాగా ఆలోచించారో లేదో తెలియదు. లేదా సర్వ అవలక్షణాలూ ఉన్న పాత్రగా చిత్రించాలనుకున్నారేమో! రాముడి అవలక్షణాలకు రాముడే కారకుడు కాదనీ, **"అతను పాటించిన ధర్మాలూ నీతులూ అతనికా వికృతరూపాన్ని ప్రసాదించాయి"** అనీ అంటారు పీఠికలో. వాల్మీకి కావ్యంలోని రామునిలో ఆవిడ ఒక వికృత రూపాన్ని దర్శించారు. అటువంటి వికృత రూపాన్నే ఈ కథలో చిత్రించాలని ప్రయత్నించారు. అందుకే బహుశా ఎన్నో వైరుధ్యాలను ఆ పాత్రలో నింపారు. కానీ ఆ వ్యూహం బెడిసికొట్టిందనిపిస్తుంది. దానివలన పాఠకులకి ఈ కథలోని రాముడు వాల్మీకి రాముడితో ఏ

చిన్న సంబంధమూ, పోలికా లేనివాడిగా కనిపించడమే కాదు. అసలు ఒక జీవమున్న మనిషిలా కూడా కాకుండా రచయిత్రి చేతిలోని ఆటబొమ్మలా కనిపిస్తాడు.

పై సన్నివేశమే చూడండి. ఈ వ్యవహారానికి సంబంధించినంత వరకూ రాముడు మాట్లాడే రకరకాల మాటల్లో, చేసే రకరకాల ఆలోచనలలో ఇవే చివరివి. చివరిగా నిర్ణయం తీసుకునే ముందు అతనికి కలిగిన ఆలోచనలు ఇవే. చిన్నపిల్లాడి హఠంలా ఉన్న ఈ ధోరణి చూశాక, **"వాళ్ళకిష్టమైనప్పుడు రమ్మని పిలిస్తే వెళ్ళేదెవరు? ఏమయినా సరే వెళ్ళకూడదంతే"** అని అనుకున్నాడని చదివాక ఇక ఆ పాత్ర ఒక రాజ్యకాంక్ష గలవాడిగా కీర్తికాంక్ష గలవాడిగా పాఠకుని మనసులో నిలబడే అవకాశం ఉంటుందా!

ఇక దశరథుడు కేకయరాజుకు చేసిన వాగ్దానం గురించి రాముడు భరతుడితో చెప్పడం – 107వ సర్గలోని ఈ శ్లోకం గురించి చెప్తూ **"ఈ ఒక్క శ్లోకం మీదే రామాయణం అంతా ఆధారపడి ఉంది"** అంటారు రచయిత్రి (పుట 465). ఈ విషయాన్ని పెద్ద అక్షరాలతో ప్రచురించారు ఈ పుస్తకంలో.

అయితే ఇది (రాముడు భరతుడితో దశరథుని వాగ్దానం గురించి చెప్పడం) వాల్మీకి రామాయణంలోనే కాదు రంగనాయకమ్మ గారి కథలోనూ వైరుధ్యమే అవుతుంది.

వాల్మీకి రామాయణంలో ఈ శ్లోకం వలన **"విషయం తెలిసీ పట్టాభిషేకానికి ఒప్పుకున్న రాముడు సత్పురుషుడు ఎలా అవుతాడు?"** అన్న ప్రశ్న వస్తే, ఈ కథలో **"సత్పురుషుడు కాని రాముడు, కుట్ర చేయాలనుకున్న రాముడు ఈ రహస్యాన్ని ఇపుడు అందరి ముందూ ఎందుకు బయటపెట్టాడు?"** అన్న ప్రశ్న వస్తుంది. కాబట్టి ఈ విషయం నిజానికి రంగనాయకమ్మ గారి కథలో ఉండకూడదు. కానీ ఆవిడ ఈ విషయాన్ని కథలో ఉంచి, అథోజ్ఞాపికలో **"ఈ రహస్యాన్ని ఇప్పుడైనా ఎందుకు బయట పెట్టాడంటే, ఇక చెప్పినా ఫరవాలేదనీ, భరతుడు రాజ్యం తనకే ఇస్తానన్నాడనీ!"** అని చెప్తారు.

ఈ వివరణ ఎంతవరకూ సమంజసంగా ఉంది, వైరుధ్యాన్ని సమన్వయించడంలో ఎంతవరకూ సఫలమయింది అన్న విషయాన్ని పాఠకులు ఆలోచించాలి.

వాల్మీకి రామాయణంలో ఈ వైరుధ్యానికి చాలామంది పాఠకులు చెప్పుకునే ఒక సమన్వయాన్ని (రాముడు దాన్ని ఒక సర్దుబాటు మాటగా చెప్పాడన్న విషయాన్ని) గురించి ఈ వ్యాసం మొదట్లో చెప్పుకున్నాం. నాకయితే ఇక్కడ తన కథలోని వైరుధ్యానికి రచయిత్రి చెప్పిన సమన్వయం కంటే అక్కడ రామాయణంలోని వైరుధ్యానికి పాఠకులు చెప్పుకుంటున్న సమన్వయమే బలంగా ఉందనిపిస్తోంది.

**ముగింపు**

రంగనాయకమ్మగారు ప్రతిపాదించినట్లు రాజ్యంపై హక్కు భరతుడిదేననీ, ఆ విషయాన్ని వాల్మీకి దాచిపెట్టాలనుకున్నా కూడా బయటపడిపోయిందనీ అనుకోవాలంటే, ఆ ప్రతిపాదన మీద ఆవిడ వ్రాసిన కథను ఒప్పుకోవాలంటే పైన చెప్పుకున్న ప్రశ్నలన్నీ తలెత్తుతాయి, అనౌచిత్యాలన్నీ ముందుకు వస్తాయి. వాటికి సమాధానాలు, సమన్వయాలు దొరికినపుడు మాత్రమే ఆ ప్రతిపాదన గురించి ఆలోచించడానికి వీలవుతుంది.

అసలింతకీ ఇక్కడ రామాయణంలో రంగనాయకమ్మగారు వైరుధ్యం అంటున్నది ఒకవేళ వైరుధ్యమే అయితే అది కవి పరిహరించలేనంత క్లిష్టమైనది కాదు. కొన్ని వైరుధ్యాలు పరిహరించడానికి కుదరనివిగా ఉంటాయి. ఒక్కచోట కేంద్రీకృతమై ఉండకుండా కావ్యమంతా పరచుకుని ఉండడం, దాన్ని తీసే ప్రయత్నం చేస్తే మొత్తం కథంతా దెబ్బ తినడం, కథ ముందుకు సాగే అవకాశం లేక పోవడం – ఇలాంటి ఇబ్బందులు ఉంటాయి. కానీ ఇక్కడ అలాంటి సమస్యేమీ లేదు. కవి ఆ విషయాన్ని రాముడి చేత అక్కడ చెప్పించాలని అనుకుని ఉండకపోతే చెప్పించకుండానే ఉండవచ్చు. ఆ ఒక్క శ్లోకాన్నీ పెట్టకుండా ఊరుకోవచ్చు. కాబట్టి దీనిని కవి దాచిపెట్టాలనుకుని కూడా కుదరక గత్యంతరం లేక చెప్పిన విషయంగా (వైరుధ్యంగా) కాకుండా, చెప్పాలనుకుని చెప్పిన విషయంగా భావించడమే సమంజసంగా ఉంటుంది.

కానీ రంగనాయకమ్మగారు అలా భావించరు. ఇది వైరుధ్యమేననీ, కవి ఈ వైరుధ్యాన్ని పరిహరించలేకపోవడానికి కారణం కావ్యానికి బయట ఉందనీ అంటారు. రామాయణాన్ని ఒక కావ్యంగా వాల్మీకి చెప్పడానికి ముందే రాజ్యంపై హక్కు రాముడిది కాదు భరతుడిది అన్న విషయం **"ప్రజలలో ప్రచారమై వుండివుండాలనీ"**, అందుకే ఆ విషయాన్ని పూర్తిగా పక్కకు పెట్టలేక దానిని ఒక మూలకు తోసి సాధ్యమైనంత మరుగుపరచాలని కవి తాపత్రయ పడ్డాడనీ అంటారు. (పేజి 14).

ఈ ఊహ చాలా హాస్యాస్పదంగా ఉంది. ప్రజలలో ప్రచారమై పోయిన ఒకానొక విషయానికి విరుద్ధంగా కావ్యమంతా వ్రాసిన కవికి ఎక్కడో ఒకమూల దానిని ఇరికించవలసిన అవసరం ఎందుకు వస్తుంది? దాని వలన కవికి గానీ కావ్యానికి గానీ ఒనగూడే ప్రయోజనం ఏమి ఉంటుంది?

సరే పోనీ ఒకవేళ ఈ హాస్యాస్పదమయిన ఊహని కాసేపు ఒప్పుకుందామని అనుకున్నా కూడా లాభమేమీ లేదు. ఎందుకంటే తన అభిప్రాయానికి ఆధారంగా రంగనాయకమ్మగారు చూపినది **"ప్రజలలో ప్రచారమై వుండివుండాలి"** అన్న ఒక ఊహ మాత్రమే. అది తప్ప మరింక ఏ బలమైన ఆధారాలనీ ఆవిడ అందివ్వలేదు. వాల్మీకి కన్నా ముందు నుండీ ప్రచారంలో ఉన్న కథలలో మరొక సత్యం – రాజ్యంపై హక్కు భరతుడిదే నన్న సత్యం – ప్రధానంగా ఉందన్న విషయాన్ని రచయిత్రి నిరూపించి ఉంటే ఆవిడ అభిప్రాయాన్ని చర్చించడానికీ ఒప్పుకోవడానికీ ఏమైనా అవకాశం ఉండేదేమో! కానీ అలాంటివాటినేమీ రచయిత్రి చూచాయగానైనా పేర్కొనలేదు. **"ఉండి ఉండాలి"** అన్న ఊహ తర్కానికీ వాదానికీ నిలబడదు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 15 హైదరాబాద్ మే : 2025

# నలిమెల భాస్కర్ అనువాద కథలు – కళా సౌందర్యం

**డా. తత్త్వాది ప్రమోద కుమార్,** సహ ఆచార్యులు, తెలుగు విభాగం, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వ), జగిత్యాల
ఫోన్ : 9441024607



**వ్యాస సంగ్రహం :**

అనువాద సాహిత్య ప్రక్రియలో డాక్టర్ నలిమెల భాస్కర్ గారు అందవేసిన చేయి. వీరి అనువాద కథల్లోని భాష, శైలి, కళ మొదలైన విషయాలను గూర్చి చర్చించడమే వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. వ్యాసాంశాన్ని వస్తు, భావ, శైలి, భాష, కళ మొదలైన ఉప విభాగాలుగా విభజించి వ్యాసాన్ని పూర్తి చేసాను. అనువాద ప్రక్రియలో ఆసక్తి కలవారు అనువాదాలు ఎలా చేయాలో వీరి నుంచి తెలుసుకొనడానికి ఈ వ్యాసం ఉపయోగపడుతుందని ఆశిస్తున్నాను.

Key Words : నలిమెల భాస్కర్, అనువాద సాహిత్యం, మూల భాష, లక్ష్య భాష, తెలుగు, మలయాళం, కన్నడం, తమిళం, సౌందర్యం.

**ఉపోద్ఘాతం :**

నలిమెల భాస్కర్ గారు సృజన సాహిత్యంతో పాటు అనువాద సాహిత్యాన్ని లెక్కకు మిక్కిలి సృష్టించారు. కథలు, నవలలతో పాటు కవిత్వం మొదలైన వివిధ ప్రక్రియల్లో అనువాదాలు చేశారు. వందల కొలదిగా అనువదించిన వీరి అనువాద కథలలోని సాహిత్యంశాలు ఏ విధంగా ఉన్నాయో వివరించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. భాస్కర్ గారి రచనలపై, అనువాద సాహిత్యం పై విశ్వవిద్యాలయాల్లో పరిశోధనలు కొనసాగుతున్నాయి. వీరి అనువాద కథల్లోని సాహిత్యంశాలతో పాటు అనువాద విధానం ఎలా ఉందో ఈ వ్యాసంలో తెలియచేస్తున్నాను.

**వ్యాసాంశం :**

నలిమెల భాస్కర్ పరిచయం చేయనక్కర లేని పేరు. నేటి తెలుగు సాహితీ గగనంలో జాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న భాస్కరుడు. అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా, కవిగా, కథా రచయితగా, అనువాద రచయితగా, బహుభాషా వేత్తగా, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీతగా, అన్నింటికీ మించి నిర్విరామ సాహితీ సృజన కారుడిగా లబ్ధ ప్రతిష్ఠులైన నలిమెల భాస్కర్ తెలుగు సాహితీవేత్తలు అందరికీ, ముఖ్యంగా తెలంగాణ రచయితలందరికీ చిరపరిచితుడు.

సహజ ప్రతిభావంతులైన నలిమెల భాస్కర్ నిత్య చైతన్య స్ఫూర్తితో విద్యార్థి దశలోనే **'మానవుడా!, కిరణాలు, ఈతరం పాటలు'** మొదలైన గేయ కవితా సంపుటాలను వెలువరించారు. స్కూల్ టీచర్ గా ఉద్యోగం చేస్తూ తమిళం, మలయాళం, కన్నడం మొదలైన 14 భారతీయ భాషలను ఆసక్తితో నేర్చుకోగలిగారు. కేవలం నేర్చుకోవడమే కాదు వాటిని లోతుగా అధ్యయనం చేస్తూ ద్రావిడ భాషా సామెతలు మీద ఎం.ఫిల్, పిహెచ్.డి.సాధించారు. నేరుగా వివిధ భారతీయ భాషల సాహిత్యాన్ని తెలుగువారికి పరిచయం చేయాలనే ఆకాంక్షతో అనువాద రచన ప్రారంభించారు. మనీ మేకర్స్ (మలయాళం– కే.ఎల్.మోహన వర్మ), కుండి (కన్నడ – నా. మొగసాలె) నవలలు మనీ బిజినెస్, చతుర పత్రికలో ప్రచురిత మయ్యాయి. నూరేళ్ల పది ఉత్తమ మలయాళ కథలు (1993), అద్దంలో గాంధారి (1996), మంద (2005), భారతీయ కథలు (2010), దేశ దేశాల కవిత్వం (2010 కవితా సంపుటి), స్మారక శిలలు (2010 నవల), సముద్ర శాస్త్రజ్ఞులు అమ్ము (2021బాల సాహిత్యం), చలనా చలనం (2021) కథా సంపుటాలను ప్రచురించారు. స్మారక శిలలు నవల అనువాద రచనకు గాను 2013 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందారు. వివిధ భాషల నుండి తెలుగులోనికే కాకుండా తెలుగులో నుండి ఇతర భాషల్లో కూడా మీరు అనువదించడం విశేషం. వీరి బహుభాషా వైదుష్యానికి నిదర్శనంగా 'తమిళ తోట్టతల్ తెలుంగు కుయిల్ గల్' (2000), 'నాని కవిదైగల్' (గోపి సార్ నానీలు 2016), తమిళ భాషలో ప్రచురించారు.

**అనువాదం – సాహిత్య ప్రక్రియ :**

అనువాదం విశేషమైన సాహిత్య ప్రక్రియ. ఇంటి కిటికీలు తెరిచి బయట వాతావరణం చూసినప్పుడు ఎంత అనుభూతి కలుగుతుందో అనువాద సాహిత్యాన్ని చదువుతున్నప్పుడు కూడా సహృదయ పాఠకునికి అంతే అనుభూతి కలుగుతుంది. ఇంటి కిటికీలు తెరిచి బయట గాలి, వెలుతురులను ఆస్వాదించడం ఆఘ్రాణించడమే కాకుండా అనుభూతి చెందడం అనువాదంలోని

ప్రత్యేకత. అనువాదం ఆధునిక ప్రపంచ సాహిత్య నాగరికత అని శేషేంద్ర (గుంటూరు శేషేంద్ర శర్మ, కాలరేఖలు పుట: 47) పేర్కొనడంలో ఉద్దేశం ఇదే. 'వద్' (చెప్పుట) అనే ధాతువుకు 'ఘ' ప్రత్యయం చేర్చడంతో వాద్ అనే పదం, 'వాద్' పదానికి 'అను' ఉపసర్గ చేర్చడంతో అనువాదం అనే పదం ఏర్పడింది. ప్రాచీన సాహిత్యంలో అనువాదం అనే పదానికి **'ఒకరు చెప్పిన దానిని తిరిగి మరల చెప్పుట'** అని అర్థం. ఆధునిక సాహిత్యంలో అనువాదం అనే పదానికి **'భాషాంతరీకరణ'** అనే అర్థం ప్రచారంలో నిలిచింది. 1950 కి ముందు వచ్చిన తెలుగు, తెలుగు–ఇంగ్లీష్ నిఘంటువులు **'తిరిగి మరల చెప్పుట'** అనే అర్థాన్ని సూచించగా 1950 తర్వాత వచ్చిన నిఘంటువులు పై అర్థంతో పాటు **'భాషాంతరీకరణ'** అని అర్థాన్ని కూడా సూచించడం గమనించదగిన విషయం. ఒకరు చెప్పిన విషయాన్ని తిరిగి మరల చెప్పడంలో కూడా సృజనత్వం తోడవుతుండడం వల్ల అనువాదాన్ని అనుసృజన అని కూడా పేర్కొంటున్నారు.

**తెలుగు సాహిత్యంలో అనువాదాలు :**

పరిచయం కలిగిన భాషలోని సాహిత్యాన్ని తాను నివసించే ప్రాంత భాషా ప్రజలకు తెలియచేయాలని ఆసక్తి, అనురక్తి, ప్రేరణాలవల్ల అనువాదాలు కొనసాగుతాయి. ఇది కేవలం ఆధునిక కాలంలోనే కాదు ప్రాచీన కాలం నుండే ఉంది. అసలు తెలుగు సాహిత్యం ప్రారంభమైంది అనువాదాలతోనే. క్రీ. శ. 11వ శతాబ్దం లో రాజరాజ నరేంద్రుడు **"జననుత కృష్ణ ద్వైపాయన ముని వృషభాభిహిత మహాభారత బద్ధ నిరూపితార్థమేర్పడ తెనుగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్"** (నన్నయ్య, భారతం ఆదిపర్వం, అవతారిక, పద్యం:16) అని ఆదికవి నన్నయను అభ్యర్థించడం లోనే అనువాదం యొక్క ప్రాధాన్యత, ప్రాముఖ్యత తెలుస్తుంది. నన్నయ్యను ఒరవడిగా గ్రహించి తిక్కనాది కవీశ్వరులు తెలుగు సాహిత్యాన్ని వైభవోపేతంగా పరిఢవిల్ల చేశారు. అయితే ప్రాచీన కావ్యానువాదాలన్నీ స్వేచ్ఛనువాదాలే తప్ప యథాతథానువాదాలు కావు. ప్రాచీన కవులు మూలభాషలోని కథాంశాన్ని మాత్రమే స్వీకరించి కథానుగుణమైన మార్పులు చేర్పులతో కావ్య రచనలు చేశారు. ఆ కావ్యాలన్నీ పండిత వర్గానికి మాత్రమే పరిమితమైనవి. నాటి పండితు లందరూ మూలభాష సంస్కృతీ సంప్రదాయాలను అనుసరించిన వారే కావడంతో ఆ కావ్యానువాదాలు తెలుగులో పండితామోదం పొందగలిగాయి.

ఆధునిక కాలం మాత్రం ఇందుకు భిన్నమని చెప్పవచ్చు ఆధునిక కాలంలో సాహిత్యం సామాన్యుల వరకు చేరింది. సాధారణ ప్రజా బాహుళ్య లక్ష్యంగానే సాహిత్యం వెలువడుతున్నది. ఈ కారణంగా మూల భాషలోని వాతావరణం, సంస్కృతీ సంప్రదాయాలు, వస్తు, భాషా, శైలీ విషయాదులు లక్ష్య భాషలోని సామాన్య ప్రజా జీవన సన్నిహితమై ఉండాలి. కావున అనువాదం ఒక సవాలుతో కూడుకున్నది. సృజనతో కూడుకున్నది. అంతో ఇంతో మేధో మథనంతో కూడుకున్నది. అనువాదం ఓ పరకాయ ప్రవేశం లాంటిది. నూతన శరీరంలో మూలమైన ఆత్మ స్వభావం ప్రకాశించినట్లుగానే మూల భాషలోని భావం లేదా విషయం (ఆత్మ) లక్ష్య భాష (శరీరం) లో అభివ్యక్తి ప్రస్ఫుటం కావాలి. సాధారణ అనువాదకులు అయితే ఇలా ప్రయత్ని ప్రయత్నిస్తున్నప్పుడు ఏదో ఒకటి దెబ్బతింటుంది. "If the translation is faithful, cannot be beautiful. If it is beautiful, it cannot be faithful. (French scholar) అని పేర్కొన్నాడు. ఉత్తమ అనువాద రచనగా నిలబడాలంటే మొదట భావానికి, తర్వాత అభివ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. (Naida, Engune A, Language Structure and Translation p 13)

మూల భాషలోని భావ సౌందర్యంతో పాటు శైలీ సౌందర్యం తోడుగా లక్ష్య భాషలోకి ప్రతిఫలించడమే ఉత్తమ అనువాదానికి కొలమానం. భాషాపరమైన సమస్యలు ఉత్తమ అనువాదకునికి అవరోధాలు కావంటారు మహాకవిశేషేంద్ర. **"మూల భాషలో ఉన్న కోమల స్వరాలు, నాజూకు ప్రతిధ్వనులు బుద్ధిబలంతో వెతకాలే గానీ అవి అనువాద భాషలో కూడా ఉంటాయి. కారణం, సాధారణంగా మానవ సన్నివేశాలన్నీ ఏ దేశంలోనైనా సమానంగానే ఉంటాయి. ఆ సన్నివేశాల్లో ఉత్పన్నమయ్యే సంవేదనాత్మక అభివ్యక్తులు కూడా సమానంగానే ఉంటాయి. ఆ అభివ్యక్తుల భంగిమ భిన్నంగా కనిపించవచ్చు. ఆ భిన్నతే అనువాదకున్ని అలాంటి అభివ్యక్తి అనువాద భాషలో లేదనే భ్రాంతికి గురి చేయవచ్చు. కానీ జాగ్రత్తగా భాషా ప్రవర్తన, భాషాశీలము గ్రహించగలిగిన మర్మజ్ఞులకు సమానాంతర అభివ్యక్తులు అన్ని భాషల్లోనూ దొరుకుతాయి. ఆ మర్మజ్ఞత యొక్క ఆవశ్యకతే అనువాదాన్ని అనువాద కళగా మారుస్తుంది."** (గుంటూరు శేషేంద్ర శర్మ, కాలరేఖలు పుట: 47)

శేషేంద్ర పేర్కొన్న భాషా ప్రవర్తన, భాషాంశాలను గ్రహించగలిగిన మర్మజ్ఞుడు నలిమెల భాస్కర్. అందుకే భాస్కర్ అనువాదాలన్నీ కళాత్మకంగా రూపుదిద్దుకున్నాయి. భాస్కర్ అనువాద రచనలు వస్తు, భావ, శైలి, భాష, కళాదుల సమ్మేళనంతో సర్వాంగీణ సౌందర్యంతో భాసిస్తున్నాయి. భాస్కర్ అనువాద రచనల సౌందర్యాన్ని పరిశీలిద్దాం.

**వస్తు సౌందర్యం :**

వస్తువు అనగా ఇతివృత్తం. ఇతివృత్త నిర్మాణంలో అనువాదకుని ప్రమేయం లేదు. మూల రచయితదే ప్రధాన పాత్ర. మూల భాషలోని ఇతివృత్తాన్ని లక్ష్య భాషలో తేవడమే అనువాదకుని పని. కానీ లక్ష్య భాషలోకి తెస్తున్న రచనల ఇతివృత్త నిర్ణయం అనువాదకుని పైనే ఆధారపడి ఉంటుంది. కావున లక్ష్య భాషలోకి రూపుదిద్దుకునే ఇతివృత్తాలు, లేదా ఇతివృత్త నిర్వహణలో నూతనత్వాన్ని ఆవిష్కరించే

రచనలను అనువాదకుడు ఎంపిక చేసుకోవాలి. ఆ ఇతివృత్తం సామాన్య జన బాహుళ్యానికి సన్నిహితమై ఉండాలి. వర్తమానాంశా లకు సామాజిక, నైతిక, మానవీయ, జీవన మూల్యాలకు సంబంధించినదై ఉండాలి. ఇది నలిమల భాస్కర్ అనువదించిన వందల కథల్లో దర్శనమిస్తుంది.

నోరు కట్టుకుని, మూగ రోదనతో తల్లడిల్లుతున్న స్త్రీల హృదయాల లోలోతుల ఆవేదనలు (అద్దంలో గాంధారి), పురుషాహంకార ధోరణితో క్రూరంగా జంతువుల్లాగా ప్రవర్తించే మగరాయుళ్లను పరాభవించే వింత ప్రతీకారాలు (బొమ్మకు అటువైపు- అద్దంలో గాంధారి), కుంగుబాటును అధిగమించి స్వావలంబనతో నిలబడాలని - నిలవడానికి అనుగుణంగా తీర్చిదిద్దుకునే ఆర్థిక సంపాదన మార్గాలు (నల్లమబ్బు వెండి అంచు- అద్దంలో గాంధారి), అధికార సంబంధాలను మెరుగుపరచుకోవడానికి మరణాన్ని ఆడంబరంగా నిర్వహించి రక్తసంబంధీకులను దూరంగా నెట్టడం (మృత్యుపర్వం-మంద), లోకం పట్టని మనిషి చేసిన నిస్వార్థ శ్రమ, పదిమంది కూడా నిలువ లేని స్థలంలో పదివేలమందికి ఆశ్రయ మిచ్చిన నిరాడంబరుని జీవనం (ఒకనాటి మరుభూమి మనము నేడు కనము-మంద), పేదరికంలో ఆకలి బాధలు, వలసలు, ఆహార అన్వేషణలో ప్రాణాపాయాలు (ఆకలి-మంద), పేదరికానికి సోమరితనం తోడుగాక వృద్ధాప్య దశలో ధన సంపాదనకై గర్భంలోనే శిశువును అవిటిగా తయారు చేసే రాక్షస ప్రవృత్తి కలిగినవారు (మనసులోని కోరిక-మంద), పల్లెటూరు ఆప్యాయతలు, అనుబంధా లను పట్టని నగర మనస్తత్వాలు (తల్లి చీర-చలనాచలనం), వ్యాధిగ్రస్తుడైన వృద్ధ రోగికి కుటుంబ సభ్యులు సేవలు (అక్కెరలేనోడు-చలనాచలనం), శారీరక వికారాలు మానసిక సౌందర్యాలు కలిగిన అందమైన ప్రేమికులు (ఎల్లలు లేని లోకం-భారతీయకథలు), వర్తమాన ప్రజాస్వామ్యం, రాజకీయాలకు అద్దం పట్టే కల్పన (నవగ్రహాల పార్లమెంటు -భారతీయకథలు), మత కల్లోల ప్రాంతంలో, ఉద్రిక్త ఘర్షణల పరిస్థితిలో ఒకరి ప్రాణం కాపాడడానికి మానవత్వాన్ని చాటుకున్న మానవీయ మూర్తి (బురఖా-భారతీయ కథలు), మొదలైన కథలన్నీ వస్తుపరంగా వైవిధ్యభరితమైనవే. ఇవన్నీ ఇతివృత్త కల్పనలో మరియు ఇతివృత్త నిర్వహణలో నూతనత్వాన్ని ఆవిష్కరించడమే కాదు, వస్తు సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తున్నాయి.

**భావ సౌందర్యం :**

**'ఇతివృత్తంతు కావ్యస్య శరీరం పరికీర్తితం'** కావ్యం/ కథా రచనకు ఇతివృత్తమే శరీరం అని భరతుడు పేర్కొన్నాడు. ఇతివృత్తం శరీరమైతే కథా రచనలో విస్తృతంగా పరచుకున్న ఆత్మతత్వమే భావం. భావావిష్కరణయే భావ సౌందర్యం. కథను నడిపించేది వేరు. కథా రచనలోని మూలతత్వాన్ని పాఠకుల్లో ఇంజెక్ట్ చేయడం వేరు. సాధారణంగా కథను అందరు నడిపిస్తారు. కానీ మూలతత్వాన్ని పాఠకుని గుండెలో సూటిగా నాటే రచయితలు/ అనువాదకులు కొందరే ఉంటారు. నలిమెల భాస్కర్ మూల రచనలోని మూల తత్వాన్ని పాత్రలో పలికించడమో, లేదా సందర్భానుగుణంగా ఒలికింప చేయడమో చేస్తుంటారు.

మరణించిన మనిషి గూర్చి బాధ లేదు. బతికి ఉన్న మనిషి అవసరాల కోసమే పలకరింపులు, మర్యాదలు అంటున్న (మృత్యు పర్వం-మంద), బతికినప్పుడే కాదు మరణించిన తర్వాత కూడా 'పరోపకారార్థమిదం శరీరం' అన్న ఫైరోబ్బుఖ్ (జీవనశయ్య-మంద), పశ్చాత్తాప భావనతో జీవనాన్ని చైతన్యవంతం చేసుకున్న (గూండా గురు సింగ్-మంద), ప్రకృతి పరిరక్షణ పర్యావరణ స్పృహ లేని సామ్రాజ్యవాదులు (ఒకనాటి మరుభూమి మనము నేడు కనము-మంద), దృష్టితో సృష్టిలోని సౌందర్యాన్ని గుర్తించిన అందమైన ప్రేమికులు (ఎల్లలు లేని లోకం-భారతీయకథలు), మరణించిన సైనికుని పొగడుతూ సైనిక కుటుంబాన్ని ఓదార్చే నేతల సంతానం సైనికుల్లో ఎందుకు చేరరు అనే ఆలోచనను రేకెత్తించే (అమరవీరుడు-భారతీయకథలు), యౌవనం మోజులో మూలాన్ని వదులుకొని నలిగిపోయే బతుకులు (పువ్వు-భారతీయకథలు), వృద్ధ రోగిపై కమ్ముకున్న నిర్లక్ష్య




భావనలు (అక్కెరలేనోడు – చలనాచలనం), విశాలమైన లోచూపులు కలిగిన స్త్రీ హృదయాన్ని ఆవిష్కరించే (అద్దంలో గాంధారి) మొదలైన కథలు భావ సౌందర్యంతో అలరారుతున్నాయి.

**శైలీ సౌందర్యం :**

అభివ్యక్తీకరణ మార్గమే శైలి. కథలో నిబిడీకృతమైన ఆత్మను లేదా ఆత్మ తత్వాన్ని జీవనాడిలా కొనసాగింప చేయడమే శైలిలో నిలబడే ప్రధాన సూత్రం. చివరిదాకా పాఠకుని వేలు పట్టుకుని నడిపించేది ఈ శైలి. శైలి బాగుంటేనే పాఠకుడు చివరి వరకు వెళ్తాడు. లేకపోతే మధ్యలోనే తప్పించుకుంపోతాడు. సందర్భానుగుణమైన వర్ణనలు, సంభాషణలు, పోలికలు, అద్యంతాలు, అల్పాక్షరాల్లో అనల్పార్థాలు ఇవన్నీ శైలీ సౌందర్యాన్ని పెంపొందిస్తాయి. లక్ష్య భాషతో పాటు మూల భాషలోనూ విశేషమైన భాషా పరిజ్ఞానం, స్వయం ప్రతిభతో సాధించిన కవితామయ పాండిత్యం, అన్నింటికీ మించి ప్రత్యేకతను ప్రదర్శించాలని దృఢ సంకల్పం వెరసి నలిమెల భాస్కర్ అనువాద కథా రచనలు శైలి సౌందర్యంతో మెరిసినాయి.

గాంధారి లేఖ ద్వారా ఆత్మగతాన్ని, స్వయంగా తెలుపుకుంటూ హృదయాంతరాల్లో రగిలిపోతున్న బడబానలాన్ని వెలిగక్కిన తీరులో భాస్కర్ ప్రదర్శించిన ప్రత్యేక శైలీ దృక్పథం అవగతం అవుతుంది. శైలీ సౌందర్యాన్ని ఇనుమడింప చేయడంలో భాస్కర్ కవితా ధోరణి ప్రదర్శిస్తారు. **'కరుప్పన్ ఇంట్లో పొయ్యిలోంచి రెండు రోజులుగా పొగ రావడం లేదు. పిల్లి ఆ పొయ్యిలో తన పిల్లాపాపలతో హాయిగా నిద్రపోతుంది.'** అంటూ కథను ప్రారంభించి, **'వాళ్ళు ఆకలితో చావలేదు. అలా అనడం తప్పు. ఆకలిని చల్లార్చుకోబోయి చచ్చారు. పలు రకాల ఆకుల కూరల్లో ఉన్న విషపు కూరతో వాళ్ళు చంపుకోవాలనుకున్న ఆకలికే ఆహారం దొరికింది'** అంటూ ముగించారు. ఆకలి బాధల విషాదఛాయలను ఈ కథ లోని ఆద్యంతాలు వివరిస్తున్నాయి.

శీర్షికలోనే ఆశావహ దృక్పథాన్ని తెలియజేస్తుంది జీవనశయ్య కథ (మంద). పెన్షన్ డబ్బులతో అంగవికలురైన ఆరుగురు పిల్లలను పెంచుతున్న ఫైరోజ్బఖ్త్ **'బతుకు ఎడారిలో ఇలాంటి పిల్లల్ని సుందర పుష్పాలుగా పెంచిన వ్యక్తి మహా మనిషి.'** అని విలేకరి ప్రశంసిస్తాడు. ఇలాంటి వాక్యాలు కథానాయకుడైన ఫైరోజ్బఖ్త్ వ్యక్తిత్వానికి దర్పణం 'పదుతుంది. ప్రపంచంపై కాదు ప్రకృతిపై గల మమకారంతో వృక్ష సంపదను పెంచే గొల్లవాడి కథ ఒకనాటి మరుభూమి మనము నేడు కనము(మంద). కథ పేరు చదవగానే **'ఒకనాటి ఉద్యానవనము నేడు కనము'** అనే శ్రీశ్రీ పాట గుర్తుకు వస్తుంది. శ్రీశ్రీ గారి పాట విషాదాంతం అయితే, **'ఒకనాటి మరుభూమి మనము నేడు కనము'** అనే కథ ఆశావహ దృక్పథాన్ని సూచిస్తుంది. చాలా చిన్న కథ కానీ పెద్ద భావంతో కూడుకున్నది పువ్వు కథ (చలనాచలనం). పటిష్టమైన శైలీ బంధంతో రాయబడిన కథ 'అక్కెరలేనోడు' (చలనాచలనం). ప్రతి వర్ణన, ప్రతి పదము, ప్రతి అక్షరమూ సహజమైనదే. 'అక్కెర లేనోడు' కథలో అక్కెర లేని పదమే లేదు. కట్టుదిట్టమైన ఈ విధమైన శైలీ బంధంతో కథ చివరి వరకు పాఠకుల్ని నడిపిస్తూ అనుభూతిని పెంపొందింప చేస్తున్నాయి భాస్కర్ గారి అనువాద కథలు.

**భాషా సౌందర్యం :**

కథానుగుణ మైన, భావానుగుణమైన, పాత్రానుగుణమైన భాషను ఉపయోగించడం శ్రేష్ఠమైన మార్గం. అసలు భావ ప్రకటనా స్పష్టతకు భాషే ప్రధాన వనరు. పదునాలుగు భాషలు తెలిసిన భాస్కర్ లో ఈ భాషా వనరులు పుష్కలంగా ఉన్నాయి. పదాల గారడీ చేస్తూ ఛేకాను ప్రాసాలు, యమకాలు సృష్టించడం భాస్కర్ గారికి కరతలామలకం.

**అద్దంలో గాంధారి** పురాణ సంబంధమైన కథ. కథలోని భాష వ్యవహారికమే కానీ కథా వాతావరణానికి అనుగుణమైన రాజదర్పంతో కూడిన **సఖీ! చెలీ!,రాకుమారి! మహారాజా! కుమారా!** మొదలైన సంబోధనలు పదాలు కనిపిస్తాయి. చివర్లో దుర్యోధనుని శవాన్ని చూస్తూ గాంధారి పుత్రశోకంతో కుమిలిపోయి **'కొడుకా!'** అని పిలిచే పదం ఒక్కటి మినహాయింపుగా చెప్పుకోవాలి. దుఃఖ సాగరంలో మునిగిపోయిన కారణంగా గాంధారి నోట సాధారణ వ్యవహారిక సంబోధనను పలికించడం భాస్కర్ గారి సముచిత పద ప్రయోగానికి నిదర్శనం.

చాలా సరళమైన, సంక్షిప్తమైన పొడిపొడి మాటలతో సంవాద శైలిలో **'ఎల్లలు లేని లోకం'** (భారతీయ కథలు) కొనసాగుతుంది. అనాకారులైన ఇద్దరు వ్యక్తులు వారిలో గూడు కట్టుకున్న ఆత్మ న్యూనత భావం – దానితో వారి పరిచయం లోనూ, ప్రేమ భావ ప్రకటనలోనూ సంక్షిప్త సంవాదమే కొనసాగించారు భాస్కర్ గారు. ఈ విధానమే కథకు బిగువును పెంచింది. కథా వాతావరణన్ని తెలుగు పాఠకులకు సన్నిహితంగా చేరవేయడంలో తెలుగు నుడికారాలు సామెతలు ప్రాధాన్యతను సంతరించుకుంటాయి ఈ మెలకువ తెలిసిన భాస్కర్ గారు **"ఈలపాట రఘురామయ్యలా ఈల వేసుకుంటూ వెళ్ళవచ్చు"** (ప్రయాణం మంద), **"దాచి దాచి దయ్యాల పాలు చేసేటట్లు"** (గూండా గురు సింగ్ మంద), **"ఉన్నోళ్లు పోయినోళ్ళ తీపి గుర్తులు"** (తపస్సు భారతీయ కథలు) **"అత్త మీద కోపం దుత్త మీద", "………. అనుచరులు మల్లా యుద్ధానికి మల్ల యుద్ధానికి తయారయ్యారు"** సభలో బస – రభస (నవగ్రహాల పార్లమెంటు భారతీయ కథలు) మొదలైన కథల్లో ఇలా తెలుగు నుడికారాలు పదప్రయోగాలు ఉపయోగించి ఆ కథలన్నింటినీ తెలుగు వారి సొంత కథలా అన్నట్టుగా అనువదించారు.

ముఖ్యంగా ఇక్కడ గమనించదగిన విషయం తెలంగాణ భాషా ప్రయోగం. కథలన్నింటిలో సాధారణ వ్యావహారిక భాషతో పాటు తెలంగాణ భాషను కూడా భాస్కర్ గారు సముచితంగా ఉప యోగించారు. తెలంగాణలో మాత్రమే వినిపించే దూప, మల్ల, నెర్రెలు, తక్కించి తక్కించి, ఎనుగు, యాది మొదలైన పదాలను, ఉన్నై మొదలైన క్రియా పదాలను (ఒకనాటి మరుభూమి మంద) చెయ్యరు, కరాయించు, పొట్ట (గర్భం),పుదుతరు, మస్తు, నక్రాలు మొదలైన పదాలను మరియు భిక్షగాడి సంభాషణలను తెలంగాణ ప్రాంత భాషలో మనసులోని కోరిక (మంద) కథలో కనిపిస్తున్నాయి. ఇక పూర్తిస్థాయి తెలంగాణ భాషను ప్రయోగించి రాసిన కథ "అక్కెరలేనోడు" (చలనా చలనం) ఈ కథను పూర్తి స్థాయిలో తెలంగాణ ప్రాంత భాషలో అనువదించి సహజమైన జీవభాషతో, కథతో పాఠకులను ముడి వేసాడు. తెలంగాణ భాషపై సాధికారతను మమకారాన్ని మేళవించి 1977లోనే సృజనాత్మకతతో కూడిన మంద కథను రచించి ఆంధ్రభూమి పత్రికలో ప్రచురించారు. పదునాలుగు భాషల్లో ప్రావీణ్యం సంపాదించిన భాస్కర్ గారు పుట్టి పెరిగిన తెలంగాణ గడ్డమీది భాషను జీవధాతవుగా మలుచుకున్నాడు. తెలంగాణ భాష భాస్కర్ గారి జీవ ధాతువు అని చెప్పడానికి 'మంద' కథయే సాక్ష్యం.

**కళా సౌందర్యం :**

మనో వీధిలో ముసురుకునే భావాలను, హృదయ స్పందనలను ఎదుటివారిని ఆకర్షించే రీతిలో అందంగా, అనుభూతి కలిగేటట్లుగా వ్యక్తీకరించడమే కళ. సృజనశీలమైన సాహిత్యానికి మూల బిందువు కళ. సాహిత్య సృష్టి సృజన అయితే అనువాదం పునః సృజన. సాహిత్య సృజనను కళ గా భావిస్తే, పునః సృజనను కూడా కళాత్మకంగానే భావించాలి. సహజ ప్రతిభావంతులైన అనువాదకులు ఆసక్తితో, అనురక్తితో చేసిన అనువాద రచనలు కళాత్మకంగా ఉంటాయి. వ్యక్తిగతంగా మూల రచనా విధానాన్ని లక్ష్య భాషలోకి తేవడానికి అనువాదకుడు చూపే ప్రతిభ పాఠకుని ఆకట్టుకుంటుంది. **“అనువాదంలో అనువాదకుడి ఆత్మాభివ్యక్తి కాకుండా మూల రచయిత ఆత్మాభి వ్యక్తిని హృదయంగమం చేసుకుని, దాన్ని తిరిగి లక్ష్య భాషలో అభివ్యక్తీకరించే ప్రయత్నం జరుగుతుంది. ఈ ప్రయత్నంలో అనువాదకుడి వ్యక్తిత్వానికి కూడా విశిష్టమైన స్థానముంటుంది.”** (అనువాద సమస్యలు 20 భీమ్‌సేన్ నిర్మల్) పైన పేర్కొన్నట్లు భాస్కర్ గారు మూల భాషలోని ఆత్మాభివ్యక్తిని హృదయంగమం చేసుకొని లక్ష్య భాషలో ప్రకటిస్తున్నాడు. కావుననే నలిమెల భాస్కర్ గారు అనువాద సాహిత్యంలో విశిష్టమైన స్థానాన్ని ఏర్పరచుకోగలిగారు. వీరి అనువాదాలు కళాత్మకతను, కళా సౌందర్యాన్ని ఆవిష్కరించాయి. ఆ విశిష్టమైన స్థానం ఆ కళాత్మకత, ఆ కళా సౌందర్యం భాస్కర్ గారి అన్ని కథల్లోనూ అనుస్యూతంగా ఆవిష్కృతమవుతూ వస్తుంది. భాస్కర్ గారి అనువాద రచనా కళా సౌందర్యాన్ని తెలుసుకోవడానికి ఒక కథను పరిశీలిద్దాం.




**“మళ్ళీ జీవితంలోకి”** కథకు మూలం నేమి చంద్ర గారి కన్నడ కథ **“మరళి బదుకగె ఈ పయణ”**. పదానువాదం, వాక్యానువాదం, యథాతథానువాదం మొదలైన అనువాద పద్ధతులు భాస్కర్ గారి అనువాద రచనల్లో కనిపించవు. **“ఔచిత్యం బాదరించి, అనౌచిత్యంబు పరిహరించి, మూలంబు సంక్షేపించి, నూత్నంబు కల్పించి”** అన్నట్లుగా మూల భాషా గతమైన కథలోని ఆత్మను తెలుగు పాఠకుని శరీరంలోకి ఇంజెక్ట్ చేయడం భాస్కర్ గారి అనువాద రచనల్లో కనిపించే విశిష్టమైన గుణం.




తలకు తగిలిన బలమైన గాయంతో సుధ జీవచ్ఛవంలా మారిపోయింది. ఆమెకు మళ్ళీ స్మృతులు కలిగే అవకాశం లేదని డాక్టర్లు తేల్చేసారు. కానీ ఆమె భర్త రిపుదమన్ మళ్ళీ తిరిగి ఆమెను స్మృతులను గుర్తు చేసి తిరిగి జీవింప చేయడమే **“మళ్ళీ జీవితంలోకి”** కథా సారాంశం.

కథ ప్రారంభంలో ఎత్తుగడలోనే భాస్కర్ అనువాద ప్రతిభ మనకు కనిపిస్తున్నది. మూల కథలో కథా ప్రారంభంలో (తమిళ వాక్యాలు) (ఒక ఉదయం, తెల్లవారుజామున, నా ప్రపంచం చీకటిగా మారింది.) ఈ ప్రారంభ వాక్యాలు భాస్కర్ గారి అనువాదంలో **“ఒకానొక తొలిసంధ్య వేళ! వెలుతురు వెయ్యి రేకులుగా విచ్చుకునే వేకువజామున నా లోకం చీకటైపోయింది.”** అని కవితాత్మకంగా రూపుదిద్దుకున్నాయి. పూలన్నింటినీ ఒక్కచోట నిలిపి పూల సౌందర్యాన్ని ఆవిష్కరింపజేస్తూ కనపడని దారంలా భాస్కర్ గారి అనువాద వాక్యాలు ఉంటాయి.




(తమిళ వాక్యాలు) (మరో ఏడాదిన్నర పాటు శ్వాస శరీరానికి అతుక్కుపోయింది.) ఇలా అనువాదం కృతకంగా అనిపిస్తుంది కానీ భాస్కర్ గారి సహజ ప్రతిభ **“తర్వాత మరో ఒకటిన్నర సంవత్సరం అతని గుండె గూటిలో ఊపిరి దీపం రెపరెపలాడడం చక్కగా గుర్తుంది.”** వాక్యాల రూపంలో దర్శనమిస్తుంది. కథా సౌందర్యాన్ని ఇనుమడింప చేస్తుంది. (తమిళ వాక్యాలు) (మనిషి అంటే జ్ఞాపకాలు. పిడికెడు పిడికెడు జ్ఞాపకాలు.) హిడిహిడి నెనపుగళు అనే ఒక వాక్యాన్ని **“......ఒక పిడికెడు జ్ఞాపకాలు... ఒక గుప్పెడు గుర్తులు...”** అని రెండువాక్యాలుగా అనువదించడంలోనే కథను పాఠకునికి చేరవేయడంలో భాస్కర్ గారు చూపిస్తున్న శ్రద్ధ

తెలుస్తున్నది. మూల భాషలో వ్యక్తమైన భావాన్ని లక్ష్య భాషలోకి తెస్తున్నప్పుడు లక్ష్య భాషలోని నుడికారాలు, జాతీయాలు అనువాదకునికి కరతరామలకమై ఉండాలి. ఈ విషయంలో భాస్కర్ గారు అందెవేసిన చెయ్యి.

(తమిళ వాక్యాలు) (మస్తిష్కంలో పేర్లు సందర్భాలు అన్నీ కూరల్లాగా విడిగా ఉండేవి.) **"నీ మెదడులో ఆయా వ్యక్తుల పేర్లు, ఆయా సంఘటనలు వడ్లు పెరుగు కలిసిపోయినట్లు కలగాపులగం అవుతున్నాయి."** విడివిడిగా ఉన్నాయి అని చెప్పడానికి బదులు భాస్కర్ గారు చక్కనైన తెలుగు నుడికారాన్ని ఉపయోగించారు. వడ్లు పెరుగు కలిసిపోయినట్లు కలగా పులగంగా ఉన్నాయని చెప్పడంలో తెలుగు పాఠకుడు ఆ కథలో అనుభూతి చెందడానికి ప్రయత్నిస్తాడు. ఒక నుడికారం ద్వారా చక్కని అభివ్యక్తిని ప్రదర్శించడం కళా సౌందర్యం కాక మరేమవుతుంది.

కథా ప్రారంభంలో భాస్కర్ గారు ఎంత శ్రద్ధ వహించారో, ముగింపులోనూ అదేవిధమైన శ్రద్ధాసక్తులను చూపించారు. కథ చివరలో సుధ అడిగినట్లుగా రిపుదమన్ "(తమిళ వాక్యాలు)" (లైట్ స్విచ్ వేసాను. చీకటిని తిట్టే బదులు ఒక్క చిన్న దీపాన్ని వెలిగించడం మంచిదే కదా అని ఎవరో అన్న మాటలను జ్ఞాపకం చేసుకున్నాను.) భాస్కర్ గారు కథను సామాన్య వాక్యాలతో ముగించలేదు. **"నేను స్విచ్ వేసి, చీకటి అంచున చటుక్కున మెరిసిన వెలుతురును నా కళ్ళ నిండా నింపుకున్నాను."** సుధ అనారోగ్యం పాలు కావడంతో రిపుదమన్ జీవితం చీకటైపోయింది. మళ్లీ సుధ ఆరోగ్యం కోలుకుంటున్న సూచన కనబడగానే రిపుదమన్ జీవితంలో వెలుగులు తొంగి చూసాయి. ఈ విషయాన్ని కథా ప్రారంభంలో **"వెలుతురు వెయ్యి రేకులు గా విచ్చుకునే వేళ నా లోకం చీకటైపోయింది"** అని, కథ చివరలో **"చీకటి అంచున చటుక్కున మెరిసిన వెలుతురు నా కళ్ళ నిండా నింపుకున్నాను."** అని రిపుదమన్ చెప్పినట్లుగా భాస్కర్ గారు అనువదించారు. ఇది మూలానికి మెరుగు దిద్దినట్లుగా ఉంది. ఇది భాస్కర్ గారి అనువాదం లోని కళా సౌందర్యం.

**ముగింపు :**

**"త్వరలోనే భాస్కర్ గారు ఇప్పుడు మనం వేస్తున్న అంచనాలను అధిగమించి దూసుకు పోగలరనటంలో సందేహం లేదు."** అని చలసాని ప్రసాదరావు గారు (ముందుమాట నూరేళ్ల పది ఉత్తమ మలయాళ కథలు, పుట: V) 30 ఏళ్ల కింద చెప్పిన మాటను నలిమెల భాస్కర్ గారు అక్షరాలా నిజం చేసారు. ఉత్తమ అనువాద రచయితగా కీర్తి గడించారు.

అనువాదాలను ఏదో యాంత్రికంగా కాకుండా అభిరుచితో ఆసక్తితో ఇతర భాషలలోని కథలను, కథ సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు చేరవేయాలి అనే ఒక లక్ష్యంతో ఆ కథలోని భావాలను తెలుగు భాషా సౌందర్యాలను జోడించి కళాత్మకంగా తీర్చిదిద్దారు భాస్కర్ గారు. అందుకని ఇతివృత్త ఎంపికలోనూ, భావాభివ్యక్తిలోనూ, సంభాషణా ప్రయోగంలోనూ అనువాద రచనా సౌందర్యంలోనూ తనదైన ముద్రను ప్రకటించుకుంటూ అనువాద రచనల్లో విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న భాస్కర్ గారు నేటి అనువాద రచయితలకు గురుదేవుని వంటి మార్గదర్శి అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

**ఉపయోగిత గ్రంథాలు:**


1. చక్రధర్, గోవిందరాజు, అనువదించడం ఎలా, మీడియా హౌస్ పబ్లికేషన్స్, విద్యానగర్, హైదరాబాద్, 1998
2. భార్గవి రావు, సాహిత్యానువాదం – ఒక పరిశీలన, పాన్సీజన్యం పబ్లికేషన్స్, హైదరాబాద్, 2006
3. భాస్కర్, నలిమెల, నూరేళ్ల పది ఉత్తమ మలయాళ కథలు, నయనం ప్రచురణలు, సిరిసిల్ల, 1993
4. భాస్కర్, నలిమెల, అద్దంలో గాంధారి మరి పదకొండు కథలు, నయనం ప్రచురణలు, సిరిసిల్ల, 1996
5. భాస్కర్, నలిమెల, మంద మరియు పదమూడు అనువాద కథలు, నయనం ప్రచురణలు, 2005
6. భాస్కర్, నలిమెల, భారతీయ కథలు, గౌరీ శంకర్,జూలూరు (సంపా), రామయ్య విద్యాపీఠం, హైదరాబాద్, 2010
7. భాస్కర్, నలిమెల, చలనాచలనం ఇతర అనువాద కథలు, సాహితీ సోపతి, కరీంనగర్, 2021
8. భీమసేన, నిర్మల్, అనువాదశాస్త్రం, తెలుగు అకాడమీ, హైదరాబాద్, 2000
9. మాధవ శర్మ, పాటిబండ, ఆంధ్ర మహాభారతం (అరణ్యపర్వం) (సంపా) ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాద్, 1971
10. రాధాకృష్ణ, బూదరాజు, అనువాదపాఠాలు, మీడియాహౌస్ పబ్లికేషన్స్, విద్యానగర్, హైదరాబాద్, 2003
11. రామచంద్రారెడ్డి, రాచమల్లు, అనువాద సమస్యలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1987
12. శేషేంద్ర శర్మ, గుంటూరు, కాల రేఖలు, తెలుగు అకాడమీ, హైదరాబాద్.
13. ప్రజావాణి, దీపావళి విశేషాంక, 1999 (కన్నడ పత్రిక)
14. Naida, Engune A, Language Structure and Translation, Stanford University, California, 1969.




ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మే : 2025

# రామాయణం – బాలకాండం – ఒక పరిశీలన

**ఆచార్య జి. నరసింహన్,** తెలుగు మరియు తులనాత్మక సాహిత్య శాఖ, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, అనంతపురం.
ఫోన్ : 90001 27115

**సారాంశం**

రామాయణ బాలకాండము యొక్క ప్రాముఖ్యత గురించి తెలపడమైనది. ద్రావిడ భాషలలోనే కాకుండా ఇతర భారతీయ భాషల్లో కూడా వాల్మీకి రామాయణం, 'రామాయణం' అనే పేరిట అనువదించడమైనది. బాలకాండం లోని విషయాలను క్లుప్తంగా పరిచయం చేయడం ఈ వ్యాసంయొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**కీలక పదాలు**

బాలకాండము – వాల్మీకి – కంబుడు – ప్రాముఖ్యము – పురాణాలు – జైన రామాయణం – బౌద్ధ రామాయణం – రంగనాథ రామాయణం – శ్లోకాలు – పర్వాలు – పద్యాలు.

**1.0. రామాయణం**

మానవ జీవితాన్ని, జీవిత విశేషాలను వెల్లడించడం సాహిత్యం. ఆ సాహిత్యం ప్రజాదరణ పొంది, దాని ప్రభావం, భవిష్యత్తులో వెలువడే గ్రంథాల మీద ఉంటుంది. భారతదేశంలో భిన్న భాషలు, భిన్న సంస్కృతి ఉన్న రామాయణ, భారతకథలను అప్పుడప్పుడు అవసరమైన చోట భారతీయులు గుర్తు చేసుకుంటున్నారు. A.A.MacDonell రామాయణం గురించి ఇలా అంటున్నాడు.

'ప్రపంచ సాహిత్యంలో (World Literature) రామాయణం లాంటి కావ్యం కనిపించడం లేదు. అందులో ఉన్న ప్రాంతీయ తత్త్వము, జీవిత విశేషాలు, నిత్య జీవితానికి పనికి వచ్చే ఆలోచనలు వేరే ఏ కావ్యంలో చూడలేము.'[1]

గడచిన కొన్ని వేల సంవత్సరాలుగా సీతారాముల కథను వింటున్నాం. ఈ కథ భారతీయ భాషలలోను కొన్ని విదేశీ ప్రాంతాలలో కూడా దీనికి సంబంధించిన రచనలు వెలువడ్డాయి. పర్వతాలు, నదులు ఎప్పటిదాకా ఉంటాయో అంతవరకు రామకథ ప్రాచుర్యంలో ఉంటుందన్నమాట.

**"యావత్ స్థాస్యన్తి గిరయ: సరితశ్చ మహీత లే
తావద్ రామాయణ కథా లోకేషు ప్రచరిష్యతి"[2]**

రామాయణ కథలు, సంఘటనలు ప్రాచీనకాలంలో జానపద రూపంలోను శిల్పం మొదలైన కళల్లోను చాలా కాలంగా వాడుకలో ఉండేవి. 'వాల్మీకి రామాయణం' అనే పేరిట ఒక కావ్యం వెల్లడించిన తర్వాత ఇది సాహిత్యరూపాన్ని పొందింది.

భారతదేశంలో ప్రతిభాషలోను రామాయణం రాయబడి ఉన్నది. కొన్ని భాషల్లో మాత్రమే రామాయణ గ్రంథాలు సాహిత్య సౌందర్యం కలిగి ప్రజల ఆదరణ పొందాయి. క్రింద ఇచ్చిన పట్టిక రామాయణ వివరాలను తెలియచేస్తున్నాయి.

1. సంస్కృతం – వాల్మీకి రామాయణం (క్రీ.పూ 3-4 శతాబ్దం)
2. రామగాథను తెలియచేసే కొన్ని సంస్కృత గ్రంథాలు

1. మహాభారతం (నాలుగుచోట్ల)

1 – ఎ అరణ్య పర్వం (147:28-38; 252-275)




1 – బి ద్రోణ పర్వం (59: 1-31)

1 – సి శాంతి పర్వం (22:51-62) (ఇంచుమించు 700 శ్లోకాలలో రాముని గురించి తెలియ చేయడమైనది)

**2.0. పురాణాలు**

2 – ఎ. విష్ణు పురాణం (IV 4,5)

2 – బి. బ్రహ్మాండ పురాణం (2.21)

2 – సి. వాయు పురాణం (II 26 )

2 – డి. భాగవత పురాణం (IX 10-11) (సీతా జననం గురించి చెప్పడమైనది)

2 – ఇ. కూర్మ పురాణం (I 19:1 II :34)

2 – ఎఫ్. అగ్ని పురాణం (5-12 ) (సంక్షిప్త వాల్మీకి జీవిత చరిత్ర)

2 – జి. నారద పురాణం (I- 79, II: 75) (సంక్షిప్త వాల్మీకి జీవిత చరిత్ర)

2 – హెచ్. బ్రహ్మ పురాణం హరివంశ సారాంశం

2 – ఐ. గరుడ పురాణం – (తర్వాతి కాలంలో రామాయణ విషయాలను చేర్చడం జరిగింది)

2 – జె. స్కంద పురాణం – (II:30)

2 – కె. పద్మ పురాణం (116 అధ్యాయం, ఉత్తరకాండ – 24, 43, 44)

**3.0. చిన్న పురాణాలు**

1. ధర్మోత్తర పురాణం
2. నృసింహ పురాణం (అధ్యాయం 47-52)
3. దేవీ భాగవతం (అధ్యాయం 3-28-30 )
4. బృహధర్మ, సౌర పురాణం (అధ్యాయం 30)

ఇవన్నీ తమ మత సిద్ధాంతాలను తెలియచేయడానికి రామకథను వాడుకున్నాయి.

పైన చెప్పిన పురాణాలే కాకుండా వాల్మీకి రామాయణాన్ని మూలంగా భావించి రాయబడిన సంస్కృత గ్రంథాలు కూడా ఉన్నాయి.

1. యోగ వాశిష్టం లేదా వాశిష్ట రామాయణం
2. ఆధ్యాత్మ రామాయణం
3. అద్భుత రామాయణం
4. ఆనంద రామాయణం

ఇవే కాకుండా క్రీ.శ. 19వ శతాబ్దం వరకు కొన్ని రామాయణ విశేషాలను ప్రధాన వస్తువుగా పెట్టి కావ్యాలు రచించడం జరిగింది.

1. కాళిదాసు - రఘువంశం ( క్రీ.శ.4వ శతాబ్దం)
2. ప్రవరసేనుడు - సేతుబంధ (లేదా) రావణవకో (క్రీ.శ. 550-600)
3. భట్టి - రావణవధ (క్రీ.శ. 500-650 )
4. కుమారదాసుడు - జానకి హరణ (8వ శతాబ్దం )
5. అభినందనుడు - రామచరిత ( 9వ శతాబ్దం)
6. క్షేమేంద్రుడు - రామాయణమంజరి, దశావతార చరిత్ర (11వ శతాబ్దం)
7. చాగల్యమల్లుడు - ఉదార రాఘవ (12వ శతాబ్దం.)
8. సాగరకవి - జానకీ పరిణయం (17వ శతాబ్దం.)
9. అద్వైతకవి - రామలింగామృతం (17వ శతాబ్దం.)
10. మోహనస్వామి - రామ రహస్యం (లేదా) రామచరిత (క్రీ.శ. 1608)

ఇవే కాకుండా క్రీ.శ. 2వ శతాబ్దం నుండి 17వ శతాబ్దం వరకు రామాయణాన్ని నాటక రూపంలో రచించారు. అందులో ప్రముఖులు భాసుడు, భవభూతి, జయదేవుడు మొదలైన నాటక రచయితలు

**4.0. బౌద్ధ రామాయణాలు**

1. దశరథ జాతకం - పాళీ ( క్రీ.పూ 5వ శతాబ్దం)
2. అనామక జాతకం - పాళీ ( క్రీ.పూ 5వ శతాబ్దం)
3. దశరథ కథనం - పాళీ ( క్రీ.పూ 5వ శతాబ్దం)

**5.0. జైన రామాయణాలు**

1. విమల సూరి - భౌమ చరితము - ప్రాకృతం (క్రీ.శ 4వ శతాబ్దం)
2. శంకదాసుడు - వాసుదేవహిండి - ప్రాకృతం (క్రీ.శ 5వ శతాబ్దం)
3. రవిసేనుడు - పద్మపురాణం - సంస్కృతం (క్రీ.శ. 6వ శతాబ్దం)
4. గుణభద్రుడు - ఉత్తర పురాణం - సంస్కృతం (క్రీ.శ. 10వ శతాబ్దం)
5. స్వయంభుదేవుడు - భౌమచరిత్రము - అపభ్రంశ (క్రీ.శ. 9వ శతాబ్దం)
6. శీలంకడు - సౌపన్న మహాపురుష చరిత్ర - ప్రాకృతం (క్రీ.శ. 868 సం॥)
7. బద్రేశ్వరుడు - కకావళి - ప్రాకృతం ( క్రీ.శ. 11వ శతాబ్దం.)

**6.0. భారతీయ భాషలలో రామాయణం.**

**తమిళం :** కంబుడు - కంబరామాయణం - ( క్రీ.శ.9వ శతాబ్దం)

**తెలుగు :** గోనబుద్ధారెడ్డి - రంగనాథ రామాయణం - (క్రీ.శ. 13వ శతాబ్దం)

భాస్కరుడు - భాస్కర రామాయణం - (క్రీ.శ. 13వ శతాబ్దం)

ఆతుకూరిమొల్ల - మొల్ల రామాయణం - (క్రీ.శ. 15వ శతాబ్దం)

**కన్నడం :** 1. అభినవపంప అనే నాగచంద్రుడు - పంపరామాయణం (క్రీ.శ. 11వ శతాబ్దం)

2. కుమార వాల్మీకి అనే నరహరి రచించిన 'తొరవె' రామాయణం (క్రీ.శ. 16వ శతాబ్దం)

**మలయాళం :** కన్నశరామ ఫణికర్ రాసిన కన్నశ రామాయణం (క్రీ.శ. 14వ శతాబ్దం)

తుంజత్తు రామానుజ ఎళుత్తచ్చన్ - ఆధ్యాత్మ రామాయణం (క్రీ.శ.16వ శతాబ్దం)

**హిందీ :** గోస్వామి తులసీదాస్ - తులసీ రామాయణం (క్రీ.శ. 1574 సం.)

కేశవదాస్ - రామచంద్రిక (క్రీ.శ. 16వ శతాబ్దం)

**అస్సామి**

మాధవ్ కందళి - అస్సామి రామాయణం (క్రీ.శ. 14వ శతాబ్దం)

**బెంగాలి**

కృతివాసుడు - బెంగాలి రామాయణం (క్రీ.శ. 15వ శతాబ్దం)

**ఒరియా**

బలరామదాస్ - ఒరియా రామాయణం (క్రీ.శ. 16వ శతాబ్దం)

**మరాఠి**

ఏకనాథుడు - భావార్థ రామాయణం (క్రీ.శ. 16వ శతాబ్దం)

7.0. **రామాయణం : బాలకాండ నిర్మాణం**

వాల్మీకి రామాయణం బాలకాండం 77 సర్గలు, 2355 శ్లోకాలతో కూడినది. మొదటి నాలుగు సర్గలు (220శ్లోకాలు) ప్రవేశికలాగా ఉన్నాయి.[3] నారదుని దర్శించిన తర్వాత వాల్మీకి రాముని చరిత్రను తెలుసుకోవడం, వాల్మీకి రామాయణం రాయడానికి పూనుకున్న తర్వాత బ్రహ్మదేవుడు ఆశీర్వదించడం. వాల్మీకి నిష్ఠలో ఉండి రామాయణ చరిత్రను పూర్తిగా జ్ఞాన నేత్రంతో దర్శించడం తర్వాత కావ్యరచనను పూర్తిచేయడం, లవకుశులు ఆ కావ్యాన్ని చాలా మాధుర్యంగా పాడటం విని రామచంద్రమూర్తి వారిని తన ఆస్థానానికి తీసుకొని వెళ్ళి ఆ కావ్యాన్ని గానం చేయమని వేడుకోవడం, రాముడు కోరినట్లు లవకుశులు రామాయణాన్ని గానం చేయడం మొదలైన విషయాలు వాల్మీకి రామాయణం బాలకాండంలో వరుస క్రమంలో ఉన్నాయి. 5వ సర్గ మొదలుకొని 77వ సర్గ వరకు అంటే 73 సర్గలలో 2135 శ్లోకాలలో వాల్మీకి బాలకాండమును రచించాడు.

తమిళ రామాయణాన్ని కంబుడు రచించాడు. కనుక దీనికి 'కంబరామాయణం' అన్న పేరు వచ్చింది. మదరాసు కంబన్, కళగం (సంగం) ప్రచురణ ప్రకారం బాలకాండంలో ఇష్టదేవతాస్తుతి తప్పించి 23 అధ్యాయాలు 1312 పద్యాలు కలిగి ఉన్నాయి. ఈ పద్యాలన్నీ 'వృత్తప్పా' అనే ఛందస్సులో రాయడం జరిగింది. వై.ము.గోపాల కృష్ణమాచార్య కంపెనీ, అన్నామలై విశ్వవిద్యాలయం, ఆళ్వార్ తిరునగరి, కళాక్షేత్ర మొదలైన సంస్థలు కంబరామాయణాన్ని ప్రచురించాయి. వాటిలో పద్య సంఖ్యలు తేడాలున్నాయి.[4]

తెలుగు భాషలో రంగనాథ రామాయణం[5], భాస్కర రామాయణం, మొల్లరామాయణం[6] మొదలైన వాటిలో కాండ విభజన ఉంది. కానీ అధ్యయన విభజన లేదు. కుమార వాల్మీకి రచించిన 'తొరవే' రామాయణంలో కాండ విభజనతో పాటు, సంధివిభజనలు కూడా ఉన్నాయి. బహుళ రామాయణంలో కాండ విభజన మాత్రమే ఉంది.

తులసీ రామాయణం బాలకాండం 361 ద్విపదపాదాలు కలిగి 'దోహ' అనే పద్ధతిలో మళ్ళీ నాలుగు పాదాలు కలిగిన పద్యాలు కలిగి 'సౌబాయి' అనే పద్ధతిలో ఉన్నాయి. కొన్ని చోట్ల వరుసగా రెండు పాదాలు కలిగిన పద్యాలు ఉన్నాయి. కొన్ని చోట్ల నాలుగు పాదాలు కలిగిన పద్యాలు వరుసగా ఉన్నాయి. కొన్ని చోట్ల నాలుగు పాదాలు కలిగిన పద్యాలకు రెండు పాదాలు కలిగిన పద్యాలకు మధ్య సంధి చేసే విషయాలు ఉన్నాయి. తులసీ రామాయణంలో కాండ విభజన తప్ప సర్గము, పటలము, అధ్యాయము మొదలైన ఉపసర్గలు ఏవీలేవు.[7]

భారతీయ భాషల్లో వెలువడిన పలురామాయణాలను పరిశీలించి చూసేటప్పుడు ప్రాంతీయ పరంగా, భాషాపరంగా వెలువడిన రామాయణాలన్నీ వాల్మీకి రామాయణ అడుగు జాడల్లో నడుస్తున్నాయి. కానీ కాండంలో తమ ప్రాంతీయ భాష, సాహిత్య సంప్రదాయాలకు తగినట్లు ఉపశీర్షికలు మారి ఉన్నాయి.

తులసీరామాయణ బాలకాండ నిర్మాణాన్ని పరిశీలిస్తే 361 ద్విపద పాదాలు కలిగిన పద్యాలు, వాటికి సంబంధించిన నాలుగు పాదాలు కలిగిన పద్యాలున్నట్లు ఇంతకు ముందు చెప్పాము. బాలకాండలో మొదటి 43 పద్యాలలో ఇష్టదేవతాస్తుతి, వినయవివరణ - ఇతర అంశాలు వీటిని గురించి చెప్పే సాహిత్య భాగంగా ఉన్నాయి. తర్వాత శివశక్తుల వివాదం, దక్షుని యజ్ఞభంగం, శివశక్తుల వివాహం, మన్మథుడు మరణించుట, రామావతారానికి ఉన్న కారణాలు, నారదుని ప్రవేశం, మను - శతరూపుడు తపసు - వరము, ప్రతాపభాను చరిత్ర, రావణుని పుట్టుక, తపము, పుట్టుక, వరము, భూదేవి విన్నపము, మహావిష్ణువు రామావతారం ఎత్తడానికి సంతోషించుట మొదలైన విషయాలన్నీ 40-187 వరకు ద్విపద ఛందస్సులో చెప్పబడి ఉన్నాయి. 188-361 వరకు ఉండే పద్యాలలో రాముని జననం, బాలకాండ విశేషాలు, మధ్యకాల పురాణ ప్రభావం, తర్వాతి కాల సంప్రదాయ ప్రచారభక్తి మార్గాన్ని తులసీరామాయణం స్పష్టంగా తెలియచేస్తుంది.

**8.0. కావ్య ఉద్దేశ్యం**

ఆదర్శ మానవుని సృష్టించి అతని గుణగణాలను విశేషంగా చెప్పడమే రామాయణ ఉద్దేశ్యమని వాల్మీకి రామాయణంలో తెలియచేశాడు.

భాగవతపురాణం, నృసింహ పురాణం, అధ్యాత్మ రామాయణం, అద్భుత రామాయణం, వశిష్ఠ రామాయణం -ఇవి రామున్ని మహావిష్ణువు యొక్క అవతారంగా తలచి, రాముడు అసురుల్ని చంపి సురల్ని కాపాడటానికి రామావతారం ఎత్తాడని వివరించి అధ్యాత్మిక విషయాల్ని తెలియచేసే విధంగా ఉండేవే పైన చెప్పిన గ్రంథాలు. ఇవి మానవున్ని వ్యక్తి యొక్క కావ్యం నుండి కదలి పౌరాణిక విషయాలు చేర్చిన ఒక కావ్యంగా భావించారు.

దశరథ జాతకం, దశరథ కథను మొదలైన బౌద్ధగ్రంథాలు విమలసూరి రచించిన 'భౌమ చరితమ్', రవిసేనుడు రచించిన పద్మపురాణం, గుణభద్రుని ఉత్తర పురాణం, కన్నడ - పంప రామాయణం మొదలైన జైనమత గ్రంథాలు తమతమ మత సత్యాలను క్షుణ్ణంగా పాటించే మహావీరుడుగా రాముని గురించి వివరించాయి.

వస్తుపరంగా వాల్మీకి మూలకథనుండి, భాగవత పురాణం నుండి భిన్నంగా జైన పురాణాలు ఉంటున్నాయి. కావ్య నాయకానాయిక పేర్లను మార్చకుండా, కావ్య ఉద్దేశ్యం, సంఘటనలు, పాత్రచిత్రణ మొదలైన అంశాలలో పైన చెప్పిన గ్రంథాలు పూర్తిగా భిన్నంగా ఉన్నాయి.

**9.0. బాలకాండ పద్యాల వివరణ - మొత్తం పద్యాల శాతం**

| రామాయణం | సర్గలు/పటలం పద్యాలు | శ్లోకాలు/దోహ | ఇష్టదేవతాస్తుతి | ఇతరకథలు | రామకథ | ఇతరకథలు శాతం | రామకథ శాతం |
|---|---|---|---|---|---|---|---|
| వాల్మీకిరామాయణం | 77 | 2355 | - | 220 | 2135 | 9.5 | 90.5 |
| కంబరామాయణం | 23 | 1312 | 11 | - | 1301 | - | 99 |
| తులసీరామాయణం | - | 361 | 43 | 144 | 174 | 40 | 48 |
| భాస్కర రామాయణం | 32 | 785 | 47 | - | 738 | - | 94 |
| తొరవె రామాయణం | 17 | 599 | 15 | - | 584 | - | 98 |

వాల్మీకి చెప్పిన రామచరితను తమిళంలోకి అనువదించి వాల్మీకి గొప్పతనాన్ని రామునికీర్తిని తమిళ ప్రజల మధ్య వ్యాపింప చేయడం కోసమే తమిళంలో కంబమహాకవి రామాయణాన్ని రచించాడు.

కీర్తి, ధనం మొదలైనవి ఇహ విషయాలని పుణ్యం, ముక్తి మొదలైనవి పరవిషయం అని ఈ రెండింటిని ప్రసాదించే శక్తి రామాయణ కథకు మాత్రమే ఉందని రంగనాథ రామాయణం తెలియచేస్తుంది. ఇక కవి తండ్రి అయిన విఠలరాజు పేరు, గొప్పతనం ఎప్పటికీ స్థిరంగా నిలబడినట్లు రామాయణ కావ్యాన్ని తన పేరిట రాయమని అడగడం వలన బుద్ధరాజు ఈ గ్రంథాన్ని రచించాడు.

రామచరిత్రను విన్నవారు ముక్తి పొందుతారు. దీనికోసం తాను రామాయణం రచించినట్లు భాస్కరుడు తెలియచేశాడు.

తెలుగుభాషలో మొట్టమొదటి రామాయణ కవయిత్రి ఆతుకూరిమొల్ల. పరప్రయోజనం వల్ల ముక్తిని పొందడం కోసమే ఈ రామాయణాన్ని రచించానని తెలియచేసింది. రాముడు తానే స్వయంగా కథను చెప్పడం వల్ల రామాయణం రాసినట్లు తెలియచేసింది. **"చెప్పమని రామచంద్రుడు చెప్పించిన పలుకు మీద చెప్పెదనేనెల్లప్పుడు ఇహపరసాధన ఈ పుణ్య చరిత్ర"** అనే మాటల వల్ల పైన చెప్పిన విషయం ఋజువవుతుంది. తాను తెలుగు భాషలో రామాయణం రాయడం యొక్క కారణాన్ని ఇలా వివరించింది. పైగా వాల్మీకి రామాయణం ఉండగా తాను తెలుగు రామాయణం రాయడానికి కారణాన్ని ఇలా చెప్పింది. **"అర్థము, అందము, వాల్మీకి రామాయణంలో ఉంది. పామరులు వాటిని చదివి అర్థం చేసుకోలేక పోతున్నారు. చెవిటివాని చెవిలో శంఖం ఊదినట్లు చెవిటివాడు, మూగవాడు మాట్లాడినట్లు ఆ రామాయణం ఉంటుంది. కనుక తెలుగు ప్రజలు స్వయంగా చదివి అర్థం చేసుకోవడానికి సులభమైన తెలుగు పదాలతో సులభమైన శైలిలో ఈ రామాయణం రాయబడింది."** (పీఠిక పద్యాలు 15-18)

మలయాళ భాషలో కన్నశ రామాయణ కృతికర్త, మలయాళ ఆధ్యాత్మ రామాయణ కృతికర్త వారిరువురు తమ అభిప్రాయాల్ని ఇలా వెల్లడించారు. **"మూలగ్రంథమైన, వాల్మీకి రామాయణాన్ని చదివి అర్థం చేసుకొనే శక్తి పామరులకు లేదు. అలాంటి మలయాళ పామరుల కోసం తమ రామాయణాలను రచించామని"** వారు తెలియచేశారు.

గోస్వామి తులసీదాస్, **'వేదపురాణ ఆగమాల పద్ధతిలో ఉంటూ ఆదికవి వాల్మీకి వారికి ముందున్న కవులు చెప్పినట్లే ఈ రామచరిత్రను నా ఆత్మ తృప్తికోసం పాడుతున్నానని'** చెప్పాడు.

కృతివాసుడు బంగాళ రామాయణం వంగభాషలో రాశాడు. మునిశ్రేష్ఠుడైన వాల్మీకి రచించిన రామాయణాన్ని పామరులకోసం వంగభాషలో రాశానని అన్నాడు.

వరాహి వంశరాజు అయిన మహామాణిక్యుడు కోరడం వల్ల ప్రజల యొక్క ప్రయోజనం కొరకు వాల్మీకి రామాయణంలో ఉండే ప్రసిద్ధ శ్లోకాలను వెదకి వాటిని అస్సామీ భాషలో ప్రసాదిస్తున్నాను. పాలుకాంచి నెయ్యి తీసినట్లు వాల్మీకి కావ్యం నుండి ముఖ్యమైన, ప్రధానమైన, ప్రత్యేకమైన ఘట్టాలను ఎన్నుకొని వాటిని ప్రజలకు అందించడమే కాక మహా మాణిక్యుని కోరిక ప్రకారం కొత్త పద్యాలను కలిపాను అని అస్సామీ కవి చక్రవర్తి మాధవ కందలి వివరిస్తున్నాడు.[8]

**10.0. ముగింపు**

ఆదికవి వాల్మీకి రామాయణాన్ని భారతీయులకోసం ప్రసాదించాడు. ఆకవి ఇచ్చిన మూల విషయాన్ని అనుసరించి భారత దేశంలో ఉన్న కవులు ఆయాప్రాంత తత్వాన్ని బట్టి అనువదించారు. ఇది కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు మనమందరం ఒక్కటే అన్న భావాన్ని తెలియచేసింది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మే : 2025

పాదసూచికలు

1. A.A. Mac Donell, James Hastings (Ed), Article on the Ramayana, Encyclopedia of Religion and EthicsEdindurgh, T&T.Clark, Vol.X, 3rd impression, 1952, P.574
2. వాల్మీకి రామాయణం అధ్యాయం - 2.35
3. వాల్మీకి రామాయణం, బాలకాండం, గీతాప్రెస్, గోరఖ్‌పూర్.
4. కంబరామాయణం, బాలకాండం, న్యూసెంచరీ బుక్‌హౌస్, ప్రైవేట్ లిమిటెడ్, చెన్నై - 600098, 2012
5. గోనబుద్ధ భూపతి, రంగనాథ రామాయణము, తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాదు, 1989
6. జి.నాగయ్య, తెలుగు సాహిత్య సమీక్ష వాల్యూం - 1
7. కె.ఎం.జార్జి, కంపారిటివ్ ఇండియన్ లిటరేచర్, కేరళ సాహిత్య అకాడమీ, కేరళ, వాల్యూం - 1
8. Biswa Narayan Sastry, Ramayana in Assamese Literature, Ramayana Tradition in Asia, p.584.

# ఆకురాలిన చప్పుడు

**మెర్సీ మార్గరెట్**
ఫోన్ : 90528 09952





కాంతిలో ప్రతిబింబం చూస్తూ
నీడలై నడిచే నీవు, నేను

ఎటు వెళ్లున్నామో తెలియని దారి ఇది
రంగుల ప్రవాహంలా కరిగే కాలం
గతం చీకటి నీడలా వెంటాడే సమయం

ఒకరు చీకటిలో ఒకరు కాంతిలో
ఎదురెదురున్నా దూరమే మిగిలింది
ప్రతి అడుగూ ఒక ప్రశ్నై మారుతుంది

వెలుగు రంగులు ఒకే చెట్టు నీడలో కలిశాయి
ఇప్పుడూ
ఒకవైపు చీకటి, మరొకవైపు వెలుగు
మధ్యలో ఓ నిశ్శబ్దపు పదచిహ్నం

అతడు వెనక్కి నడుస్తున్నాడు
ఆమె ముందుకు పోతుంది
ఆ మధ్య వర్షపు నీటిలా
సుప్తావస్థలో వాలిన ఓ కొమ్మ

ఆకురాలే శబ్దం
అది రుతువు కాదు జ్ఞాపకం
రాత్రి మాటలు తప్పుకున్నాయి
ఉదయం బహిరంగమై నిశ్శబ్దమయింది
చెట్టువాలిన వైపు ఎవరూ నిలువలేదు
కానీ నీడ మాత్రం
ఇద్దరిలో ఒకరికి చెందుతుంది

ఆమె వెలుగులో నడుస్తోంది
అతడు చీకటిలో కనపడుతున్నాడు
వీరి మధ్య
కవిత ఓ చెట్టు రూపంలో నిలబడి ఉంది.

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)

**14. మరీచిమాన్ :** మరీచులు సమృద్ధిగా గలవారు. మరీచులు అంటే కిరణాలు. స్థూలదృష్టితో కిరణం, కరం, అంశువు, మరీచి మొదలైన శబ్దాలన్నింటికీ ఒకే అర్థమే కానీ పదవ్యుత్పత్తిని బట్టి దేని అర్థం దానిదే. 'మరీచి' శబ్దానికి క్షుద్ర జంతువులు, సూక్ష్మ క్రిములు మొదలైనవి దేనితో నశిస్తాయో అది అని వ్యుత్పత్త్యర్థం. కనుక రోగాదులను వ్యాపింపజేసే సూక్ష్మ క్రిములు మొదలైన వానిని ఎప్పటి కప్పుడు నశింపజేసి జగత్తునకు క్షేమం కలిగించేవి మరీచులు. అట్టివి వేలకొలదిగా సర్వతోముఖంగా ఉన్నవాడు 'మరీచిమంతుడు' అని అర్థం. మ్రియన్తే క్షుద్ర జంతవః, తమాంసి వా అనేనేతి 'మరీచిః'. క్షుద్ర జంతువులును, చీకట్లును దీనివలన నశించిపోతాయి. కనుక దీనిని 'మరీచి' అంటారు.

**15. తిమిరోన్మథనః :** తిమిరాన్ని నుగ్గు నుగ్గుగా చేసేవాడు. 'తిమిరం' అంటే చీకటి, ఉష్ణధర్మం ఉండనిది, ఆర్ద్రంగా ఉండేది అని విశేషార్థం. కాముకుల హృదయాలను ఆర్ద్రంగా చేసేది అని కూడా మరొక అర్థాన్ని గురుబాల ప్రబోధిక చూపింది. అటువంటి తిమిరాన్ని స్వరూపం లేకుండా ఉన్మథనం చేసేవాడు ఆదిత్యుడు. ఇక్కడ ఒక విశేషాన్ని మనం గమనించాలి. తిమిరం – చీకటి ఒక పదార్థ కాదు. అది కొలతలకు అందే వస్తువు కాదు. చూపును నిరోధించే ఒక స్థితి. దానిని ఉన్మథనం చేయటం ఒక్క ఆదిత్యునికే సాధ్యం అవుతుంది. సూర్యోదయంతో చీకటి పటాపంచలై పోతుంది. ఎక్కడికి పోతుంది. ఎక్కడికి పోతుందో తెలియనిచోటికి పోతుంది, అంటే నిజంగా పోవటం అంటూ ఉండదు. అస్తిత్వాన్ని కోల్పోవటం మాత్రమే సంభవిస్తుంది. అందుకే చీకటికి అజ్ఞానంతో రూపకం చేస్తారు. అజ్ఞానం సహజంగా ఒక స్థితి కాదు. జ్ఞాన స్ఫురణ లేకపోవటమే అజ్ఞానం. జ్ఞాన స్ఫురణ కలిగినంతనే అజ్ఞానానికి స్థితి ఉండదు. అలాగే తిమిర ప్రకాశాలు. "తమసో మా జ్యోతిర్గమయ" 'తమస్సునుండి నన్ను జ్యోతిస్సునకు చేర్చు' అన్నట్టిది ప్రకృతిస్థితి తిమిరోన్మథనం చేయటమంటే ప్రకాశశక్తిని ప్రసాదించటమే. ప్రకాశ శక్తి వలన తమశ్శక్తి నశిస్తుంది. కాబట్టి తిమిరోన్మథనుడంటే జ్ఞానదాత అని తాత్పర్యం. (సశేషం)(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### మౌనం

వాక్కు మౌనంలో ఉద్భవించి, మౌనంలోనే లీనమై పోతుంది. మనకి భాష మీద అధికారముందని అనుకొంటుంటాం. నిజానికి, భాషకే మనమీద అధికారముంది. మనమేమి అనబోతున్నామో, అనేసిన తర్వాత గాని తెలియదు మనకి – ఒకోసారి మనమున్న మాటలకు మనమే ఆశ్చర్యపోతూంటాం.

మాటలు ప్రతీకలే కాని వాస్తవాలు కావు. సత్యం గురించి ఎంత మనోహరంగా చెప్పినా ఆ మాటలు సత్యం కావు. సత్యాన్ని అర్థం చేసికోవాలంటే మాటలని దాటి వెళ్ళాలి. మైస్టర్ ఎక్‌హార్ట్, "ప్రతీకని చూచి సంతృప్తి పడేవాడు అంతర్గతమైన సత్యాన్ని ఎప్పుడూ అందుకోలేడు", అనేవారు. మాటలు సత్యానికి సూచికలే గాని, సత్యం కావు. భాషలో ఒక కర్తా, ఒక కార్యం, ఒక ఎరిగినవాడూ, ఎరుకా ఇమిడి ఉన్నాయి. కర్త కర్మ ఏకమైపోయే స్థితికి వెళ్ళాలంటే మాటలని దాటాలి.

నిశ్శబ్దమంటే శబ్దం లేకపోవటం కాదు. వాక్కు లేకపోవటమూ కాదు. ఇంగ్లీషు పదం, "సైలెన్స్"లో కొంత వ్యతిరేక భావం ఉంది. దానిని శబ్దానికి వ్యతిరేకపదంగా వాడుతారు. సంస్కృత పదం 'మౌనం' అట్లా వ్యతిరేక భావం పొడచూపని పదం. మౌనం ముని నుండి ఉద్భవించింది. సౌఖ్యం, సుఖం నుండి జనించినట్లు మౌనం ముని యొక్క లక్షణం. ఇక్కడ భౌతికమైన నిశ్శబ్దం సూచింపబడటం లేదు, మానసికమైన నిశ్శబ్దం సూచితమవుతోంది. ఆత్మలో మనస్సు లీనమైనవారే ముని. ముని యొక్క వాక్కు అయిన మౌనం నుండి వెలువడేదే. అన్నిటికీ మూలమైన ఆత్మ నుండే ముని వాక్కు ఉదయిస్తుంది. కాబట్టి ఆయన చెప్పేది వ్యక్తిగత అభిప్రాయం కాదు. కర్తృత్వ భావముండదు. కాబట్టి ముని పలుకులకు పూర్వాపరాలు ఉండవు.

వాక్కు వెలువడక ముందు గల నిశ్శబ్దాన్ని గమనించాలి. ఆ నిశ్శబ్దం వాక్కుకి ఎప్పుడూ తోడుగానే ఉంటుంది. అది లేకపోతే వాక్కే లేదు. వాక్కుని బంధించే సూత్రం నిశ్శబ్దం. దానిని గమనించాలి. ఆ నిశ్శబ్దమనే సూత్రాన్ని మన మెంత సునిశితంగా గమనిస్తే మనకి వాక్కు గురించి అంత మెళకువ ఉంటుంది. కాని, మనం మౌన వశులమైతే, ఏదో ఒకటి పలుకాలన్న వాంఛ ఉండదు. వాక్కు వాంఛని ప్రేరేపిస్తుంది. వాంఛ లేనప్పుడు మౌనమే ఉంటుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 27 హైదరాబాద్ మే : 2025

# జాషువా ఖండకావ్యాలు – తెలుగు కవి ప్రశంస

**ప్రొఫెసర్ ఎ.కె. వేణుగోపాల్ రెడ్డి,** అధ్యక్షులు, తెలుగు పాఠ్య ప్రణాళికా సంఘం, ద్రావిడ విశ్వవిద్యాలయం.
ఫోన్ : 6281 889 426






సుకుమార మనోభావాలు వెల్లివిరిసే కవితను వెలువరించే కవులు హృదయవాదులు. వారిలో రవీంద్రుడు అగ్రగణ్యుడు. ఆ కోవకు చెందిన కవి చంద్రుడు జాషువా. భావకవిత్వంలో అస్పష్టతను నిరసించడమే గాకుండా, ప్రేయసి చుట్టూ అల్లే అయోమయ కల్పన లను, సంకుచిత ధోరణిని తీవ్రంగా వ్యతిరేకించారు. భావకవిత్వపు ప్రధాన లక్షణాలైన ఆత్మాశ్రయ కవిత్వం, సౌందర్యారాధన, సంస్కరణాభిలాష, ప్రణయతత్వం లాంటివి ఆయన రచనల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఆయన తెలియజేసే ప్రతివిషయం ఎలాంటి అయోమయం లేకుండా, సూటిగా, స్పష్టంగా ఉంటుంది. ప్రకృతి సౌందర్య విలాసాలను తనివితీరా ఆనందిస్తూ అందులో దాగున్న రూపాతీతమైన సత్యాన్ని సందర్శిస్తాడు. కాబట్టే ఉత్తమ భావకవుల సరసన నిలబడగలిగాడు.

జాషువా భారతదేశం పట్ల, తెలుగు కవుల పట్ల అచంచలమైన భక్తివిశ్వాసాలు కలిగినవాడు. తెలుగు కవులు ఈ నేలపై చేసిన సాహితీ సేవను కొనియాడుతూ కొన్ని పద్య ఖండికలను రాశాడు. అందులో ఆంధ్రభోజుడు, శబ్దశాసనుడు, తిక్కన, సంగీత సాహిత్య కళానిధి భట్టుమూర్తి, కందుకూరి వీరేశలింగం మొదలైన తెలుగు కవుల గురించి రేఖామాత్రంగా పరిచయం చేయడమే ఈ వ్యాస ఉద్దేశం.

**ఆంధ్రభోజుడు**

మొదటగా పదకొండు పద్యాలు కలిగిన ఆంధ్రభోజుని కవితా ఖండికను స్మృతి కవిత్వంగా అర్థం చేసుకోవాలి. నేడు రాయల రాజ్యం, ఆయన అష్టదిగ్గజాలు లేకపోయినప్పటికి, ఆయన చేసిన కవితాసేవ సజీవంగానే ఉందంటాడు జాషువా. అంటే ఆయన సాధించిన రాజ్యవిజయాలు తాత్కాలికమైనవని, ఆయన చేసిన సాహిత్యసేవే శాశ్వతంగా నిలచిపోయిందని చెప్పడం జాషువా ఉద్దేశం.

నేడు శ్రీకృష్ణదేవరాయలు ఏమైనాడో, ఆయన యుద్ధం కాల నినాదం ఏమైందో, ఆయన భువనవిజయపు అష్టదిగ్గజాలు ఎక్కడున్నారో తెలియదని, దానినంతా కాలమనే సుందరి దొంగిలించుకు పోయిందని బాధపడతాడు. ఆరోజుల్లో యుద్ధాల్లో మేటిగా వెలుగొందిన రాయలు గాథలు, ఖడ్గం పట్టిన తీరును గమనిస్తే కళ్లు చెమ్మగిల్లుతాయని అంటాడు.

కాలచక్ర భ్రమణంలో ఎంతోమంది గతించిపోయరని, భూగర్భం చీల్చి వెదికినా వారు కనబడరని, ఎవరైతే తెలుగు ప్రజల హృదయాల్లో నిలిచిపోయారో వారు మాత్రమే చరిత్ర పుటల్లో మిగిలిపోయారంటాడు జాషువా. ఎందరో గొప్పవారి జీవితాలవలె రాయలవారి కథ కూడా తళుక్కున మెరసి మాయమయ్యిందంటాడు జాషువా. పంపానది చల్లగాలులు కనిపించవని, కోటగోడలు పాచి పట్టాయని, ఆంధ్రుల ప్రతిష్టాజ్యోతి చల్లారి పోయిందని, కాల గమనంలో రాయల రాజ్యసంపదలు కనుమరుగయ్యాయని బాధపడ్డాడు కవి.

ఆనాడు రాయల ప్రాంగణం గండపెండేరపు జిలుగులతో ప్రకాశించిందని, పెద్దనవంటి కవులకు జరిగిన సన్మానం విని తన మనస్సు పొంగిపోయిందని, నేడు ఆ ప్రభలు కన్పించడంలేదని, నాడు రాజులు కవులకు బంగారు మూటలను కానుకలుగా ఇచ్చేవారని, నేడాస్థితి కనిపించడంలేదని ఆవేదనకు లోనయ్యాడు జాషువా.

భువన విజయ సభామంటపంలో అష్టదిగ్గజ కవులు రాయలును కవితా మధువులో ముంచి తేల్చారని, అటువంటి కవిశ్రేష్ఠుల కాళ్లకు గండపెండేరాలను తొడిగిన ఆంధ్రభోజుడు మళ్లీ జన్మిస్తాడా అని జాషువా ఆవేదన వ్యక్తం చేశాడు. పెద్దనగారి మనుచరిత్ర, తిమ్మనగారి పారిజాతాపహరణం లాంటి కృతులను స్వీకరించు వేళ తెలుగు సరస్వతి ముఖంలో కన్పించిన ఆ చిరునవ్వును మరచిపోలేమని, భౌతికంగా వారు లేక పోయినప్పటికి వారు సృష్టించిన సాహిత్యానికి ముసలితనం, మరణం ఎప్పటికి ఉండదని జాషువా పేర్కొన్నాడు.

**శబ్దశాసనుడు**

తెలుగు సాహిత్యంలో కవిత్రయం వారి రచన ఒక విలక్షణమైన విశిష్టతతో కూడి ఉంటుంది. అందులోను సంస్కృతంలో వాల్మీకివలే తెలుగులో నన్నయ ఎందరో కవులకు మార్గదర్శకుడౌతాడు. అతని ఆంధ్రమహాభారత రచన చిన్నదే కానీ ప్రాభవంలో గొప్పదని చెప్పవచ్చు. తెలుగుతల్లి ఒడిలో ఓనమాలు దిద్దుకొని ఆ తెలుగు తల్లికే మొట్టమొదటి కావ్యం అనే ఆభరణాన్ని వేసి అలంకరించిన వాడు నన్నయ. తెలుగు సాహిత్యంలో శబ్దశాసనుడుగా ప్రసిద్ధికెక్కి ఆంధ్రమహాభారత రచనతో తెలుగునాట చిరస్థాయిగా నిలిచిపోయాడు.

తెలుగు సాహిత్యంలో తొలిపద్యం తరువోజలో వచ్చింది. అలాగే తెలుగు సాహిత్యంలో మొదటి నుండి నన్నయ శోభాయమానంగా వెలుగొందుతున్నాడని నర్మగర్భంగా పలికాడు జాషువా. ద్రావిడ దేశపు రాజుల బంధుత్వం వల్ల అస్పష్టమైన పలుకులు పలుకుతూ, రాట్నం తిప్పుతున్న ముసలివారిచేత కూనిరాగాలు తీయిస్తూ, తెల్లవారుజామున బిచ్చమెత్తుకొనే జంగముల గుమ్మెట పాటవలె మినుకు మినుకు మంటూ, స్థిరత్వం లేకుండా ఉన్న తెలుగు సరస్వతిని ఉద్ధరించటానికి రాజరాజ నరేంద్రుని కోరిక మేరకు ప్రప్రథమ కావ్య రచనకు పూనుకున్న కవిలోక చక్రవర్తి నన్నయని కొనియాడాడు జాషువా.

తెలుగు సాహిత్య చరిత్రలో ఆదికవి నన్నయ రచన వేంగి ప్రభువులకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించిందని, కవిబ్రహ్మ తిక్కన తీయనైన పలుకు అనే పద్మానికి తరగని అందం చేకూర్చినదని, కవిసార్వభౌముడైన శ్రీనాథుని వాగ్ధాటి గౌడ డిండిమభట్టు కంచుఢక్కను పగులగొట్టించి, వాని గర్వాన్ని అణచివేసి, విజయ బావుటా ఎగురవేసిందని, సహజ పాండిత్య సంశోభితుడైన పోతన తన మహనీయమైన వ్యక్తిత్వంతో తెలుగు సంస్కృతిని, తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేశాడని, ఆంధ్రకవితా పితామహుడైన అల్లసాని వారి 'మనుచరిత్ర' స్వీకరించు సందర్భంలో ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయలే స్వయంగా గండపెండేరాన్ని తొడిగాడని, పెద్దన పల్లకిని తనే స్వయంగా మోశాడని అన్నాడు. సాహిత్యానికున్న గొప్పదనం అటువంటిదని, ఆంధ్రభారతి తేజస్సు అద్భుతమైందని జాషువా కొనియాడాడు.

**తిక్కన**

ఆంధ్ర సాహిత్య సృష్టికి కవిత్రయం మూర్తిత్రయం వంటివారు. ఆంధ్రసాహిత్యమునకు పురుడుతీర్చి ప్రాణము పోసిన పుణ్యము నన్నయది. దాని జీవిత సౌభాగ్య సౌందర్యములను వివరించి, సాహిత్య కల్పవృక్షముగ సురచిర ప్రతిష్ఠ చేకూర్చిన ప్రాభవము తిక్కనది. సంస్కృతాంధ్ర భాషల్లో నిష్ణాతుడు, వేదవేదాంగాలు, శాస్త్రపురాణాలు, కావ్యనాటకాలంకారాలు ఆపోసన పట్టిన మహావిద్వాంసుడు తిక్కన. జగత్ప్రసిద్ధులైన భారత కవులలో కవిబ్రహ్మ తిక్కన రెండోవాడు.

సంస్కృత భారత కథను మార్పుచేయక, స్వీయకల్పనలతో, రసభావంతో కూడుకున్న కొత్త కాంతులను వెదజల్లి, తెలుగుతల్లి నుద్ధరించటానికి తెలుగులో భారతాన్ని స్వతంత్రకావ్యంగా రచించిన మహామంత్రి తిక్కనను జాషువా మనఃపూర్వకంగా కొనియాడాడు. అనన్య సామాన్యమైన తిక్కన ప్రజ్ఞాపాటవాలను లెక్కించటం నన్నయ, ఎర్రనలకు కూడా సాధ్యంకాదని, తెలుగు సాహిత్యానికి తిక్కన చేసిన సేవకు వెలకట్టలేమని, అది అమోఘమని ఉద్ఘాటించాడు.

నెల్లూరి పాలకుడైన మనుమసిద్ధి ఆస్థానంలో మంత్రిగానే గాకుండా, కవిగా కూడా ఉంటూ కలంపట్టి రచనలు చేసి తన జీవితాన్ని సార్థకం చేసుకొన్నాడని, ఆయన రచించిన పదునైదు పర్వముల భారతం ఆచంద్రార్కం వెన్నెల కాంతులను వెదజల్లుతూ ఉంటుందని పేర్కొన్నాడు. తెలుగు ప్రజలు నల్లపూసలకు ఎంత ప్రాముఖ్యం ఇస్తారో అంతే ప్రాముఖ్యం తెలుగు సాహిత్య చరిత్రలో తిక్కన కుంటుందని, కవిశ్రేష్ఠుడైన తిక్కనకు సాటి వచ్చేవారు లేరని, ఆ గొప్పదనం తను నడయాడిన సింహపురికి దక్కిందని అన్నాడు.

సమస్తాంధ్ర ప్రజానీకానికి భారతామృతాన్ని అందించి, ఆనందింపజేసి, భక్తకోటికి వరణీయుడై, ఆంధ్రుల హృదయాల్లో స్థిరంగా నిలచిపోయిన మహాకవి తిక్కన రచనలను స్వీకరించి నెల్లూరి ప్రభువులు కీర్తిమంతులు అయ్యారని చెప్పాడు. దేవభాషయైన సంస్కృతానికి ఏమాత్రం తీసిపోని రీతిలో తెలుగుభాషకు, తెలుగుదేశానికి కీర్తిప్రతిష్ఠలు, గౌరవమర్యాదలను తీసుకొచ్చి మాతృభాష ఋణం తీర్చుకొన్నాడని జాషువా పేర్కొన్నాడు.

**భట్టుమూర్తి**

బహుళాంధ్రోక్తిమయ ప్రపంచంలో సంగీత సాహిత్య కళానిధిగా ప్రసిద్ధికెక్కిన భట్టుమూర్తి గురించి జాషువా భావన చేసిన తీరును గమనిస్తే –

**"అంతము గానరాని బహుళాద్భుత సత్కవితా ప్రపంచ మా
వంత చలించునో యను భయంబున రాయలు నిల్పునట్టిది
గ్దంతులలోన చెప్పుకొనగా దగు శ్లేష కవిత్వచండ భా
స్వంతుడ వీ వహోబీ సరస భట్టుకవీ! కవితా కళానిధీ!"**

రాయలు అష్టదిగ్గజ కవులలో శ్లేష కవిత్వ చండ భానుడని, కవితా కళానిధి అని భట్టుమూర్తిని కీర్తించాడు. చారిత్రకుల ప్రకారం రామరాజ భూషణుడు అష్టదిగ్గజ కవులలో లేడని, రాయల తర్వాత కాలం వాడని అంటున్నారు. కానీ సంప్రదాయ పండితులు భువనవిజయ సభలో రామరాజ భూషణుడు లేకుండా ఊహించలేమన్నారు. అలాగే జాషువా కూడా అష్టదిగ్గజ కవుల్లో ఒకడుగానే భట్టుమూర్తిని భావించాడు.

రామరాజ భూషణుని శ్లేషవాగ్ధాటికి పెద్దనాది కవి దిగ్గజాలు తత్తర పడ్డారని, ఆనాటికీ ఈనాటికీ దాటడానికి వీలులేని కవితా

నియమపు అడ్డుగోడల్ని నిరాటంకమైన వేగంతో ఛేదించినవాడు భట్టుమూర్తని ప్రశంసించాడు.

**"కాపుకవిత్వ మెవ్వరికి గమ్మదనంబగునంచు"** అంటూ బ్రాహ్మణేతరుల కవిత్వంలోని లోపాల్నెంచి అవమానించే ఆనాటి విద్వత్ సభలోని రామలింగని వంటి వారికి సమాధానంగా చక్కని కవిత్వాన్ని కాపుకాసి పోశావని వినుతిస్తాడు. ఇందులో భట్టుమూర్తిని ప్రశంసించడంలో జాషువా తాను కవిగా పొందిన ఆవేదనను గుర్తుచేసుకోవడం కన్పిస్తుంది.

**కందుకూరి**

తెలుగునాట ఆధునికతకు సరిహద్దుగా భావించే వీరేశలింగంగారు తెలుగునాట ఒక సంచలనం. వితంతువుల విధిరాతలను మార్చి వారి బ్రతుకుల్లో తెలుగు కిరణాలను నింపిన సంస్కరణ భానుడు వీరేశలింగం. కరాచార మహాపిశాచాన్ని కొంగొత్త ఖడ్గాలతో కోరలు తీసిన యోధగా, కవితావేశంతో సత్కావ్యాలు రాసి తెలుగు సరస్వతికి సమర్పించి, కావ్య కళా రంగాలు ఋణపడేలా చేశాడని, సాంఘిక శార్దూలాలు మీదికి దుమికినా, రవ్వంతకూడా భయపడని ఉక్కు గుండెని, కవుల చరిత్రలను రాసి మహాకవులకు ఇంత అన్నం పెట్టి పోయాడని, ఇలా చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి శిష్యులు నీవలననే ఖ్యాతికెక్కారని వీరేశలింగాన్ని కీర్తిస్తాడు.

**"తెలుగు శారదకు నత్తులు ముంగరలు దీసి**
**క్రొంగొత్త తొడవులు గుస్తరించి**
**పరిహాసమన్న కోపము చేయు గడ్డలో**
**నవనీత హాస్య వాఙ్మయమునాటి**
**పసివితంతువుల దుర్భర దీనతకు గుంది**
**కూలిపోయిన కాపురాలు నిలిపి**
**గడన చేసిన చిల్లిగవ్వతో సర్వంబు**
**శరణాలయములపై జల్లివైచి**
**మరణమునకు దక్క మరి తీరుబడిలేక**
**కలము దించనట్టి కవివరుండ**
**కందుకూరి కులుడు కాలుమెట్టిన చోట**
**కాలు మెట్టలేదు కలుష లవము."**

ఆయన కవిత్వంలో మాటల గారడీలు, అలంకారాల ఆడంబరాలు, పాండిత్యపు కసరత్తులు ఉండవు. గుండె లోతుల్లోంచి దూసుకువచ్చి, గుండెలను పలకరించి, పన్నీరు చిలకరించడమే ఆయన ప్రత్యేకత. కలమును కులముతో కొలిచి బేరాలు సాగించే కాలంలో కూడా ఆయన కలంతో కాలాన్ని జయించారు. అందుకే తెలుగుభాష ఉన్నంతకాలం తెలుగు ప్రజలు జాషువా గారిని స్మరిస్తూనే ఉండాలి.. ఉంటారుకూడా....

❖ ❖ ❖ ❖ ❖

# పునాదిలో రాళ్ళలా...

**పి. సువర్ణ** ఎం.ఏ., తెలుగు ద్వితీయ, ఓయూ.
ఫోన్ : 81793 19902



పేరుకు తోటి మనుషులు
అవసరంలో వాడుకోవడానికి
అపర మేధావులు...

నవ్వుల మాటలు కావవి
నా మనసుని ముక్కలు చేస్తానని
బెదిరించే మెత్తమెత్తని కొడవళ్లు
సమాజపు పూలతోటలో
సువాసనలు వెదజల్లే పూలు
ఎప్పుడో వాడిపోయాయి...

చుక్కల మధ్య చందమామలా
ఎక్కడో స్వచ్ఛమైన పువ్వు
దేవుడి గుడిలో వెలుగుతున్న
ఒక దీపంలా ఎక్కడో ఒక
స్వచ్ఛమైన వెలుగు
స్వచ్ఛమైన మనసులెక్కడ అని చూస్తే
ఇంటి పునాదిలో కూరుకున్న
రాళ్లయి కనిపిస్తున్నాయి

తెలుసుకోలేకపోతున్న
ఏ పువ్వు సత్పరిళమోనని
ఈ పరిమళాల దాడికి
భయపడాలా? బాధపడాలా??

ఇప్పుడిప్పుడే అర్థమైతుంది
ఈ పరిమళాలలో మునిగిపోవడం కన్నా
ఏ పరిమళాన్ని పూసుకోకపోవడమే మిన్న అని

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (30) హైదరాబాద్ మే : 2025

# శీర్షికే సర్వస్వం : పరిశోధన 'శీర్షిక'ల లక్షణాలు

**ఆచార్య వెంకటరామయ్య గంపా,** భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** **- సంపాదకులు.**

పరిశోధనలో 'శీర్షిక' అనేది అత్యంత కీలకమైన అంశం. ఒక సిద్ధాంత గ్రంథంలోని ముఖ్యమైన విషయాలను 'శీర్షిక' స్పష్టంగా తెలియజేస్తుంది. ఇది కేవలం ఒక నామకరణం కాదు, ఒక సిద్ధాంత గ్రంథం ఆత్మను ప్రతిబింబిస్తుంది. పాఠకుడిని పరిశోధన ప్రపంచం లోకి ఆహ్వానం పలికి, మొట్టమొదటి అనుబంధాన్ని ఏర్పరిచేది శీర్షికే. ఇది మొదటి చూపులోనే ప్రేమలాంటిది కావచ్చు లేదా నిరాసక్తతకు దారితీయవచ్చు. "Like a hat on a head or the front door to a house, the title of an academic article offers a powerful first impression". Sword, Helen. Stylish Academic Writing. P. 63). 'శీర్షిక అందంగా ఉండాలి, కేవలం సమాచారం ఇవ్వడమే కాకుండా, పాఠకుడి మేధో జిజ్ఞాసను రేకెత్తించాలి' అని Sword, Helen Stylish Academic Writing పుస్తకంలో పేర్కొన్నారు. విద్యా ప్రపంచంలో, నిరంతరం వెలువడుతున్న అనేక పరిశోధనల మధ్య పరిశోధకుడి పనిని గుర్తించేలా చేయడంలో శీర్షిక కీలక పాత్ర పోషిస్తుంది.

**సిద్ధాంత గ్రంథంలో మంచి శీర్షిక లక్షణాలు**

**స్పష్టత, సమాచారపూర్వకంగా ఉండటం**

మంచి సిద్ధాంత గ్రంథం శీర్షిక ముఖ్యమైన లక్షణాలలో స్పష్టత ఒకటి. శీర్షిక పరిశోధన విషయాన్ని స్పష్టంగా, నిస్సందేహంగా సూచించాలి. "Your readers should be able to grasp the gist of what you are studying, why that might be important, and how you are approaching it" (Wayne C. Booth, Gregory G. Colomb, Joseph M. Williams. The Craft of Research. P. 134). అస్పష్టమైన లేదా అతిగా విస్తృతమైన శీర్షికలు పాఠకులను గందరగోళానికి గురిచేస్తాయి, పరిశోధన పరిధిని తప్పుగా సూచిస్తాయి. ఖచ్చితమైన శీర్షిక పాఠకుడి దృష్టిని ఒకే అంశంపై కేంద్రీకరిస్తుంది, పరిశీలనలో ఉన్న కీలక భావనలను లేదా దృగ్విషయాలను నిర్దేశిస్తుంది.

ఉదాహరణకు **'స్పష్టత, సమాచారపూర్వకంగా'** ఉండటం అనే అంశాలు పరిశోధన గ్రంథానికి ఎంత ముఖ్యమో తెలుగులోని నాలుగు సిద్ధాంత గ్రంథాలు/వ్యాసాల శీర్షికల ద్వారా పరిశీలించవచ్చు: (ఆచార్య వెలుదండ నిత్యానంద రావు రచించిన **'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన'** గ్రంథంలో ఉన్న శీర్షికలను ఎంపిక చేసుకోవడం జరిగింది. పరిశోధకుల సమాచారం ఈ గ్రంథంలో లభిస్తుంది)

**'గురజాడ ఖండికలు'** : ఈ శీర్షిక చాలా సాధారణమైనది. 'గురజాడ ఖండికలు' అంటే ఏమిటి? ఆయన రాసిన చిన్న కవితలా? నాటకాలలోని భాగాలా? లేక ఇతర రచనల తాలూకు ముక్తకాలా? అనే స్పష్టత లేదు. పరిశోధన దేని గురించి అన్నది కచ్చితంగా తెలియజేయకపోతే పాఠకులకు గందరగోళం ఏర్పడుతుంది. కాబట్టి, ఈ శీర్షికలో స్పష్టత లేదు.

**'కన్యాశుల్కం- పరిశీలన':** ఈ శీర్షిక కొంత మెరుగ్గా ఉంది. 'కన్యాశుల్కం' అనే ప్రసిద్ధ రచనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, 'పరిశీలన' అనేది చాలా విస్తృతమైన పదం. ఏ కోణంలో పరిశీలిస్తున్నారు? పాత్రల విశ్లేషణా? సాంఘిక నేపథ్యమా? భాషా శైలీనా? నాటకీయత గురించా? ఇలాంటి విషయాలు స్పష్టంగా చెప్పకపోతే పరిశోధన దృష్టి ఏమిటో అర్థం కాదు. కాబట్టి, మరింత సమాచారపూర్వకంగా అవసరం. ఉదాహరణకు: **'కన్యాశుల్కంలో స్త్రీ పాత్రల మనోవిశ్లేషణ'** లేదా **'కన్యాశుల్కం : సాంఘిక విమర్శ'** వంటి శీర్షికలు మరింత స్పష్టంగా ఉంటాయి.

**'గురజాడ కథలు- అనుశీలన':** ఈ శీర్షిక కూడా 'గురజాడ ఖండికలు' లాగే సాధారణమైనది. గురజాడ వారు రాసిన కథల సంఖ్య చాలా పరిమితం. 'అనుశీలన' అంటే ఏమిటి? కథాంశాల

విశ్లేషణా? రచనా శైలీనా? ఇలాంటి వివరాలు లేకపోవడం వల్ల ఈ శీర్షిక పరిశోధన లక్ష్యాన్ని స్పష్టంగా వెల్లడించడంలో విఫలమైంది. మరింత సమాచారపూర్వకంగా కోసం నిర్దిష్ట కథలను లేదా అనుశీలన కోణాన్ని పేర్కొనాలి.

**'గురజాడ కన్యాశుల్కం – ప్రథమ, ద్వితీయ ముద్రణ తులనాత్మక పరిశీలన':** ఈ శీర్షిక మిగిలిన వాటి కంటే చాలా స్పష్టంగా, కచ్చితంగా ఉంది. 'గురజాడ కన్యాశుల్కం' మొదటి, రెండవ ముద్రణలను పోల్చి చూస్తూ పరిశోధన చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. 'తులనాత్మక పరిశీలన' అనే పరిశోధన పద్ధతిని కూడా సూచిస్తోంది. ఏ అంశాలలో పోలికలు చేస్తున్నారో పరిశోధనలో తెలుసుకోవచ్చు. కాబట్టి, ఈ శీర్షిక స్పష్టత, సమాచారపూర్వకంగా ఉండటం అనే లక్షణాలు కలిగి ఉంది.

**సంక్షిప్తత**

స్పష్టత, సమాచారపూర్వకంగా చాలా ముఖ్యమైనవి అయినప్పటికీ, మంచి శీర్షిక సంక్షిప్తంగా కూడా ఉండాలి. పొడవైన శీర్షిక పరిశోధకుడికి మరింత భారంగా ఉంటుంది. "short, sharp, and to the point" ( Sword, Helen. Stylish Academic Writing. P. 63). సంక్షిప్త శీర్షికలు గుర్తుంచుకోవడానికి, ఉల్లేఖించ డానికి సులభంగా ఉంటాయని రచయిత్రి పేర్కొన్నారు.

ఉదాహరణకు **'తెలుగులో భక్తి సాహిత్యం భక్తి కవులు-అన్నమాచార్య సమగ్ర పరిశీలన (క్రీస్తు శకం 11వ శతాబ్ది నుండి 1503 వరకు)'** గ్రంథం. ఇది డి.లిట్. కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం. ఈ శీర్షిక సంక్షిప్తంగా కూడా ఉంచవచ్చు. 'భక్తి సాహిత్యం భక్తి కవులు' అని ప్రత్యేకంగా పేర్కొనడం కంటే భక్తి సాహిత్యాన్ని రచించిన వారు భక్తి ఉద్యమంలో భాగమైన కవులే అనేది స్పష్టం. భక్తి అనే పదాన్ని మరోసారి తిరిగి చెప్పాల్సిన అవసరం లేదు. 'అన్నమాచార్యుల సమగ్ర పరిశీలన' అనేది మరొక అంశం. అన్నమాచార్యుల రచనలకు సంబంధించి 'సమగ్ర పరిశీలన' అనే పదబంధం చాలా విస్తృతమైనది. అన్నమాచార్యుల సాహిత్యంలో ప్రత్యేకంగా ఏ అంశాలను పరిశీలిస్తున్నారో సూచిస్తే మరింత సంక్షిప్తంగా, నిర్దిష్టంగా ఉండేది. ఉదాహరణకు, **'తెలుగు భక్తి సాహిత్యం: అన్నమాచార్యుల కీర్తనల్లో భక్తి భావన'** వంటి శీర్షిక మరింత సంక్షిప్తంగా ఉంటుంది.

క్రీస్తు శకం 11వ శతాబ్ది నుండి 1503 వరకు అనే విషయాన్ని బ్రాకెట్స్ లో ఉంచడానికి బదులుగా ('భక్తి కవులు' అని సాధారణంగా పేర్కొనే స్థానంలో), పరిశోధనలో ప్రధానంగా దృష్టి సారించిన ఇతర ముఖ్యమైన భక్తి కవుల పేర్లను క్లుప్తంగా బ్రాకెట్స్ లో ఉంచుంటే శీర్షిక మరింత సమాచారంతో కూడి ఉండేది.

పైశీర్షికను మరింత సంక్షిప్తంగా మార్చడానికి అవకాశం ఉన్న అంశాలు **'11-15వ శతాబ్దాల తెలుగు భక్తి సాహిత్యం: అన్నమాచార్యుల కీర్తనల్లో భక్తి భావన- ప్రత్యేక అధ్యయనం'.** ఈ శీర్షిక అన్నమాచార్యుల కీర్తనలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తూ, పరిశోధన ప్రధానాంశాన్ని మరింత స్పష్టంగా తెలియజేస్తుంది. 'సమగ్ర పరిశీలన' అనే విస్తృతమైన పదాన్ని తొలగించి, కీర్తనల్లోని భక్తి భావనను ప్రత్యేకంగా ప్రస్తావిస్తుంది. లేదా **'తెలుగు భక్తి సాహిత్యం (క్రీ.శ. 11-15): అన్నమాచార్యుల ప్రత్యేక అధ్యయనం'.** ఈ శీర్షిక తెలుగు భక్తి సాహిత్యం కాలపరిమితిని స్పష్టంగా పేర్కొంటూ, అన్నమాచార్యులపై ప్రత్యేక అధ్యయనం జరుగుతుందని సూచిస్తుంది. 'భక్తి కవులు' అనే సాధారణ పదాన్ని తొలగించింది.

లేదా **'11-15 శతాబ్దాల తెలుగు భక్తి సాహిత్యం-అన్నమాచార్యుల స్థానం'.** ఇది చాలా సంక్షిప్తమైన శీర్షిక, పరిశోధన ప్రధానాంశాలను క్లుప్తంగా తెలియజేస్తుంది. లేదా **'పదకవితా పితామహుడు : 11-15 శతాబ్దాల తెలుగు భక్తి సాహిత్యంలో అన్నమాచార్యుల స్థానం'.** ఈ శీర్షిక అన్నమాచార్యుల విశిష్టమైన కృషిని ('పదకవితా పితామహుడు') నొక్కిచెబుతుంది. ఆ కాలంలోని తెలుగు భక్తి సాహిత్యంలో ఆయన స్థానాన్ని పరిశీలిస్తుందని సూచిస్తుంది.

అయితే, సంక్షిప్తత స్పష్టతను తగ్గించకూడదు. ఇది ఒక సమతుల్యమైన అంశంగా ఉండాలి. "Title should be as brief as possible and as specific as necessary" (Wayne C. Booth, Gregory G. Colomb, Joseph M. Williams - The Craft of Research. p.46). శీర్షిక **'వీలైనంత సంక్షిప్తంగా, అవసరమైనంత నిర్దిష్టంగా'** ఉండాలని సూచిస్తుంది. అంటే అనవసరమైన పదాలు లేదా పదబంధాలను నివారిస్తూ ముఖ్యమైన సమాచారాన్ని చేర్చడం.

**సమాచారపూర్వకంగా ఉండటం**

మంచి సిద్ధాంత గ్రంథం శీర్షిక సమాచారపూర్వకంగా ఉండాలి, పాఠకుడికి సిద్ధాంత గ్రంథం విషయంపై స్పష్టమైన ఆలోచనను అందించాలి. ప్రాథమిక ప్రశ్నకు సమాధానం ఇవ్వాలి. ఈ సిద్ధాంత వ్యాసం దేని గురించి అనే ప్రశ్నకు సమాధానంలా ఉండాలి. "The title should give a clear idea of the subject of the paper" (Kate & Turabian. A manual for writers of research papers, theses, and dissertations. p .39).

**కొన్ని సిద్ధాంత గ్రంథ శీర్షికలను పరిశీలిద్దాం.**

**'ఆంధ్రమహాభారతములో ప్రకృతి వర్ణనలు'** : ఈ శీర్షిక ఆంధ్ర మహాభారతంలోని ప్రకృతి వర్ణనల గురించి పరిశోధన అని స్పష్టంగా తెలియజేస్తుంది.

**'నన్నయ భారతము – వివాహ ధర్మ నిరూపణము'** : ఈ శీర్షిక నన్నయ భారతంలోని వివాహ ధర్మాల గురించి పరిశోధన అని తెలుపుతుంది. ఇది స్పష్టంగా ఉంది.

**'తిక్కన కావ్యశిల్పం-తత్త్వదర్శనం'** : ఇది తిక్కన కవితా శైలి, తాత్త్విక దృక్పథం గురించి పరిశోధన అని తెలియజేస్తుంది.

**'ఆంధ్రమహాభారతము -యుద్ధతంత్రములు':** ఈ శీర్షిక ఆంధ్ర మహాభారతంలోని యుద్ధ వ్యూహాల గురించి పరిశోధన అని స్పష్టంగా సూచిస్తుంది.

దృక్పథం / దృష్టి మరియు పరిధిని తెలియజేసేలా ఉండాలి:

శీర్షిక పరిశోధన దృక్పథం/దృష్టి, పరిధిని ఖచ్చితంగా ప్రతిబింబించాలి. చాలా విస్తృతమైన శీర్షిక వాస్తవ పరిశోధన కంటే ఎక్కువ ప్రతిష్ఠాత్మకమైన సిద్ధాంత గ్రంథాన్ని సూచించవచ్చు, అలాగే చాలా ఇరుకైన శీర్షిక అధ్యయనం పూర్తి పరిధిని సంగ్రహించడంలో విఫలం కావచ్చు. "Be honest; don't exaggerate your results in your title" (Wayne C. Booth, Gregory G. Colomb, Joseph M. Williams. The Craft of Research. p. 46).

పరిశోధన పరిధి అనేది ఆ పరిశోధన ప్రశ్నల ద్వారా నిర్వచించ బడుతుంది. శీర్షిక ఈ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి లేదా సూచనలు ఇవ్వాలి, పరిశోధన సరిహద్దులను సూచించాలి. ఉదాహరణకు, పరిశోధన ఒక నిర్దిష్ట కాల వ్యవధి, లేదా ప్రక్రియపై దృష్టి సారించి దానిని శీర్షికలో సూచిస్తే బాగుంటుంది.

తెలుగులో వెలువడిన సిద్ధాంత గ్రంథాలను పరిశీలించి నప్పుడు అందులో ఉన్న లోటుపాట్లు తెలుస్తాయి.

**'ఆంధ్ర కవిత్వంలో మానవుడు, ప్రకృతి'** అనే సిద్ధాంత గ్రంథ శీర్షికను పరిశీలించినట్లయితే పరిశోధన నిర్దిష్ట దృక్పథం/దృష్టి, పరిధిని సూచించదు. ఏ కాలం నాటి కవిత్వం, ఏ ప్రక్రియలు (ఉదాహరణకు పద్యం, పాట, వచనం) పరిశీలించబడతాయి? వంటి వివరాలు శీర్షిక ద్వారా అవగతం కావు. 'ఆంధ్ర కవిత్వం' , 'మానవుడు, ప్రకృతి' అనే అంశాలు చాలా విస్తృతమైనవి. పరిశోధకుడు తెలుగులో వెలువడిన అన్నీ కాలాలలోని కవిత్వాన్ని, మానవుడు, ప్రకృతికి సంబంధించిన అన్ని అంశాలను విశ్లేషించడానికి ప్రయత్నించాలి. ఇటువంటి శీర్షికలు పరిశోధకుడు పరిశోధనకు ఎంపిక చేసుకున్నప్పుడు ఎంతో శ్రమ పడాల్సి ఉంటుంది. కానీ పరిశోధకుడి శ్రమ కంటే పరిశీలకుల ప్రశ్నలు ఎక్కువగా కనిపిస్తాయి. పరిశోధకుడు ఎక్కువగా కష్టపడినప్పటికీ అది శీర్షికలో అతివ్యాప్తి రూపంలో కనిపిస్తుంది. అటువంటివే మరొకొన్ని ఉదాహరణలు **'తెలుగు సాహిత్యంలో బాల్య వివాహాలు - ఒక పరిశీలన', 'తెలుగు సాహిత్యం- చారిత్రక విమర్శ'.** ఈ సిద్ధాంత గ్రంథాల శీర్షికల పరిధి ఎక్కువగా ఉండి అతివ్యాప్తి కనిపిస్తుంది. పరిశోధకుడి కష్టం, సేకరించిన సమాచారం, విశ్లేషణ సిద్ధాంత గ్రంథ నిర్మాణం మొదలైనవన్నీ బాగున్నప్పటికీ శీర్షికలో అవి కనిపించవు. ఇవి కష్టానికి తగిన ఫలితం లభించని శీర్షికలు. ఇటువంటి శీర్షికలకు పరిశోధకుడు చాలా దూరంగా ఉండాలి.

ఒకవేళ నేడు **'ఆంధ్ర కవిత్వంలో మానవుడు, ప్రకృతి'** అనే అంశంపై పరిశోధన చేస్తే ఈ శీర్షికను మరింత ప్రభావవంతంగా చేయడానికి, పరిశోధకుడు ఈ క్రింది మార్పులు చేయవచ్చు.

కాలాన్ని పేర్కొనడం: **'ఆధునిక ఆంధ్ర కవిత్వంలో మానవుడు-ప్రకృతి'** వంటి మార్పు పరిశోధనను ఒక నిర్దిష్ట కాలానికి (దశాబ్దం/ స్వాతంత్ర్యానికి పూర్వం/తరువాత) పరిమితం చేయడం.

ఒక ప్రక్రియను స్పష్టంగా పేర్కొనడం: **'ఆధునిక తెలుగు పద్య కవిత్వంలో ప్రకృతి చిత్రణ'** వంటి మార్పు కవిత్వంలోని ఒక ప్రత్యేక ప్రక్రియపై దృష్టి పెడుతుంది.

ఇతివృత్తాన్ని పేర్కొనడం: **'ఆంధ్ర కవిత్వంలో పర్యావరణ స్పృహ'** (కాల పరిధి) వంటి మార్పు పరిశోధనకు ఒక నిర్దిష్ట ఇతివృత్తాన్ని అందిస్తుంది.

**ఆసక్తిని కలిగించేలా శీర్షిక ఉండటం**

స్పష్టత, సమాచారపూర్వకంగా అత్యంత ముఖ్యమైనవి అయినప్పటికీ, మంచి శీర్షిక పాఠకుల ఆసక్తిని కూడా రేకెత్తిస్తుంది. Stylish Academic Writing అనే పుస్తకంలో స్వోర్డ్ చెప్పినట్లుగా అది 'ఆకర్షణీయంగా' ఉండాలి. పరిశోధన గ్రంథం లేదా వ్యాసం పాఠకుడిని లోపలికి లాగి, పరిశోధన గురించి మరింత తెలుసుకోవాలని కోరుకునేలా ఉండాలి. జాగ్రత్తగా ఎంచుకున్న పదాలు, ఆసక్తికరమైన పదబంధాలు సూచన ద్వారా ఆకర్షణీయతను సాధించవచ్చు. ఉదాహరణకు **'ఆంధ్ర మహాభారతంలో వర్ణాంతర వివాహాలు'** అనే శీర్షికను గమనించినట్లయితే, ఇది అనేక కోణాల్లో పాఠకుల దృష్టిని ఆకర్షించే శక్తిని కలిగివుంది. ఈ శీర్షిక బలాలు ఏమిటంటే ఇది ఇప్పటికీ, ఎప్పటికీ సామాజిక ప్రాముఖ్యత కలిగివుంటుంది. వర్ణాంతర వివాహాలు ఎప్పటికీ చర్చనీయామైన విషయం. సమాజంలో కుల వ్యవస్థ ప్రభావం ఇంకా కొనసాగుతున్నందువలన, ఈ అంశంపై పాఠకులకు సహజంగానే ఆసక్తి ఉంటుంది. చారిత్రకంగా ఈ వివాహాలు ఎలా ఉండేవి? వాటి పట్ల సమాజం ఎలా స్పందించేది? అనే విషయాలపై తెలుసుకోవాలనే కుతూహలం ఉంటుంది. అలాగే ఆంధ్ర మహాభారతం తెలుగు ప్రజలకు అత్యంత సుపరిచితమైన గ్రంథం. దానిలోని కథలు, పాత్రలు అందరికీ తెలుసు. కాబట్టి, అలాంటి ప్రసిద్ధ గ్రంథంలో వర్ణాంతర వివాహాల గురించి పరిశోధన అంటే ఏమి ఉంటుందో తెలుసుకోవాలనే ఆసక్తి కలుగుతుంది. కేవలం సాహిత్య విద్యార్థులు, పరిశోధకులే కాకుండా చరిత్ర, సామాజిక శాస్త్రం వంటి ఇతర రంగాల వారికి కూడా ఈ అంశం ఆసక్తికరంగా ఉంటుంది. అప్పటి సామాజిక పరిస్థితులు, ఆచారాలు, కులవ్యవస్థ స్వభావం వంటి విషయాలను ఈ పరిశోధన ద్వారా తెలుసుకోవచ్చని వారు భావిస్తారు. ఈనాటి సమాజంలో కూడా వర్ణాంతర వివాహాలు అతి ముఖ్యమైన

అంశం. గతంలో ఈ వివాహాలు ఎలా ఉండేవి? అని తెలుసుకోవడం ద్వారా, నేటి పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఒక చారిత్రక నేపథ్యం లభిస్తుంది. **'ఆంధ్ర మహాభారతంలో వర్ణాంతర వివాహాలు'** అనే ఈ శీర్షిక నిజంగానే కేవలం సాహిత్య పరిశోధన పరిధిని దాటి, విస్తృత పాఠకులను ఆకర్షించే శక్తిని కలిగి ఉంది.

మరొక ఉదాహరణ తెలుగు సమాస సమాలోచన భాషా ఖచ్చితత్వానికి ప్రాధాన్యతనిచ్చే శీర్షిక. **'సమాస సమాలోచన'** అనే పద బంధం ద్వారా తెలుగు వ్యాకరణ నిర్మాణాలపై దృష్టిని స్పష్టంగా సూచిస్తుంది. ఈ శీర్షిక తెలుగు వ్యాకరణం, భాషా శాస్త్రంపై ప్రత్యేక ఆసక్తి ఉన్నవారికి ఆసక్తికరంగా ఉంటుంది.

**కీలక పదాల ఉపయోగం**

ప్రస్తుతం విశ్వవిద్యాలయాలలో సమర్పించిన సిద్ధాంత గ్రంథాలన్నీ అంతర్జాలంలోని shodhganga.inflibnet.ac.in లో లభిస్తున్నాయి. ఒక సిద్ధాంత గ్రంథాన్ని అంతర్జాలంలో శోధించాలంటే కీలక పదాలు చాలా ముఖ్యం. అంతర్జాలంలో శోధనకు సిద్ధాంత గ్రంథం/వ్యాసం ఆవిష్కరణను మెరుగుపరుస్తాయి. ఆసక్తిగల పరిశోధకులు/పాఠకులు సిద్ధాంత గ్రంథాన్ని వెతికి చదవడానికి ఎక్కువ అవకాశం కల్పిస్తాయి. అంతర్జాలంతో పాటు సిద్ధాంత గ్రంథంలోనూ మంచి శీర్షిక ప్రాముఖ్యత పెరిగింది. పరిశోధన ప్రధాన అంశాలు ప్రతిబింబించేలా కీలక పదాలను జాగ్రత్తగా ఎంచుకోవాలి. అవి నిర్దిష్టంగా, అధ్యయన రంగంతో సంబంధం కలిగి ఉండాలి. తమ రంగంలోని పరిశోధకులు సంబంధిత సాహిత్యం కోసం శోధిస్తున్నప్పుడు ఎక్కువగా ఉపయోగించే పదాలను పరిశోధకులు ఎంపిక చేసుకోవాలి. కీలక పదాలను చేర్చడం ద్వారా శీర్షిక సమాచార స్వభావాన్ని మెరుగుపరచవచ్చు. ఉదాహరణకు కొన్ని శీర్షికలను గమనించినట్లయితే కీలక పదాల ఉపయోగం సిద్ధాంత గ్రంథ శీర్షికలకు ఎంత అవసరమో తెలుస్తుంది.

**'ప్రాచీనాంధ్ర తెలుగు కావ్యాల్లో సందేశాలు-రాయబారాలు'** – ఈ అంశంపై పరిశోధన చేసేటప్పుడు, 'ప్రాచీనాంధ్ర', 'తెలుగు కావ్యాలు', 'సందేశాలు', , 'రాయబారాలు' వంటి కీలక పదాలు ముఖ్యమైనవి. సిద్ధాంత గ్రంథాలలో ఈ పదాలు ప్రాచీన కావ్యాల్లో సమాచార ప్రసారం ఎలా జరిగేది? రాజులు, ఇతర వ్యక్తుల మధ్య సంబంధాలు ఎలా ఉండేవో విశ్లేషించడానికి ఉపయోగపడతాయి. అంతేకాకుండా, అప్పటి సామాజిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి సహాయపడతాయి. అంతర్జాలంలో ఈ పదాలను ఉపయోగించి శోధించినప్పుడు, ప్రాచీన తెలుగు సాహిత్యం, కమ్యూనికేషన్ పద్ధతులు, చారిత్రక గ్రంథాలు, సాహిత్యంలో దౌత్య సంబంధాలపై సమాచారం పొందవచ్చు. పాఠకులకు, ప్రాచీన సమాజంలో సమాచార మార్పిడి ఎలా ఉండేదో తెలుసుకోవడానికి, చరిత్ర పట్ల ఆసక్తి పెంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

మరొక సిద్ధాంత గ్రంథం శీర్షిక **'19వ శతాబ్ది నాటి ఆధునికాంధ్ర సాహిత్య ప్రక్రియల ఆరంభదశ'**. ఈ అంశంపై అధ్యయనం చేసేటప్పుడు, '19వ శతాబ్ది', 'ఆధునికాంధ్ర సాహిత్యం', 'ప్రక్రియలు', 'ఆరంభదశ' వంటి కీలక పదాలు చాలా అవసరం. సిద్ధాంత గ్రంథాలలో ఈ పదాలు ఆధునిక తెలుగు సాహిత్యంలో నవల, నాటకం, కథ వంటి కొత్త సాహిత్య ప్రక్రియలు ఎలా ప్రారంభ మయ్యాయి? ఏ పరిస్థితుల్లో ప్రారంభమయ్యాయి? అనే చారిత్రక నేపథ్యాన్ని విశ్లేషించడానికి ఉపయోగపడతాయి. సాహిత్య ఉద్యమాలు, సాంఘిక సంస్కరణలు, భాషాభివృద్ధి వంటి అంశాలను పరిశోధించడానికి కూడా తోడ్పడతాయి. అంతర్జాలంలో ఈ పదాలను ఉపయోగించి శోధించినప్పుడు, 19వ శతాబ్ది తెలుగు సాహిత్యం, ఆధునిక సాహిత్య చరిత్ర, సాహిత్య ప్రక్రియల ఆరంభం వంటి అంశాలపై సమాచారం పొందవచ్చు. పాఠకులకు, తెలుగు సాహిత్యం పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి, సాహిత్య చరిత్ర పట్ల అవగాహన పెంచుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

మరొక సిద్ధాంత గ్రంథం శీర్షిక **'స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యం విద్యా విమర్శ'**. స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యంలో విద్యా విమర్శను పరిశీలించేటప్పుడు, 'స్వాతంత్ర్యానంతరం', 'తెలుగు సాహిత్యం', 'విద్యా విమర్శ' వంటి కీలక పదాలు ముఖ్యమైనవి. సిద్ధాంత గ్రంథాలలో, ఈ పదాలు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తెలుగు సాహిత్యంలో విద్య, విమర్శ ఎలా అభివృద్ధి చెందింది? ఎలాంటి మార్పులు జరిగాయి? అనే విశ్లేషణ చేయడానికి ఉపయోగపడతాయి. విద్యా వ్యవస్థ, సాహిత్య విమర్శ సిద్ధాంతాలు, బోధనా పద్ధతులపై పరిశోధన చేయడానికి కూడా తోడ్పడతాయి. అంతర్జాలంలో ఈ పదాలను ఉపయోగించి శోధించినప్పుడు, స్వాతంత్ర్యానంతర తెలుగు సాహిత్యం, విద్యా విమర్శ, సాహిత్య సిద్ధాంతాలు, విద్యా సంబంధిత సాహిత్యంపై సమాచారం పొందవచ్చు. పాఠకులకు, తెలుగు సాహిత్యంలో విద్యా సంబంధిత చర్చలు, విమర్శల గురించి తెలుసుకోవడానికి సాహిత్యం, విద్య మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది.

**శీర్షికల్లో కొత్తదనం**

వివిధ విశ్వవిద్యాలయాల్లో తెలుగు సాహిత్య పరిశోధన జరుగు తున్నప్పటికీ, సిద్ధాంత గ్రంథాల శీర్షికల్లో కొత్తదనం కొరవడటం గమనించవచ్చు. సిద్ధాంత గ్రంథాల శీర్షికలు కొన్నిసార్లు పునరావృత మవుతున్నట్లు 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' గ్రంథం ద్వారా తెలుస్తుంది. అందుకు పలు కారణాలు కనిపిస్తున్నాయి.

**పరిమితమైన పరిశోధనాంశాలు :** కొన్నిసార్లు పరిశోధకులు ఇప్పటికే ఎక్కువగా అధ్యయనం చేసిన అంశాలనే మళ్లీ ఎంచుకోవడం వల్ల శీర్షికల్లో కొత్తదనం కనిపించడం లేదు.

**సాంప్రదాయిక విధానాలు :** కొన్ని విశ్వవిద్యాలయాలు, పర్యవేక్షకులు పాత పద్ధతులను అనుసరించడం వల్ల కొత్త శీర్షికలను ప్రోత్సహించకపోవచ్చు.

**సృజనాత్మకత లేకపోవడం :** శీర్షికను రూపొందించేటప్పుడు పరిశోధకుల్లో లేదా పర్యవేక్షకుల్లో తగినంత సృజనాత్మకత లేకపోవడం కూడా ఒక కారణం.

**సరైన మార్గదర్శకత్వం లేకపోవడం :** కొన్నిసార్లు కొత్త కోణాలను అన్వేషించడానికి సరైన మార్గదర్శకత్వం లభించకపోవచ్చు.

సిద్ధాంత గ్రంథంలోని శీర్షికలకు సంబంధించి ఆచార్య వెలుదండ నిత్యానందరావు అభిప్రాయాలు గుర్తుచేసుకోదగినవి.

**"ఎవరు స్పృశించని అంశాన్ని గ్రహిస్తే తాము చెప్పిందే మొదటి మాట అవుతుంది. తర్వాత మాట్లాడేవాడు నివేదించడానికి అయినా ఏకీభవించడానికి అయినా ఇతడిని స్మరించక తప్పదు. దీనివల్ల పరిశోధకుడికి కీర్తి రావడం జరుగుతుంది. అయితే 3000 సిద్ధాంత గ్రంథాలు వచ్చాక ఎవరు స్పృశించని అంశాన్ని దొరికించుకోగలడం కష్ట సాధ్యం. అలాగని అసాధ్యం మాత్రం కాదు చేయవలసిన అంశాలు ఎన్నెన్నో ఉన్నాయి పరిశోధన అక్షయపాత్ర అలా మంచిది లభిస్తే పరిశోధకుడు అదృష్టం"** (నిత్యానందరావు, వెలుదండ. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. పుట– 51)

**"తెలుగు సాహిత్యంలో జీవపరిణామ సిద్ధాంతం'** అని అంటే ఇదేదో గంభీరంగా మహత్తరంగా ఉన్నట్లు అనిపిస్తుంది కానీ అంతా వట్టిదే పరిశోధకుడు కానీ, పర్యవేక్షకుడు కానీ శీర్షిక వ్యామోహంలో పడిపోకూడదని హెచ్చరించడానికి ఇది చెప్తున్నది" (పైదే.పుట– 52)

ఈ రెండు పేరాలను కలిపి చూస్తే, ఆచార్య నిత్యానందరావు పరిశోధనలో కొత్తదనం విలువను గుర్తిస్తూనే, ఆకర్షణీయమైన కానీ అంతగా ప్రాధాన్యత లేని శీర్షికల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. నిజమైన పరిశోధన అనేది లోతైన అధ్యయనం, కొత్త విషయాల ఆవిష్కరణపై ఆధారపడి ఉండాలి, కేవలం ఆకర్షణీయమైన పేర్ల మీద కాదని ఆయన భావిస్తున్నారు. ఆచార్య నిత్యానందరావు అభిప్రాయాలు వాస్తవమైనప్పటికీ కొత్తగా పరిశోధించాల్సిన అంశాలు శీర్షికలు ఎన్నో ఉన్నాయి.

**శీర్షికల్లో కొత్తదనం రావాలంటే పరిశోధకులు, పర్యవేక్షకులు కొన్ని విషయాలపై దృష్టి పెట్టాలి :**

**ప్రస్తుత పరిశోధనలో ఉన్న ఖాళీలను గుర్తించడం :** పరిశోధకులు తాజా ప్రచురణలను క్షుణ్ణంగా చదవడం ద్వారా, ఇంతకు ముందు అధ్యయనం చేయని లేదా తక్కువగా అధ్యయనం చేసిన అంశాలను గుర్తించగలగాలి.

**అంతర్ విషయ అధ్యయనాలను** (interdisciplinary studies) **ప్రోత్సహించడం :** వేర్వేరు రంగాలలోని భావనలను కలపడం ద్వారా కొత్త, ఆసక్తికరమైన పరిశోధనా ప్రశ్నలు తలెత్తవచ్చు.

**సృజనాత్మక ఆలోచనలను స్వాగతించడం :** పర్యవేక్షకులు విద్యార్థుల వినూత్నమైన ఆలోచనలను ప్రోత్సహించాలి, వాటిని మరింత అభివృద్ధి చేయడానికి సహాయం చేయాలి.

**నూతన పరిశోధనా పద్ధతులను అన్వేషించడం :** కొత్త సమాచార సేకరణ, విశ్లేషణ పద్ధతులను ఉపయోగించడం ద్వారా కొత్త దృక్కోణాలు, ఫలితాలు పొందవచ్చు.

**సమకాలీన సమస్యలపై దృష్టి పెట్టడం :** సమాజంలో ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనే పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడం.

shodhganga లో 'పరిశీలన' అనే పదంతో శోధిస్తే దాదాపు 500 కు పైగా సిద్ధాంత గ్రంథాల సమాచారం లభిస్తుంది. కథలకు సంబంధించి దాదాపు 100 పైగా శీర్షికలు 'పరిశీలన' పేరుతో కనిపిస్తున్నాయి. 'ప్రపంచీకరణ కథలు –విమర్శనాత్మక పరిశీలన', 'ప్రకృతి వైపరీత్య కథలు– పరిశీలన', 'చందమామ కథలు– ఒక పరిశీలన', 'వల్లంపాటి కథలు–పరిశీలన'.. ఇలా తెలుగులో పరిశోధన శీర్షికలలో తరచుగా కనిపించే పదం 'పరిశీలన'. ఈ పదానికి పత్రికా భాష నిఘంటువులో **'ఏదైనా ఒక విషయానికి సంబంధించిన మంచి చెడులను జాగ్రత్తగా విశ్లేషించడం'** అని పేర్కొన్నారు. మరికొన్ని నిఘంటువులను చూస్తే మరికొంత సమాచారం కనిపిస్తుంది. ఈ నిఘంటువుల ద్వారా, 'పరిశీలన' అనే పదం అనేక అర్థాలను కలిగి ఉందని అవగతం అవుతుంది. ఇది సాధారణంగా గమనించడం, పరీక్షించడం, దర్యాప్తు చేయడం, శోధించడం, సమీక్షించడం, ఆలోచించడం, నిశితంగా చూడటం వంటి అర్థాలలో ఉపయోగించ బడుతుంది. ఈ పదం అర్థం సందర్భాన్ని బట్టి మారుతుంది. వ్యాస పరిమితి దృష్ట్యా మరింత ఈ విషయంపై మరింత లోతుకు వెళ్లదలచు కోలేదు. ఈ 'పరిశీలన' అనే పదాన్ని సిద్ధాంత గ్రంథ శీర్షికలో ఉ ంచి పరిశోధన అంశాలను ఒకే పద్ధతిలో పరిశీలిస్తూవున్నారు. ఎటువంటి కొత్తదనం ఉండటం లేదు. ఉదాహరణకు కథలకు సంబంధించి శిల్పం అనే అంశాన్ని పరిశీలించేటప్పుడు అధ్యాయంలో

**మూసీ**

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

గతంలో పరిశోధకులు ఏం చెప్పారో అదే అంశాలను తిరిగి చెబుతున్నారు. వాటికి ఒకటి రెండు వాక్యాలను అన్వయం పేరుతో జోడిస్తున్నారు. తెలుగులో పరిశోధన కంటే ఆంగ్లంలో పరిశోధన గ్రంథాల సంఖ్య. ఆంగ్ల పరిశోధక విద్యార్థులు శీర్షికలు కొత్తదనాన్ని చేర్చే ప్రయత్నం చేస్తూ ఉన్నారు. మన దగ్గర అటువంటి ప్రయత్నం లేదు.

**పరిశోధన గ్రంథం శీర్షిక నిర్మాణం**

పరిశోధన శీర్షికను రూపొందించేటప్పుడు చాలా జాగ్రత్త వహించడం అవసరం. మంచి పరిశోధన గ్రంథం శీర్షిక రెండు ముఖ్యమైన భాగాలను కలిగి ఉండాలని పరిశోధకుల అభిప్రాయం.

మొదటి భాగం పరిశోధకుడి ఎంపిక చేసుకున్న ప్రాథమిక అంశం, పరిశోధన ప్రధాన విషయాన్ని పాఠకులకు పరిచయం చేస్తుంది. ఇది అధ్యయనం కేంద్రబిందువు ఏమిటో స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ భాగం సంక్షిప్తంగా, నేరుగా ఉండాలి, తద్వారా పరిశోధన ఏ రంగానికి లేదా అంశానికి సంబంధించినదో ఎవరికైనా వెంటనే అర్థమవుతుంది. అస్పష్టమైన లేదా చాలా సాధారణమైన పదాలను ఉపయోగించడం వల్ల పాఠకులకు పరిశోధన నిర్దిష్టతపై సరైన అవగాహన ఉండకపోవచ్చు.

రెండవ భాగం పరిశోధకుడి పరిశోధనా దృక్పథం, మొదటి భాగంలో పేర్కొన్న అంశాన్ని పరిశోధకుడు ఏ కోణం నుండి పరిశీలిస్తున్నాడో లేదా ఏ పద్ధతులను ఉపయోగిస్తున్నాడో తెలియజేస్తుంది. ఇది పరిశోధనకు ఒక ప్రత్యేకమైన దృష్టిని , లోతును అందిస్తుంది. ఈ భాగం పరిశోధన లక్ష్యం, ఉపయోగించిన విధానం (సైద్ధాంతిక లేదా అనుభావిక), పరిధి (ఉదాహరణకు, ఒక నిర్దిష్ట ప్రాంతం లేదా సమయ వ్యవధి) లేదా పరిశోధకుడు దృష్టి సారించిన ప్రత్యేకమైన కోణాన్ని వెల్లడిస్తుంది. ఈ నిర్మాణం శీర్షికను మరింత స్పష్టంగా, నిర్దిష్టంగా, సమాచారంగా చేస్తుంది.

ఈ రెండు భాగాలను సాధారణంగా ఒక డాష్ (–) లేదా ఇతర విరామ చిహ్నంతో వేరు చేస్తారు. మొదటి భాగం 'ఏమిటి' అనే ప్రశ్నకు సమాధానం ఇస్తే, రెండవ భాగం 'ఎలా' లేదా 'ఎందుకు' అనే ప్రశ్నలకు సమాధానం ఇస్తుంది. ఈ నిర్మాణం పరిశోధన పూర్తి చిత్రాన్ని సంక్షిప్తంగా అందిస్తుంది.

ఉదాహరణ: **'పత్రికలలో వ్యాపార ప్రకటనలు – అనువాద సమస్యలు'** : ఇందులో మొదటి భాగం (పత్రికలలో వ్యాపార ప్రకటనలు) పరిశోధన ప్రాథమిక అంశాన్ని స్పష్టం చేస్తోంది. ఇది పరిశోధన పరిధిని నిర్దేశిస్తుంది – పత్రికలలో కనిపించే వ్యాపార ప్రకటనలపై అధ్యయనం కేంద్రీకృతమై ఉందని తెలుపుతుంది.

రెండవ భాగం (అనువాద సమస్యలు) పరిశోధకుడు ఈ అంశాన్ని ఏ దృక్కోణం నుండి పరిశీలిస్తున్నాడో వివరిస్తుంది. ఇక్కడ, వ్యాపార ప్రకటనలను ఒక భాష నుండి మరొక భాషకు అనువదించేటప్పుడు ఎదురయ్యే సవాళ్లు, సమస్యలపై పరిశోధన దృష్టి సారిస్తుందని స్పష్టమవుతోంది.

ఈ విధానం శీర్షికను మరింత సమాచారంగా, ప్రత్యేకంగా చేస్తుంది. పాఠకులకు పరిశోధన విషయం ఏమిటి, పరిశోధకుడు దానిని ఎలా అధ్యయనం చేస్తున్నాడు అనే దానిపై తక్షణ అవగాహన కలుగుతుంది. ఇది పరిశోధన పరిధిని, దృష్టిని త్వరగా గ్రహించడానికి సహాయపడుతుంది.

**నిర్మాణం : శీర్షిక + ఉపశీర్షిక**

నిర్మాణం : శీర్షిక + ఉపశీర్షిక పద్ధతిలో సిద్ధాంత గ్రంథ శీర్షిక ఉండటం వలన పాఠకులకు పరిశోధన ప్రధాన అంశం, దాని నిర్దిష్ట పరిధి గురించి స్పష్టమైన లేదా సంక్షిప్త అవగాహనను అందిస్తుంది.

**శీర్షిక :** పరిశోధన ప్రధాన అంశాన్ని సంగ్రహంగా తెలియజేస్తుంది. ఇది ఆసక్తికరంగా, సూటిగా ఉండాలి, తద్వారా పాఠకుల దృష్టిని ఆకర్షిస్తుంది.

**ఉపశీర్షిక :** ప్రధాన శీర్షికను మరింత స్పష్టం చేస్తుంది, పరిశోధన నిర్దిష్ట అంశాలు, భౌగోళిక పరిధి, కాల వ్యవధి లేదా ఉపయోగించిన పద్ధతులను సూచిస్తుంది.

**ఈ నిర్మాణం ముఖ్య ప్రయోజనాలు:**

**1. స్పష్టత :** శీర్షిక, ఉపశీర్షిక కలిసి పరిశోధన దృష్టిని చాలా స్పష్టంగా తెలియజేస్తాయి, తద్వారా పాఠకులు దాని ఔచిత్యాన్ని త్వరగా అంచనా వేయగలరు.

**2. సమాచారపూర్వకంగా :** ఉపశీర్షిక అదనపు వివరాలను అందించడం ద్వారా శీర్షిక సాధారణ స్వభావాన్ని తగ్గిస్తుంది, తద్వారా పరిశోధన ఖచ్చితమైన స్వభావాన్ని తెలియజేస్తుంది.

**3. శోధనకు అనుకూలమైనది :** స్పష్టమైన, నిర్దిష్టమైన శీర్షిక, ఉపశీర్షికలు అంతర్జాల సమాచార, శోధనలో సిద్ధాంత గ్రంథం కనుగొనబడటానికి సహాయపడతాయి.

**4. పాఠకులకు మార్గనిర్దేశం :** శీర్షిక, ఉపశీర్షిక చదివిన వెంటనే పాఠకులకు సిద్ధాంత గ్రంథంలో ఏమి ఉంటుందో ఒక ప్రాథమిక ఆలోచన వస్తుంది, తద్వారా వారు దానిని చదవాలా వద్దా అని నిర్ణయించుకోవడానికి సహాయపడుతుంది.

ఉదాహరణకు **'విజయ విలాస కథ – తులనాత్మక పరిశీలన (నన్నయ, తిమ్మక్క, వెంకటకవి, జగ్గకవి)'** అనే సిద్ధాంత గ్రంథ శీర్షికకు, శీర్షిక, ఉపశీర్షికల నిర్మాణం ప్రయోజనాన్ని విశ్లేషిస్తే.. ఈ సిద్ధాంత గ్రంథ శీర్షికలో 'విజయ విలాస కథ – తులనాత్మక పరిశీలన' అనేది ప్రధాన శీర్షిక. ఇది గ్రంథం ముఖ్య విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది – విజయ విలాస కథను పోల్చి చూడటం అని అర్థమవుతోంది. (నన్నయ, తిమ్మక్క, వెంకటకవి, జగ్గకవి)

అనేది ఉపశీర్షిక. ఈ ఉపశీర్షిక పరిశీలనకు తీసుకున్న కవులను ప్రత్యేకంగా పేర్కొంటుంది. ఇలా శీర్షిక, ఉపశీర్షికను కలపడం వలన పాఠకులకు గ్రంథం ప్రధానాంశం ఏమిటో, ఏయే అంశాలపై దృష్టి సారించారో త్వరగా అర్థమవుతుంది. తద్వారా, పరిశోధన పరిధి ఏమిటో తెలుసుకోవడానికి ఇది సహాయపడుతుంది. క్లుప్తమైన శీర్షిక ప్రధాన విషయాన్ని తెలియజేస్తే, ఉపశీర్షిక మరింత నిర్దిష్టమైన సమాచారాన్ని అందిస్తుంది, ఇది గ్రంథం లక్ష్యాన్ని మరింత స్పష్టం చేస్తుంది.

**ముగింపు**

ఒక పరిశోధన శీర్షిక కేవలం అలంకారప్రాయమైనది కాదు, అది పరిశోధన గుర్తింపు. స్పష్టత, సమాచారపూర్వకంగా, సంక్షిప్తత, సమాచారపూర్వకంగా ఉండటం, సరైన దృక్పథం, ఆసక్తిని రేకెత్తించడం, కీలక పదాలను కలిగి ఉండటం వంటి లక్షణాలు ఒక మంచి శీర్షికకు ప్రాణం పోస్తాయి. దురదృష్టవశాత్తు, తెలుగు పరిశోధనలో కొన్నిసార్లు ఈ లక్షణాలు లోపిస్తున్నాయి, ముఖ్యంగా కొత్తదనం, నిర్దిష్టత విషయంలో మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

శీర్షిక, ఉపశీర్షికల నిర్మాణం పరిశోధనకు మరింత స్పష్టతను, నిర్దిష్టతను అందించగలదు. నేటి పరిశోధకులు తమ శీర్షికలను మరింత ఆలోచనాత్మకంగా రూపొందించడానికి ప్రయత్నించాలి, తద్వారా వారి పరిశోధన సారాంశాన్ని సమర్థవంతంగా తెలియజేయడానికి, పాఠకుల దృష్టిని ఆకర్షించడానికి అవకాశం ఉంటుంది. ఆచార్య నిత్యానందరావు చెప్పినట్లుగా, కొత్త అంశాలను స్పృశించడం, శీర్షికల వ్యామోహంలో పడకుండా ఉండటం రెండూ ముఖ్యమే. సరైన మార్గదర్శకత్వం, సృజనాత్మక ఆలోచనలతో, తెలుగు పరిశోధన లోనూ మరింత ఆకర్షణీయమైన, సమాచారయుక్తమైన శీర్షికల ఆవశ్యకతను పరిశోధకులు గుర్తించగలరు.

**ఉపయోగించుకున్న పుస్తకాలు**

తెలుగు

వెలుదండ నిత్యానందరావు. విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన. హైదరాబాద్ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2013.

English

Booth, Wayne C., Gregory G. Colomb, and Joseph M. Williams. The Craft of Research. 3rd ed. Chicago: University of Chicago Press, 2008.

Kate, L. Turabian. A Manual for Writers of Research Papers, Theses, and Dissertations. 9th ed. Chicago: University of Chicago Press, 2018.

Sword, Helen. Stylish Academic Writing. Cambridge: Harvard University Press, 2012.

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం 'కదంబం'.

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

చర్చ

# తెలుగు భాషా సాహిత్యాలు – పరిశోధన పద్ధతులు

ఘట్టమరాజు, బెంగుళూరు, 9964082076

తెలుగు సాహిత్య పరిశోధన కుప్పలు తిప్పలుగా సాగుతున్నా, దాని నాణ్యత మాత్రం నానాటికి తీసికట్టు నాగంభట్లు వైనంగానూ, దిన దినంబులు మన బలంబులు సన్నంబులయ్యె అన్న రీతిగా విశ్వవిద్యాలయ తెలుగు ఆచార్య పుంగవులు, పరిశోధనా పర్యవేక్షకులైన అసిస్టెంటు, అసోసియేట్, ప్రొఫెసర్లు వాపోవడం మాత్రం నాకేవో చిత్ర విచిత్రంగా తోస్తుంది. ఆచార్య వెంకటరామయ్య గంపా వారి వ్యాసం **'తెలుగు భాషాసాహిత్యాలు–పరిశోధన పద్ధతులు'** (మూసీ మాసపత్రిక ఏప్రిల్ 2025 (పేజీలు: 27–32) వెలువడటం, తెలుగు భాషా సాహిత్య పరిశోధన స్థాయి, ఇంపుసొంపుల గురించి సంపాదకులు సత్సంకల్పం చేసి, ఈ విషయమై విద్వాంసుల్ని చర్చించవలసిందిగా కోరడం సంతోషించ తగ్గ విషయమూ, స్వాగతించాల్సిన సంగతీనూ.

ఆచార్య వెంకటరామయ్య తమ వ్యాసంలో పరిశోధనాంశం ఎన్నికలోని సమస్యలు, పరిశోధన ఖాళీలు అనే రెండు అంశాల గురించి సుదీర్ఘంగా చర్చించారు.

పరిశోధనలో ముఖ్యాతి ముఖ్యమైన అంశం తగిన వస్తువును ఎన్నుకొనడం. నేటికాలం ఔత్సాహికులైన పరిశోధకులు సులభాతి సులభమైన అంశాన్ని ఎన్నుకొని, దీర్ఘాతి దీర్ఘమైన అవధిలో ఆడుతూ పాడుతూ పని చేయకుండా, అలుపూ సొలుపూ తెలియకుండా సిద్ధాంత గ్రంథం సమర్పించి చేతులు దులుపుకొంటారు. పర్యవేక్షక మహాశయులు తమ శిష్యుల సిద్ధాంత గ్రంథాలు బైండిగు అయి ముద్దు లొలికేరీతిలో తమ కళ్లెదుట పడగానే చిరునవ్వులు చిందిస్తూ, తమ కర కమలంతో సంతకం చేసి ధన్యులవుతారు. తర్వాత పరిశీలక మహాభాగుడు తాను ఎలాంటి కష్టనష్టాలకూ లోను కాకుండా యోగ్యతాపత్రం బరువూ బాధ్యతల నుంచి సేద తీర్చుకొంటాడు.

ఆచార్య వెంకటరామయ్య గంపా పరిశోధకుడు తాను ఎన్నుకునే అంశం గురించి వహించవలసిన గురుతర బాధ్యతల్ని పూర్వ ఆచార్య వర్యులు ప్రవచించిన పసిడిపలుకుల్ని పేర్కొన్నారు. ఇప్పటి అంటే అప్పుడే యం. ఏ. పట్టా పుచ్చుకొని పరిశోధనా క్షేత్రంలోకి దుమికిన వాళ్లకు విషయ పరిజ్ఞానం కాని, పరిశోధన పద్ధతుల వూసు కాని తెలియదనే వూహ కానీ, పర్యవేక్షక మహనీయులకు పరిశోధనాంశం సూచించే తాకత్తు వుంటుందని కాని గమనించారో లేదో నాకు అంతుపట్టడం లేదు. ఇంతవరకు ఏయే విషయాలపై పరిశోధనలు జరిగాయో తెలిపే కైదివ్వె డా. వెలుదండ నిత్యానందరావు భగీరథ ప్రయత్న ఫలితంగా అందుబాటులో వున్న 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' పుటల్ని తిప్పే ఆసక్తి కాని. ఓపిక కాని పిసరంత కూడా లేని పరిశోధనా పర్యవేక్షకుల మనస్తత్వాన్ని వొంట బట్టించుకొనీ, మౌనవ్రతం పూనిన వ్యాసకర్త ఆచార్య వెంకటరామయ్య గంపా గంపెడంత శ్రమకోర్చి, నవయువ పరిశోధకుల్నుంచి పరిశోధనాసక్తిని, అర్హతల్ని అపేక్షించారు. నాకెందుకో ఈ సమయంలో నోరు సూది బెజ్జమంత, ఆకలి ఆకాశమంత అన్న సామెత గుర్తుకొస్తున్నది. ఆచార్య వెంకటరామయ్య పరిశోధకులకు సరైన శిక్షణ లేకపోవడం గురించి ప్రస్తావించారు. ఆ'సరైన శిక్షణ' నేటి పరిశోధనా పర్యవేక్షకులకు లభించిందంటారా? పరిశోధనాంశం గురించి అభ్యర్థులు తగినంత అధ్యయనం చేయాలి, అవగాహన కలిగివుండాలి అని వెంకటరామయ్య గారు ఆశించారు; అభిలషించారు. ఇక్కడ ఆయన వివిధ విషయ నిష్ణాతులైన పూర్వ ఆచార్య వర్యుల్ని ప్రస్తావించారిలా – **"అన్ని అంశాలలో నిష్ణాతులైన ఆచార్యులు ఉండటం వలన విద్యార్థులకు వారి అభిరుచులకు అనుకూలంగా ఆయా రంగాలలో నిష్ణాతులైనా ఆచార్యుల దగ్గర పరిశోధన చేశారు. ఫలితంగా కొంతమంది చాలా ఉత్తమమైన పరిశోధన గ్రంథాలను వెలువరించే అవకాశం కలిగింది."** (పేజీ: 28) ఆనాడు ఉత్తమమైన పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయంటే అందుకు కారణం ఆయా రంగాల్లో నిష్ణాతులైన ఆచార్యుల పర్యవేక్షణ కాదు. పరిశోధకుల అవిరళకృషి, అవగాహనాసామర్థ్యం, రచనా ప్రావీణ్యం, చిత్తశుద్ధి మొదలైన సుగుణాలు. అయితే పర్యవేక్షక మహానుభావులు ఎలాంటి, స్వలాభాపేక్ష లేకుండా నిష్కల్మష హృదయంతో శిష్యుల పురోభివృద్ధిని ఆకాక్షించిన పుణ్యమూర్తులు, నేను రెండు చేతులు జోడించి నమస్కరించే ఏకైక ఆచార్యులు ఖండవల్లి లక్ష్మీరంజనం పుణ్యశ్లోకులు. 20 వ శతాబ్దం ఉత్తరార్థ ప్రారంభంలో యమ్.ఏ. పట్టా పొందిన వెంటనే పరిశోధనారంగ ప్రవేశం చేసిన పరిశోధకులు అరుదని చెప్పొచ్చు. కొన్నేళ్లపాటు కళాశాలల్లో ఉపన్యాసక బాధ్యతలు చక్కగా నిర్వహించి, తెలుగుభాషపై పట్టుపొంది, అర్థగ్రహణ శక్తి, అనుశీలనాశక్తి సంపాదించిన తర్వాతనే పరిశోధనా క్షేత్రంలోకి పదార్పణ చేసేవాళ్ళు: ఎలాంటి పదోన్నతి వేతనవృద్ధి, అవకాశాలు లేని ఆ పాడుకాలంలో కేవలం జ్ఞానార్జన కోసం త్రికరణశుద్ధిగా శ్రమించిన కర్మవీరులు వాళ్లు. అంతేకాని, పని తక్కువగా ప్రతిఫలం ఎక్కువగా పొందే బతకనేర్చిన విద్వాంసులు కారు.

ఆచార్య వెంకటరామయ్య అన్న ఈ మాటలు మాత్రం నాకు మింగుడు పడటం లేదు –**"కాని ప్రస్తుతం అధిక శాతం విశ్వవిద్యాలయలలోని తెలుగుశాఖలలో చాలా తక్కువ సంఖ్యలో అధ్యాపకులు ఉన్నారు. ఇటువంటి పరిస్థితులలో పరిశోధన అంశం ఎన్నికే పెద్ద సమస్యగా మారింది. గత్యంతరం లేక పర్యవేక్షకుల అభిప్రాయాల మేరకు పరిశోధన అంశాలను మార్చుకున్న**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మే : 2025




**పరిశోధకులు చాలా మంది ఉన్నారు."** (పేజి: 28-29) విశ్వవిద్యాలయాల తెలుగుశాఖల్లో అధ్యాపకులు చాలా తక్కువ సంఖ్యలో వుండటానికీ, పరిశోధన అంశం ఎన్నిక పెద్ద సమస్యగా మారటానికీ లంకె ఏమిటి ఆచార్య వర్యా? పీర్లపండక్కీ తాతాచార్లకు ముడివేసినట్లు! అసలు పరిశోధనాంశం ఎన్నిక గురించి తలలు బద్దలు కొట్టుకొనే మేధావులు ఎవరు చెప్పండి? పరిశోధకుడు, పర్యవేక్షకుడు, శాఖధిపతి, ఆ సమయంలో ఇతర విశ్వవిద్యాలయాల నుంచీ వచ్చి పాలు పంచుకొనే పండిత మహాశయులూ- వీరెవ్వరికీ పరిశోధనాంశం నిర్ణయ సమావేశంలో చీమకుట్టినట్లు కూడా అనిపించక, ఏ మహానుభావుడూ నోరెత్తకుండా పనులన్నీ చకచకా సాగిపోతుంటాయి. కాదంటారా వెంకటరామయ్య గారు? ఔనంటారా?

సూక్ష్మమతి ఆచార్య గంపా **"వాస్తవంగా అధికశాతం మంది పరిశోధకులు ప్రారంభకాలంలో సరియైన శ్రద్ధ చూపకపోవడం, పరిశోధన సమయం ముగిస్తున్న (ముగుస్తున్న అన్న మాట సముచితం) సందర్భంలో కేవలం డిగ్రీ కోసం సిద్ధాంత గ్రంథాన్ని పూర్తిచేయడం జరుగుతున్నటువంటి వాస్తవం ఇటువంటి పరిస్థితులలో పర్యవేక్షకులు, సలహాదారుల పాత్ర కాగితాలకే పరిమితమై పోతుంది. ఫలితంగా పరిశోధన అంశం ఎంపికే సమస్యగా మారుతుంది."** (పేజి:29) డాక్టరు గారూ! పుండు ఎక్కడుందో రోగికీ తెలుసు. భిషక్ వర్యులైన మీకూ బాగా – మాబాగా తెలుసని మీ పై మాటలే ఢంకా మోతగా మా కర్ణభేరుల్ని చీల్చి వేస్తున్నాయి. ఇంత తెలిసీ మీరు పుండు బాగవటానికి మందు వేయలేకపోతున్నారు కదా? విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన గురించి కాకతీయ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయ తెలుగుశాఖల్లో ఏ నలభై ఏళ్ల కిందటో డా. కేతవరపు వేంకటరామకోటి శాస్త్రి, డా. జి.వి. సుబ్రహ్మణ్యం ప్రభృతులు గొంతు చించుకొన్నారు, తెలుగు పరిశోధన విలువలు, స్వరూప స్వభావాలు పెంపొందించారు. తర్వాత మహామహోపాధ్యాయులు నవ్వుతూ పేలుతూ తమ తమ గూళ్లు చేరుకొన్నారు. ఆనాటికీ ఈనాటికీ తెలుగు భాషాసాహిత్య పరిశోధన **"ఆకాశంబున నుండి శంభుని శిరం బందుండి శీతాద్రి.... పవనాంధో లోకమున్ జేరె గంగాకూలంకష, పెక్కుభంగులు ........."** భర్తృహరి, సూన్నత వాక్కుల్ని సుందరంగా తెనిగించిన ఏనుగు లక్ష్మణకవి పద్యావశేషం చెప్పను సుమండీ. నేను నిజం చెప్పే జాతీయస్థాయి జీవన సాఫల్య పురస్కారం పొందిన ఉభయభాషా ప్రవీణులైన ఓ గురువృద్ధుని కరకమలాలతో 'దోషజ్ఞు'డనీ, మరో దేశికోత్తమునితో 'మహా అపాయకారి' అన్న భుజకీర్తులను తొడిగించు కున్నాను.

ఆచార్య సత్తమా! ప్రియమిత్రమా! మీరు స్వీయ తప్పిదాలను గుర్తించడం, పరిశోధన ఖాళీలను గుర్తించడం, అన్వేషించని సాహిత్య ప్రక్రియలను పరిశీలించడం, సాహిత్య సాంస్కృతిక సిద్ధాంతాలను అన్వయించడం వగైరా వగైరా విషయాల్ని ప్రస్తావించి, కడుపులో చల్ల కదలకుండా విశ్వవిద్యాలయ, స్నాతకోత్తర కేంద్ర పరిశోధనా పర్యవేక్షకుల, పరిశీలకుల ప్రశాంత మానస సరోవరాన్ని మత్తేభంలా కలచివేస్తూ కలవర పెడ్తున్నారు. శాంతమ్ పాపమ్!

ఆచార్య వెంకటరామయ్య గంపా గారు! మీరు మీ అధునాతన పరిశోధన పద్ధతుల్ని నేటి తెలుగుభాషా సాహిత్య పరిశోధనకు అనువర్తితం చేయాలన్న పేరాశతో వున్నారు. ఆపనేదో మీ ఢిల్లీ విశ్వవిద్యాలయ పరిధిలో అమలు పరచండి. చేతనైతే, మీ తెలుగుశాఖ లోని సహోద్యోగుల్ని మెప్పించి, వొప్పించండి. అదే మీరు చేయగలిగే మహోపకారం.

మీదృష్టిలో తెలుగుభాషా సాహిత్య పరిశోధన స్థితి శోచనీయంగా వుంది. ఆందోళనకరంగా వుంది. కాని నాకు మటుకు తెలుగు భాషా సాహిత్య పర్యవేక్షకులు, పరిశీలకులు గుండెలమీద చెయ్యి వేసికొని హాయిగా గుర్రుపెట్టి నిద్రపోతున్నారు. నిద్రకోసం తనుకులాడుతున్న వాళ్లెవరంటే ఉద్యోగ సద్యోగాలు లేని డాక్టరేట్ పట్టాదార్లే.

అన్నట్లు ఓ ముఖ్యాతిముఖ్యమైన విషయం చెప్పడం మరిచాను. మన విశ్వవిద్యాలయాల్లోని పరిశోధకులు జె.ఆర్.ఎఫ్. సి.ఆర్.పి.ఎఫ్, పి.డి.ఎఫ్ విద్యార్థి వేతనాలు కొన్నేళ్లపాటు (ఐదు, మూడేళ్లు) అనుభవిస్తూ పిహెచ్.డి. పట్టా సంపాదించు కొంటారో లేదో కాని కొంతమందైనా కులాంతర, మతాంతర వివాహాలు చేసుకొని పిల్లాపాపలతో సుఖజీవనం సాగిస్తున్నారు. ఈ విధంగా మన విశ్వవిద్యాలయ ఆచార్య వర్గం సమాజ శ్రేయస్సుకు కొంతైనా పాటు పడుతూాండడం అభినందనీయం. పరిశోధన పర్యవేక్షకులు శిష్యవర్గానికి పరిశోధన మార్గదర్శనం చేశారో లేదో కాని వాళ్ళ పెళ్ళిళ్ళకు మాత్రం పౌరోహిత్యం వహించి పుణ్యం కట్టుకొంటున్నారు.

తెలుగుభాషా సాహిత్య పరిశోధనా రథం పరిశోధకుల నగు మొగాలతో, పర్యవేక్షక, పరిశీలకుల ఆశీర్వాద బలంతో సునాయసంగా నల్లేరుపై బండినడకలా సాఫీగా సాగిపోతూంది. మీరు ఎలాంటి చీకూ చింతలకు లోనుగాకండి. శుభం భూయాత్!

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (39) హైదరాబాద్ మే : 2025

# శ్రీ శంకరాచార్యుల జీవితం – తత్త్వం

డా. వీపూరి వేంకటేశ్వర్లు, ఫోన్ : 98855 85770

ఏ పరమసత్యం మనల్ని మనోదేహ ఉపాధి ఆధారిత పరిమిత ఉనికి నుంచి అనంత, ఆధ్యాత్మిక ఆదర్శం వైపు నడిపించి, మనలోని పరమాత్మ తత్త్వం, యావత్సృష్టి స్థితుల్లోని పరమాత్మతత్త్వం వేరు వేరు కాదనే, ఒక్కటేననీ బోధించిందో – వ్యక్తికి, సమిష్టికి కూడా వరంగా పరిణమించిన ఆ సత్యాన్ని ఆనాటి ధార్మిక సంస్థలు, మతాలు పూర్తిగా విస్మరించాయి.

మీమాంసకులు సుఖానుభవం కోసం కోరికలను ఎక్కువ చేసుకొమ్మని బోధించగా, సాంఖ్యయోగ విధానం సంఘానికి దూరంగా – ఏకాంతంగా జీవించటాన్ని ప్రోత్సహించింది. న్యాయ, వైశేషిక సిద్ధాంత అనుయాయులు అశాస్త్రీయమైన స్వానుభవ ప్రమాణం పరమ సత్యంగా భావించి, తర్కమూ అందులోని సూక్ష్మ విషయాల వలలో తగుల్కొని విలవిలలాడసాగారు.

ఇక బుద్ధుడు చెప్పిన మహోన్నత జీవితాదర్శాలను వదిలిపెట్టి బౌద్ధుల ఆలోచనలో నిరీశ్వరవాదం – క్షుద్ర దేవతారాధన వంటి సత్యదూర ధోరణులు అధికమయ్యాయి. లోకాయతికులయితే బాహ్యసుఖాలకు, ఇంద్రియాధారిత ప్రాపంచిక సుఖాలకు ప్రాముఖ్యత నిచ్చి, జీత జీవన సాఫల్యమార్గ మిదేనని చాటారు. జైనులదయితే ఇంకొక రకపు అతివృష్టి. దేహాన్ని శుష్కింపజేసి, ఇంచుమించు హింసించి, ఆచరణ అసాధ్యమైన అహింసా ధోరణుల ద్వారా మోక్షాన్ని సాధించాలని ప్రయత్నించారు. ఇలా ఎవరికి వారే యమునాతీరే అనే విధంగా, ఒక దిశా, నిర్దేశమూ లేని కృతక సమాజం, మతం ఆనాడు మనకు కన్పిస్తాయి.

ఇటువంటి క్లిష్ట సమయంలో విశ్వాత్మ శంకరులను పంపింది. శంకరులు ఈ మహోత్కృష్ట కార్యాన్ని సాధించడానికి, సాంఘిక ఆధ్యాత్మిక రంగాల్లో దేశాన్ని పునరుజ్జీవింప చేయడానికి ఉద్భవించిన అవతారమూర్తి.

శంకరులు వైశాఖశుద్ధ పంచమినాడు కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులం వద్ద గల కాలడి అనే గ్రామంలో జన్మించారని నానుడి. ఆయన తండ్రి శివగురువు, తల్లి ఆర్యాంబ. వీళ్ళిద్దరూ శివభక్తులే! సనాతనాచార సంపన్నులైన నంబూద్రి బ్రాహ్మణ కుటుంబీకులు, తైత్తిరీయ శాఖ, కృష్ణ యజుర్వేదులు. ఎంతోకాలంగా సంతానలేమి కారణంగా వాళ్ళు ఒక పుత్రుణ్ణి ప్రసాదించమని పరమశివుణ్ణి ప్రార్థించారు. ఆ ప్రార్థన ఫలితంగా పొందిన తమ పుత్రుణ్ణి శివప్రసాదంగా భావించి, శిశువుకు 'శంకర' అని పేరు పెట్టారు.

శంకరుడు అతిచిన్న వయసులోనే కావ్య పురాణాలను అధ్యయనం చేసి, పాండితీపరిపక్వతను సాధించాడు. శంకరుని



ఏడవ యేట, అతడి తండ్రి స్వర్గస్థుడయ్యాడు. ఆర్యాంబశంకరునికి ఉపనయన సంస్కారం జరిపించి, వేదవేదాంతవిద్యను అభ్యసించడానికై గురుకులానికి పంపింది. తనకు పుట్టుకతో వచ్చిన దైవదత్తమైన పరిజ్ఞానం, ప్రావీణ్యతల కారణంగా గురుకుల విద్యాభ్యాసమంతా అనతికాలంలోనే పూర్తి చేశాడు. శంకరునికున్న జిజ్ఞాస, బ్రహ్మాండ జ్ఞాన సంపదలు పండితుల చేత విశేషంగా ప్రశంసింపబడి, ఆ విషయం ఆ దేశపు రాజుకు తెలిసి, ఆయన శంకరులకు గౌరవ మర్యాదలు – ధనధాన్య సంపదలను ఇవ్వాలని చూశాడు. కాని శంకరుడు జన్మతః సన్న్యాసేచ్ఛ కలవాడు కావడంతో రాజుగారి కోరికను సున్నితంగా తిరస్కరించాడు.

శంకరుని బ్రహ్మణ్యావస్థలో ఒకనాడు అతడు భిక్షాటన చేస్తూ ఒక చిన్న పూరిగుడిసె ముందు నిలిచి అలవాటుగా "ఓం నారాయణ హరి, భవతి భిక్షాం దేహి" అని యాచించాడు. ఆ ఇంటి యజమానురాలు ఒక నిరుపేద వృద్ధ వనిత. తన దారిద్ర్యానికి చింతిస్తూ తన వద్దనున్న ఒకే ఒక ఉసిరికాయను శంకరుని భిక్షా పాత్రలో వేసి తనస్థితిని వివరించి, "నాయనా ! నీకు ఆత్మజ్ఞానం కరతలామలకమై భాసించుగాక!" అని ఆశీర్వదించింది.

ఆమె దారిద్యానికి, ఆశీర్వాదానికి కదలిపోయిన శంకరుడు అక్కడికక్కడే లక్ష్మీదేవిని ఉద్దేశించి 'కనకధారాస్తవం' అనే స్తోత్రాన్ని ఆశువుగా స్తుతించగా, బంగారు ఉసిరికాయలు వర్షంగా ఆ ఇంట్లో కురిసాయని, ఆమె దారిద్ర్యం అంతటిలో తీరిపోయిందని ప్రతీతి. కాని ఆ వృద్ధ ముత్తైదువ సరస్వతీదేవి అనీ, ఈ ఘటన అంతరార్థం – శంకరులకు తన కర్తవ్యాన్ని గుర్తు చేయటమేనని, ఆ వృద్ధురాలి దైన్యాన్ని వదిలించినట్టుగానే నిర్వీర్యమైన వైదికధర్మాన్ని పునరుద్ధరించి లౌకికంగా అభ్యుదయం పైపు, ఆధ్యాత్మికంగా ముముక్షువులకు మోక్ష సాధన సామగ్రి సమకూర్చే కల్పతరువుగా మార్చమని సూచనయని కొందరు వ్యాఖ్యాతల అభిప్రాయం.

శంకరుడు గురుకులం నుండి తిరిగొచ్చేసరికి ఆయన వయస్సు పదహారేళ్ళు మాత్రమే! అర్హుడైన వరాన్వేషణలో లోనున్న తల్లిదండ్రులు పిల్లనిస్తామంటూ ఆర్యాంబ చుట్టూ తిరుగుతూ ఉండేవారు. కాని శంకరుడు సన్యసించాలన్న ప్రగాఢమైన వాంఛతో ఉన్నాడు. కాని అతని తల్లి ఎట్టి పరిస్థితుల్లోను సన్యాసానికి అంగీకరించే అవకాశమే లేదని తేల్చి చెప్పింది.

ఒకనాడు శంకరుడు, ఆర్యాంబ తమ ఇంటికి సమీపంలోనున్న పూర్ణానదికి స్నానానికై వెళ్ళారు. ఉన్నట్టుండి శంకరుడు తననొక మొసలి పట్టుకుందని, ఇవే తన అంతిమ ఘడియలని ఆర్యాంబకు చెప్పి, కనీసం ఇప్పుడైనా తన జీవితపుచివరి కోరికైన సన్యసించ టానికి అనుమతించమని దీనంగా వేడుకున్నాడు. దిక్కుతోచని ఆర్యాంబ, తన కుమారుని చివరికోర్కె తీర్చి, తృప్తిగా చనిపోనీలెమ్మని అనుజ్ఞను ఇచ్చింది. తల్లి సమ్మతి లభించిన శంకరుడు 'ఆపత్సన్యాసం' స్వీకరించి, నీటిలో నుండి బయటకు వచ్చి, మొసలి తనను వదిలివేసి, ఎటో పోయిందని చెప్పి, తల్లిని అనునయించాడు. తన ప్రాప్తమంతేననుకుని ఆర్యాంబ సమాధానపడింది.

శంకరుడు తన తల్లిని ఇంకా సమాధానపరచటం కోసం తాను ఎక్కడ, ఏ పరిస్థితుల్లో ఉన్నప్పటికీ, ఆమె అంత్య ఘడియలు ఆసన్నమైనప్పుడు మాత్రం స్మరించినంత మాత్రాన వచ్చి, ఆమె పక్కనే ఉంటాననీ, అంత్యక్రియలు తన బాధ్యత అనీ చెప్పి, అనుజ్ఞాతుడై, నర్మదా నదీ తీరాన ఆశ్రమం ఏర్పరచుకుని ఉన్న గోవింద భగవత్పాదాచార్యుల దగ్గరికి ప్రయాణమై వెళ్ళిపోయాడు. శంకరుల జాతకాన్ని పరిశీలించిన జ్యోతిష్కులు, ఆయన తన 16వ ఏట తప్పక మరణిస్తాడని చెప్పి ఉండటం వల్ల, సన్యసించటం అనేది వాసనా ప్రపంచం నుండి నిష్క్రమించటమే గనుక, ఆ దుర్యోగం ఆ విధంగా తీరింది లెమ్మని ఆర్యాంబ తృప్తి పడింది. తత్త్వపరంగా ఆలోచిస్తే, మొసలి మహా మోహ గ్రాహం గనుక, సన్యాసం స్వీకరించిన వెంటనే మొసలి విడిచిపెట్టడం, శంకరులకు కలిసివచ్చిందనవచ్చు.

ఇక గోవింద భగవత్పాదాచార్యులు గౌడపాదాచార్యుల శిష్యుడు. అతి గొప్ప అద్వైత వేదాంతి. ఆనున శంకరుని వంటి కారణజన్ముడు. తన శిష్యుడు కావటం సంతోష కారణంగా జీవించి, శంకరుని అభ్యర్థన మేరకు వైదికమైన సన్యాసదీక్షను అనుగ్రహించాడు.

శంకరులు గురువు ఆజ్ఞ మేరకే లోక ప్రసిద్ధి చెందిన "వేదాంత సూత్రాలకు" భాష్యం వ్రాసారు. శంకరులు 4 సంవత్సరాలు శిష్యరికం చేసిన అనంతరం గురువు అనుజ్ఞ తీసుకుని బహుదేశాటనం చేసి, కాశీ చేరుకున్నారు. కాశీ చేరిన కొద్ది కాలానికే ఎందరో పత్రిభావంతులైన శిష్యులను ఆకర్షించసాగారు. వారిలో ప్రథముడు సునందుడను చోళదేశపు బ్రాహ్మణ యువ బ్రహ్మచారి. కాలాంతరంలో పద్మపాదుడుగా ప్రసిద్ధి చెంది, శంకరునికి అత్యంత ప్రియశిష్యుడైనాడు. తర్వాత మరో ఇద్దరు ప్రతిభావంతులైన యువకులు శంకరునికి శిష్యులైనారు. వారే హస్తామలకుడు, తోటకాచార్యుడు. తోటకాచార్యుల ప్రసిద్ధ నామధేయం ఆనందగిరి.

వారణాసిలో నివాసమున్న కాలంలో శంకరులు తానెంచుకున్న ముఖ్యమైన 3 గ్రంథాలకు భాష్యం వ్రాయటం మొదలుపెట్టారు. ఆయన ప్రథమంగా వ్యాఖ్యానించింది- "శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము" అని అందరూ అంగీకరించిన విషయం. భగవద్గీత, ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలకు ఆయన భాష్యాలు వ్రాశారు. అప్పటినుంచి ఈ మూడు వేదాంత గ్రంథాలను ప్రస్థానత్రయంగా పిలవడం పరిపాటి అయ్యింది.

శంకరుడు వారణాసిలో తన అద్వైతసిద్ధాంతాన్ని విరివిగా ప్రచారం చేస్తున్న రోజులవి. అద్వైతం ప్రకారం జాతి, మత, కుల, లింగ, వచన, పశు, పక్షి, వృక్ష, జంతు జాలాలకు ఉత్తమ, అధమ స్థాయిలతో సంబంధం లేకుండా అతీతంగా, ప్రతి ప్రాణి, జీవి - అన్నింటిలోనూ ఉన్నది ఒకే ఆత్మ మాత్రమే! భేదాలన్నీ కేవలం మాయానిర్మితాలేనని! ఈ విషయాన్ని ఒక చండాలుని ద్వారా అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు. 'మనీషాపంచకం' ఆశువుగా చెప్పారు. అలాగే ఒక వృద్ధుడు తన ఇంటి పంచమీద కూర్చొని "పాణినీయ వ్యాకరణ సూత్రాన్ని భట్టీయం చేస్తూ, 'దుక్కరణేయితి ధాతుః" అని వల్లె వేస్తున్న అతని ప్రయత్నం ఎంత నిరర్థకమైందో గమనించి, ఆచార్యులతని నుద్దేశించి "భజగోవిందం భజగోవిందం / గోవిందం భజ మూఢమతే/ సంప్రాప్తే సన్నిహితే కాలే / నహి నహి రక్షతి దు క్కరణే - అని తన మనస్సులోనిప్రబోధాత్మక భావపరంపరకు అక్షరరూపం కల్పించాడు.. ఈ వ్యర్థ కాలహరణం కంటే గోవిందుడిని భజించు, గీతను పఠించు, దానధర్మాలు చేయి అని వచ్చే ఈ భజగోవింద స్తోత్రం బహుళ ప్రచారం పొందింది.

శంకరులు తన జీవిత కాలంలో 23 భాష్యగ్రంథాలను, 54 ప్రకరణ ఉపదేశ గ్రంథాలను, 76 స్తోత్ర స్తుతి గ్రంథాలను మొత్తంగా153 గ్రంథాలను అందించారు.

పారమార్థిక సత్తా, వ్యావహారిక సత్తా, ప్రాతి భాసిక సత్తా అనే మూడు విధాలైన సత్యశోధన, తత్త్వగ్రహణ విధానాలను ప్రతిపాదించారు. మానవాళి ముందు ఒక పరిపూర్ణ జీవన విధానాన్ని ప్రతిపాదించాడు. జీవన సాఫల్యం వైపుకి తీసుకునిపోగల సమర్థమైన చక్కని వ్యవస్థను రూపొం దించారు.

ఈ విధంగా శంకరులు ఒక మహోన్నత వ్యక్తిత్వం గలవారు.. 32 ఏండ్ల చిన్న వయసులో దేశంలో సంపూర్ణ సాంఘిక, మత విషయిక, ఆధ్యాత్మిక విప్లవాన్ని తీసుకొచ్చారు.

ఆ రోజుల్లో శంకరులు ప్రత్యేకంగా భావించి ఏ సమస్యల గురించి ఆలోచించాలో అవే సమస్యలు ఈ నాటికీ ఉన్నాయి. ఆయన సూచించిన పరిష్కారాలు ఈనాటికీ పనికొస్తాయి. అదే శంకరుల, గొప్పదనం కూడా!

ఇలా శంకరాచార్యులు ఒక దార్శనికులైన సంస్కర్త.

భారతదేశానికే గాక యావత్ప్రపంచానికీ వెలుగురేఖ.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మే : 2025

# భౌతిక వాదం నుండి భావవాదం వైపు గజేంద్రమోక్షం

**డా. మంథని శంకర్,** అధ్యక్షులు, తెలుగు పాఠ్య ప్రణాళికా సంఘం, కాకతీయ విశ్వవిద్యాలయం. ఫోన్ : 83743 54873

**ఉపోద్ఘాతం :**

గర్వం దేనిని లెక్క చేయదు.దానికి కారణం బలం. **"బలవంతుడ నాకేమని"** విర్రవీగడం ఒక్కోసారి ప్రాణాపాయస్థితికి దారి తీస్తుంది. **"చనిపోయిన సార్వభౌముని కంటె బతికి ఉన్న చిన్న చీమ మేలు"** చలనానికి చైతన్యానికి ప్రాణముండాలి. ప్రాణముండని జడత్వంతో క్రియలేమి జరుగవు. భాగవతకథలో గర్వంతో భగవంతున్ని గుర్తించని పాత్రలు అన్ని ప్రతినాయకులుగా చిత్రణ కావించారు. వ్యాసభాగవత మైనా, పోతన భాగవతమైనా ప్రతినాయకులు మరణిస్తారు. భాగవతంలోని అష్టమ స్కంధంలోని కథ గజేంద్రమోక్షం. ఇక్కడ గజేంద్రుడు గర్విష్టి. ఎవరిని లెక్కచేయక తను ఏదిచేసినా అదే ధర్మంగా భావించాడు. దేవుడంటే లెక్కచేయనివాడు. హేతువును నమ్ముతూ ఉంటాడు. కాని ఎంత హేతువును నమ్ముకున్న కొన్నింటిని హేతువును మాత్రం గుర్తించక ముందే యాదృచ్ఛికంగా కాలగమనంలో అవి జరిగిపోతుంటాయి. వాటిని మనం ఏ మాత్రం ప్రభావితం చేయలేం. అలాంటి సమయాలలో కాలాన్ని బలం తెలివి రెండు బలహీనపడి సృష్టిని దైవికంగా గుర్తించాల్సిన పరిస్థితులు నెలకొంటాయి.అలాంటి ఈ కథ గజేంద్రమోక్షం. దేవుడు ప్రత్యక్షంగా వస్తాడు. మోక్షం అంటే విముక్తి, విడుదల కావడం. మోక్షం అంటే శాశ్వత ఆనందం. కష్టాల నుండి అంతిమ స్వేచ్ఛ. అయితే ఇందులో మరణం కూడ మోక్షం అర్థంలోనే భాషిస్తుంది. యోగలో కూడ మోక్షం గూర్చి ప్రస్తాంచారు. అయితే పోతన నాస్తికత్వం నుండి అస్తికత్వం వైపు మనసును తిప్పుకోవడమే మోక్షంగాను, ప్రాణాపాయం నుండి బ్రతికి బయటపడడమే మోక్షంగా వ్యాసఋషి, పోతనలు భావించినట్లు ఈ కథ మాత్రమే తెలియపరుస్తుంది. ఒక దేవున్ని ప్రార్థిస్తే ఆ దేవుడు తన శత్రువును చంపి తనను బ్రతికిస్తాడు. ఈ ప్రార్థన చేసింది తనను బ్రతికించమని. బ్రతుకే మోక్షంగా ఈ కథ సారాంశం. అందుకే ఈ కథలో బ్రతడం గాక మోక్షమంటే మరోటి గాదు.

**కథలోకి వెళ్తే** ఆ కొలనులో తన ప్రియురాండ్లతో గజేంద్రుడు ఎంతో సంతోషంగా జలక్రీడలు ఆడుతున్నాడు. గజేంద్రుడు ఆ కొలనును చెదగొట్టుతున్నా, శృంగార చేష్టలలో వెంట్రుకలు చెదిరిన ప్రియురాండ్రలా ఆ ఆడ ఏనుగులు అతిశయించుచున్నాయి. ఈ విధంగా బలంలో, అధికారంలో తన అంతటివాడు లేడు అన్నట్లు ఆ మత్తగజము ఆ సరస్సులో క్రీడించునపుడు ఆ కొలనులో ఒక మూలనున్న ఒక మొసలి గజేంద్రున్ని చూసి భుగభుగ మనే శబ్దం రాగ నీటి బుడగలు పుట్టగా ఆ కొలనులోని అలలు లేచి నింగిని తాకగా అందులో చేపలు బయపడుతుండగా నీటిలోని సుడిగుండాలు తిరుతుండగా ఈ అలల తాకిడికి ఆ కొలను ఒడ్డునున్న చెట్లు కూలిపోతుండగా, సూర్యగ్రహణం నందు సూర్యున్ని రాహువు పట్టిన విధంగా ఈ మదకరిని ఆ మకరి అదిమి పట్టుకుంది.

**"కరి దిగుచు మకరి దరికి**
**గరి దరికిని మకరి దిగుచు గరకరబెరయన్**
**గరికి మకరి మకరికి గరి**
**భరమనుచును నతల కుతల భటులదురుపడన్"**

ఆ గజరాజు నీటిలో చేసే క్రీడలకు ఆ నీటిలోని జంతుజాలమే భయంతో దాగుకుంటున్నాయంటే అది ప్రళయంగా భీభత్సంగా ఆ కొలను అతలకుతలమయివుంటుంది. ఎంతటివారికైనా ఓ సమయం చెడు చేస్తారనడానికి సందర్భమిది. ఈ సమయంలో మొసలి రూపంలో గజరాజుకు పెద్ద కీడే వచ్చి పట్టుకుంది. ఆ మొసలి గజముల యొక్క లొల్లి కొట్లాటను పోతన ఎంతో భీకరంగా వర్ణించాడు.

ఏనుగు ఎంతో శక్తితో మొసలిని విడిపించుకొనడానికి యత్నిస్తుంది. ఆ ఏనుగు బలాన్ని గ్రహించిన మొసలి ఏవిధంగానైనా ఈ ఏనుగును గెలువాలని నిశ్చయించుకుంది.ఆ గజేంద్రుడు మొసలిని విడపించుకోవడానికి భీకరంగా ఘీంకరించింది. తొండాన్ని పైకెత్తి వేగంగా కొట్టింది. తన దంతములతో మొసలి రొమ్ము పగిలి పోయేటట్లుగా పొడిచింది. దేవేంద్రుని బాహువుల వంటి తన తొండముతో మొసలి మెడను చుట్టి విసిరిపెట్టింది. ఆ కొలనులో మొసలితో ఒంటరిగా కొట్లాడుతున్న ఆ గజేంద్రుణ్ణి వదలిపోలేక ఆ ఆడ గజములు ఒడ్డున చూస్తూ ఉండిపోయాయి. మొగనిని విడిచి పెళ్ళాలు వెళ్ళరనుట నిజమేకదా! అంటాడు పోతన. మొసలికి బలం నీళ్ళే కావడంతో ఎంత పోరాడినా మొసలికి బలం పెరుగుండే తప్పా తరగడం లేదు. అదే గజమునకు నీటిలో బలం తగ్గుముఖం పడుతుంది.

**ఊహ గలంగి జీవనపు టోలమునం బడి పోరుచున్ మహా**
**మోహలతా నిబద్ధ పదమున్ విడిపించు కొనంగలేక సం**
**దేహము బొందు దేహిక్రియ దీనదశన్ గజ ముండె భీషణ**
**గ్రాహదురంత దంత పరిఘట్టిత పాదఖురాగ్రశల్యమై .** (51)

జీవితం ప్రేమబంధాలు బతుకు అనే స్థితిలో వుండి మోహమనే లతా దారంతో ముడిపడి విడిపించ లేక తప్పుకోలేక ఏమి తోచని స్థితిని అనుభవించిన ఒక జీవిగా మహాబలవంతుడైన గజేంద్రుడు భీకర మొసలి పదునైన కోరలకు చిక్కుకొని బాధతో ఆర్తనాదాలు చేయుచున్నాడు. వేయి యేండ్లు ధైర్యంగా పోరాడిన గజరాజు చివరకు బలహీనపడి తన పరాక్రమంను తన శత్రువు పరాక్రమాలను బేరీజు వేస్తూ దానిని గెలవడం సాధ్యమవదని, ఇంకా ఈ ఆశలెందుకు

అని దు:ఖపర్యంతమవుతాడు. తన శరీర శక్తి మానసిక ఆత్మ బలానికి కారణం. శరీర శక్తి తగ్గడంతో తనకు తన ఆత్మవిశ్వాసం కోల్పోయి ఆపద వచ్చినప్పుడు ఇతరులపై ఆధారపడవలెననే ఆలోచన వస్తుంది. ఎపుడు ఎవరిని అర్థించనివాడు. ఎందరికో ఆధారభూతమైనవాడు. ఎన్నో గజాలకు అధికారి. ఎంతటి కార్యాన్నైనా చేయగల సమర్థుడు. ఇతరులపై ఎన్నడు ఆధారపడడు. ఇప్పుడు ఆపదలోనున్న నన్ను ఎవరైనా కాపాడగలరా అనే సందేహంతో వుంటాడు. ఎవరిని వేడ్కోవాలో తెలియదు. ఆ నింగినేల ఈ ప్రకృతి అంతా తనకు ఏనాడు ఎదురురాలేదు. అన్నింటిని ఎదిరించి సుఖసంతోషాలతో అద్వితీయంగా జీవించిన వాడు. అలాంటి వాడు ఎవరిని అర్థించాలి. అందరు ఆ అడవిలోని జంతువులన్నింటిని తన ఆధీనమైనవే ఇంకా నేను ఎవరిని పిలవాలి అనే ప్రశ్నతోవున్న ఆ గజేంద్రుని అయోమయ పరిస్థితిని పోతన ఈ రకంగా విశపరుస్తాడు.

**"ఏ రూపంబున దీనిగెల్తునిట మీదేవేళ జింతింతు నె**
**వ్వారిం జీరుదు నెవ్వరడ్డమిక నివ్వారి ప్రచారోత్తమున్**
**వారింపం దగువారలెవ్వ? రఖిలవ్యాపార పారాయణుల్**
**లేరే! మ్రొక్కెద దిక్కుమాలిన మొఱాలింప బ్రపుణ్యాత్మకుల్"**

ఎవరిని పిలవాలి. నన్ను రక్షించేవారు ఎవరైనా వున్నారా. నా మొర విని నా ప్రాణాలు ఎవరైనా కాపాడగలరా అని ఎవరైనా పుణ్యాత్ములు వుంటే నన్ను రక్షించండి అని ప్రాధేయపడుతాడు గజేంద్రుడు.

మేరు పర్వతశిఖరంలోని అరణ్యమందు ఎంతో గౌరవంగా బతికి అనేకమైన పదిలక్షల కోట్ల ఆడ ఏనుగులకు నాధుడై హాయిగా ఆ వనాలలో విహారం చేయకుండా దాహంతో ఈ నీటిలో దిగి ఘోర ఆపద తెచ్చుకుంటిని ఈశ్వరా! ఈ భయం నుండి ఎట్ల బయట పడుదునో కదా అని గజేంద్రుడు చింతిస్తాడు.

**ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై**
**యెవ్వని యందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం**
**బెవ్వండనాది మధ్యలయుడెవ్వడు, సర్వము దానయైనవా**
**డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్.**

ఈ పద్యంలో పోతన గజేంద్రుని ఆర్తిని చెబుతూనే రక్షకులెవరనే అలోచనను రేకెత్తించడం కనబడుతుంది. దేవునిగా భావిస్తున్న పరమేశ్వరుడే ఇక్కడ గజేంద్రున్ని రక్షించాలంటే మకరమును చంపాలి. కనక మకరమును చంపగలవాడు ఎవడని మనమున వెదకుతున్నట్లుగా అనిపించింది. ఈ మకరమును జయింపడానికి ఈ సృష్టి రహస్యాలను యెరిగి, చావుపుట్టకలేనివాడు ఎవ్వడున్నాడో, వాడు మాత్రమే ఈ మకరమును జయించగలడని నిర్ణయించు కున్నాడు. భౌతికపరమైన హేతువాదం నుండి పాఠకుని ఆలోచనను ధార్మికత వైపు లాక్కొపోయే ప్రయత్నం ఇక్కడ నుండి ప్రారంభించాడు పోతన. తన కన్నా మిన్నగా బలం గల్గినది మొసలి. మొసలిబారి నుండి నన్ను రక్షించండి అనాలి గానీ, ఈ ప్రపంచం పుట్టక లోక రహస్యాలు జెప్పి కథను పాఠకుని మనసును మార్చడానికి ప్రయత్నించాడు. ఆ గజమును కాపాడిన వాడు ఎవరైనా ఈశ్వరుడుగా భావించవచ్చు, గానీ, చావుపుట్టక లేనివాడు. ఈ జగమే ఎవరి లోపల నుండునో వాడు అనడంలో, **"వాని నాత్మభవునీశ్వరునే శరణంబు వేడెదన్"** అనడంలో ఈ జంతుపక్షు జీవరాశులు గాక మానవాళి గాక ఎక్కడో ఎవ్వరో ఈసృష్టికి అతీతంగా వున్న శక్తి ఏదో వుందనే భ్రమలోకి పోతన గజమును మొసలి ఈడ్చుకు పోయినట్లు పాఠకున్ని తీసుకెళ్తాడు. ఇక ప్రాణభయం ఎంతటివాడైనా శరణాగతున్ని చేస్తాదన్న సత్యం ఇందులో వుంది. దీనిని ఉపయోగించుకొని ఆధ్యాత్మికతను చొప్పించడం చూస్తాం. మునులు ఋషులు దేవుళ్ళు ఎవరిని కీర్తిస్తారో అటువంటి వానిని స్తుతిస్తాను. మునులు ఋషులు భగవంతున్ని చూడాలనే కోరికతో ఈ జన ప్రవంతి నుండి దూరమవుతారు, యాగాలు చేస్తారు. అందరికి మేలు కలుగాలని, మంచివాళ్ళు వ్రతాలు పూజలు చేస్తారు. వీరంతా ఎవరి పాదాలను సేవిస్తారో అటువంటి వాడు నాకు దిక్కు అయ్యే దేవుడంటాడు. అదంతా మనుసును అధ్యనసం చేయడమే యాదృచ్ఛికంగా ఏదో జరిగి తీరాలి. మరణ భయం హేతువును ఏమాత్రం దగ్గరకు రానివ్వదు.

పుట్టుక, దోషము రూపము, కర్మ రూపాలు లేనివాడు, ప్రపంచమును ఎవడు ధరిస్తాడో అంతులేని పరాక్రమం గల్గినవాడు. బ్రహ్మకన్న మిక్కిలి రూపం గలవాడు. రూపం లేనివాడికి, ఒక విచిత్రమైన చరిత్రలు గలవానికి స్వయం ప్రకాశవంతునకు పరమాత్మ పరబ్రహ్మం అయ్యేవానికి సత్త్వగుణవంతునికి ఆ నిష్కర్మతకు మెచ్చు వానికి, వందనం నొనర్తునంటాడు. ఇందులో పుట్టుక అంటేనే ఒక రూపముండడం. ప్రపంచంలో ఏ జీవి అయినా దానికి ఒకరూపం ఒక స్వభావముంటుంది. అలాంటి ఏ స్వభావం లేనివాడు గజేంద్రున్ని కాపాడగలవాడనేది పోతన. పాఠకుల ఆలోచనను ఆధ్యాత్మికం లేదా కల్పనలోని, ఒక మాయలోని లాక్కుపోయే పనిగా తోస్తుంది. పోతన గజేంద్రున్ని అత్యంత బలహీనున్ని చేసి ప్రాణము పైన అత్యంత మమకారాన్ని పెంచే విధంగా చిత్రిస్తున్నాడు. పోతే పోనీ ఈ వెధవ ప్రాణం ఇంతవరకు రాజులా జీవించాను. ఈ జన్మకు ఇది చాలు అనేది పోతన ఎక్కడ స్ఫురింపజేయలేదు. భౌతికంగా నాకన్న బలమైన వారెవ్వరనేది తన ఆలోచనకు అందకుండా చేసాడు. ఇంకా పోతన ఏమంటాడంటే దేవుడు శాంతస్వరూడయివుంటాడని, మోక్షం అనే దానికి తనే అధికారం కల్గి వున్నాడని, ఆనందానికి ప్రతీకగా స్వంత ఇతర భేదం లేనివాడని, దుష్టులకు భయంకరుడని, విశేషమైన పరిజ్ఞానం గల్గి అన్ని ఇంద్రియాల విధులను చూసేవాడుగా, అన్నింటికి ప్రభువుగా సర్వంతానే అయినంటుగా దయాగుణంలో సముద్రం వంటి వాడిలా ఇలా దుఃఖమును రూపుమాపేవాడిగా,

ఇలాంటి గుణములు గల్గినవాడికి నేను నమస్కారం చేస్తాను అంటాడు. ఏకేశ్వరోపాసనే గజేంద్రుడు కథ. (పోతన భాగవతం– సమాజ దృక్పథం, ఆచార్య రావికంటి వసునందన్, పుట 28).

దేవతా పూజా విధానమున్న వేదములకు ఒకనిధి వంటివాడు, మోక్షమార్గానికి రూపమువంటి వాడు, మంచివాడిని ఆదరించేవాడు. జ్ఞాన గుణ, సంపన్నులకు స్వంతగా జ్ఞానకాంతిని ప్రవచించే వారికి, నిర్మలమైన బుద్ధివంతులకు దీనజనోద్ధారకుడైన సర్వాంతర్యామిమైన కాంతిని ప్రకాశించేవాడు. సంసారమనే సముద్రములో మునిగినా వారిని రక్షించేవాడిని వినయంతో వేడుకుంటాను అంటాడు. ఇది అర్చనభక్తి (పురాణ వాఙ్మయ సమాలోచనం, ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య. పుట 67).

**"కలదందురు దీనుల యెడ**
**గలదందురు పరమయోగిగణముల పాలం**
**గలదందు రన్నిదిశలను,**
**గలదు కలండనెడు వాడు గలడో, లేడో"**

కుచేలుని కథలో శ్రీకృష్ణున్ని పరమాత్మునిగా, ప్రహ్లాదచరిత్రలో నరసింహున్ని ఇలా ఒక్కో సందర్భంలో ఒకరిని రక్షకునిగా చెప్పిన పోతన, ఈ పద్యం రాయడంలో ఆంతర్యం ఏమిటో అనేదే భౌతికవాదం. కోరిన కోర్కెలు దీర్చి కొంగుబంగారం జేసేది దేవతలని, వారిని రోజు లేదా వారంలో లేదా పండగల్లో వారిని పూజిస్తే మంచి జరుగుతుందనే మానసిక ప్రవర్తనతో ఈ ప్రపంచంలో అనేక దేవుళ్ళను సృష్టించారు. అందులో హిందూ మతంలో వచ్చిన శ్రీమద్భాగవతములో శ్రీకృష్ణుడు ద్వాపరయుగానికి చెందిన యాదవరాజుగా లేదా వసుదేవుని కొడుకు క్షత్రియుడుగా ఉన్న శ్రీకృష్ణుడే భగవంతుడిగా ఖ్యాతి గడించాడు. నాటి ఆ భారతంలో క్రియాశీలక పాత్రగా కనబడే శ్రీకృష్ణున్ని దేవుడిగా చెప్పడానికి పోతన లేదా సంస్కృత భాగవతమైనా ఈ ప్రయత్నమే ఇందులో ప్రధానంగా కనబడుతుంది. అయితే కనబడని దేవుని కంటే ఆపదలో వున్నవాడికి ఎవరు సహాయం అందజేస్తారో ఆ రూపాన్ని దేవతావతారంగా భావించడం చూస్తాం. ఇది నిత్యజీవితంలో ఆశించవచ్చు. కాని ప్రహ్లాదచరిత్రలో ప్రహ్లాదున్ని కాపాడడం హర్షించదగినదే. ఇలాంటివి నిత్య జీవితంలో ఆశించలేం. అందుకే అలాంటి ఆలోచనలు కల్గిన వారిని సమాధానపరిచే ప్రయత్నం చేసాడు పోతన.

**"లా వొక్కింతయులేదు ధైర్యము విలోలం బయ్యె బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె; దనువున్ డస్సెన్; శ్రమం బయ్యెడిన్**
**నీవే తప్ప నితఃపరం బెఱుంగ మన్నింపం దగున్ దీనునిన్**
**రావే యీశ్వర! కావవే వరద! సంరక్షింపు భద్రాత్మకా!" (74)**

అతి బలవంతుడు బలహీనపడి శక్తి సన్నగిల్లి అల్లాడిపోతుంటే తన ప్రాణాన్ని కాపాడే వాడు త్వరగా రావాలని తనకు ప్రాణ రక్షణ కల్పించాలనే తపనతో బాధపడే సందర్భం. నేను "నీవే ఇతఃపరంబు ఎరుగ" అని అనడంలో ప్రాణం కన్నా ఏది మిన్న కాదు సర్వం నీవే అని తెలుసుకుంటా! అంటే అంతకు పూర్వం అంతా దేవుడే అని అనని వారిని మీకు ఇలాంటి స్థితిలో ఈ యీశ్వరుడే రక్షిస్తాడని, జీవులన్నీ బలమున్నదని లేదా అధికారమున్నదని విర్రవీగ కూడదని హెచ్చరికలా ఆ పద్యముంది.

పరమేశ్వరుడు మునులచేత, పండితుల చేత పొగడ్తలు పొందినవాడు. కనక శత్రువులను కూడా ప్రేమించేవాడు. కనుక నన్ను కాపాడగలడని గజేంద్రుడు నమ్మకంతో ప్రార్థిస్తుంటాడు. ఇక్కడ గజేంద్రుడు దేవునికి శత్రువే. అంటే బగవంతున్ని నమ్మనివాడు గనుక, అంటే ఆస్తికులనే గాక శత్రువులైన నాస్తికులను కూడా రక్షణనిచ్చే భగవంతుడు. ఆపదలో వున్న వారిని ఆదుకొనేవాడివి రక్షకుడివి. ఇది నాస్తికులను ఆకర్షించే ఒక మార్గం. ఇలా గజేంద్రుడు ఆకాశం వైపు చెవులు అప్పగించి చూస్తూంటాడు.

**"అలవైకుంఠపురంబులో నగరిలో నా మూల సౌధంబు దా**
**పల మందార వనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో**
**త్పల పర్యంక రమావినోది యగు నాపన్న ప్రసన్నుండు వి**
**హ్వలనాగేంద్రము పాహి పాహి యన గుయ్యాలించి సంరంభియై"**
**(79)**

వైకుంఠపురంలో ఓమూలనున్న అంతఃపుర సౌధములో అమృత సరస్సుకు దగ్గరగా చంద్రకాంత శిలల అరుగుపై పూల పరుపుమీద లక్ష్మీదేవితో వినోదంగా వున్నాడు లక్ష్మీపతి. ఆ సమయంలో అతనికి కాపాడు, కాపాడుమని ప్రాణభయంతో వణుకుతూ మొరబెట్టు కుంటున్న గజరాజు బాధ వినబడి కాపాడాలని వెళ్లాడు విష్ణువు. తనకు చెప్పకుండా భయపడుతూ వెనక వెంబడిస్తూ వస్తున్న లక్ష్మీదేవి మేఘాలలో మెరుపులా ప్రయాణిస్తూ, చెవికమ్మలు, కొప్పుముడి మొలనూలు జారినా సరిచేసుకోకుండానే, జారిన కొంగు సరిచేసు కొనడానికి సమయం లేక ఆవిధంగానే పరుగున వస్తుంటుంది లక్ష్మీదేవి. ఆమె ముఖం చంద్రకాంతులవలె తళతళ మెరుస్తుందని లక్ష్మీదేవిని వర్ణించాడు పోతన.

**"అడిగెద నని కడు వడి జను**
**నడిగిన దను మగుడ నుడుగడని నడయుడుగున్**
**వెడవెడ చిడిముడి తడబడ**
**నడుగిడు నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్ (87)**

ఎందుకు వెళ్ళుతున్నాడో అడగడానికి విష్ణువును సమీపిస్తూ, అడగలేక వెనుకకు అడుగులేస్తూ తడబడుతూ వెంబడిస్తుంది. దానవుల జయించేవాడు, కరుణా సాగరుడు మునుల మనస్సునందు వసించువాడు. భక్తులకు భక్తి మహత్తును జూపువాడు. లక్ష్మీదేవిచే పూజంపబడినవాడు, స్వయం ప్రకాశించేవాడు. శ్రీమహావిష్ణువు ఆకాశమార్గాన వస్తుంటే దేవతలందరూ విష్ణువు చూస్తూ ఆనందభరిత మయ్యారని చెపుతాడు పోతన. ఇక్కడ ఒక నిర్దిష్టమైన రూపంలోనే

విష్ణు లక్ష్మీదేవి వున్నారు. దేవతలందరు అందరు చూస్తున్నారు. వారికి నిర్దిష్టమైన రూపాలున్నాయి. వీరెవరు రూపంలేని వారు కారు. మహా మంత్రి నడిస్తే వెనుక కార్లు వచ్చినట్లు ఇక్కడ కూడా వాహనాలు వెనుక వస్తాయి. **"జీవుడు స్వయంగా శక్తి కలవాడయినప్పటికీ అహంకారం వల్ల దానికి తలవంచడం వల్ల అశక్తుడవుతాడు. ఈ కథలో జీవుని అశక్తతను పోతన అతి సహజంగా వర్ణించాడు."** (గజేంద్రమోక్షంలో పోతన ప్రతిపాదించిన విశిష్టాద్వైతం, డా.అద్దంకి శ్రీనివాస్, వాఙ్మయి. పుట 108) ఇన్ని చెప్పి పోతన మళ్లీ స్వభావోక్తి లోకి వచ్చాడు.

**ముగింపు**

ఓ పరీక్షిత్తు రాజా! మొసలి దేవముని పెట్టిన శాపంతో మొసలి రూపం విడిచిపెట్టి నిర్మలమైన శరీరంతో 'హూహూ' అనే గంధర్వుడుగా మారినాడు. ఆ గంధర్వుడు అమిత ఆనందంతో దేవుళ్ళ గంధర్వలోకం చేరుతాడు. ఇక్కడ చదివిన పాఠకునికి అందరికి అర్థమవుతుంది. ఏమిటంటే మోక్షం అనే మాటకు మన పండితులు చెప్పేది మరణం తర్వాత స్వర్గంలాంటిదని, నిజానికి మొసలి గజము చెంతకు వెళ్ళలేదు. గజమే మొసలి వుండే కొలనుకు వెళ్ళింది. మొసలి చెరలో బందీ అయింది. హరి మకరాన్ని చేరి విడిపించి దానిని బతికించవచ్చు అనే ఆలోచనను పోతన భాగవతం గానీ సంస్కృత భాగవతంగానీ గ్రహించే 'హూహూ' అనే గంధర్వున్ని సృష్టించి వుంటాడు. ఏది చేయడానికైతే ఒక జీవుడు సరిపడడో అది జరిగినపుడు అది అద్భుతమవుతుంది. ఆ అద్భుతాలు జరగడం ఈ జగత్తులో అనేకం. అందులో కొన్నింటిని స్వీకరించి అవి అసాధ్యమైన పనులు జరిగినాయని చెప్పుకుంటారు. అలాంటివే ఈ కథలు. హరి ఒక మానవ ప్రవృత్తిని కల్గివున్నట్లు ఇందులో మనకు కొన్ని సందర్భాలు అర్థమవుతాయి. కొన్ని అసాధ్యమైన పనులు యాదృచ్ఛికంగా జరిగిన వాటికి దేవుడు అనే మానసిక స్వభావం గల్గిన సమాజం మనది. ఏ దేవుడు కాపాడినాడో చచ్చిపోయేవాణ్ణి బతికినానని, ఇలా ప్రతి జీవికి తన అనుభవంలో ఎక్కడో ఓ చోట ఇలాంటి సన్నివేశాలు తోడవుతాయి. అలాంటి కథగా గజేంద్రమోక్షాన్ని చూడవచ్చు. ఆపదను, ప్రాణ భయం నుండి రక్షించినవాడు హరి. కనుక గజేంద్రుని కాపాడినాడు అంటాం. కానీ గజేంద్రునికి మోక్షం దొరికింది అని ఎవరూ అనరు. పోయే ప్రాణం దక్కిన గజేంద్రున్ని పోతన మాత్రం మోక్షమనే దీనికి పేరుపెట్టాడు. అంటే ప్రాణరక్షణే మోక్షమని పోతన చెప్పినట్లే కదా. సంస్కృత భాగవతమైనా అంతే ప్రాణం కన్న మిన్న ఏదిగా నిలవదు. బతికుండడమే మోక్షం అని పోతన అభిప్రాయమయివుండవచ్చు.

సంస్కృత భాగవతం కాలమెట్లున్నను పోతన కాలంలో మాత్రం ఈ కథకు అమితాదరణ లభించి ఉంటుంది. ఆ కాలంలో మైలారులను అర్పించేవారు. పద్మనాయకులు అనేక భైరవ ప్రతిష్టలు చేసినారు. (ఆంధ్రుల చరిత్ర –డా. బి. యస్. యల్. హనుమంతరావు, పుట 316). అనవేమారెడ్డి శ్రీశైలంలో వీర శిరోమండపం నిర్మించాడు. దైవం పేర ఆత్మార్పణ చేసిన వారి గౌరవార్థం వారి ప్రతిష్టలున్న శిలలు (వీరకల్) నిల్పేవారు. భృగుపాతం అంటే కొండశిఖరం నుండి దూకి మరణించడం ద్వారా మోక్షసిద్ధి అభిస్తుందని కొందరి విశ్వాసం" (ఆంధ్రుల చరిత్ర –డా. బి. యస్. యల్. హనుమంతరావు, పుట 317), భైరవ ఆరాధన ఫలితంగా రణము కూడు అనే ఆచారం వచ్చింది. వామాచార సంబంధమైన తాంత్రిక పూజావిధానం బలంగా వచ్చింది. సిద్ధులు సాధించిన 'మత్స్యేంద్రనాధాది నవ నాథుల చరిత్ర ప్రజలు పురాణాలుగా చెప్పుకునేవారు. కాళ్లు, చేతులు తలలు నరుక్కొనేవారు. నాలుకలు కత్తిరించుకునేవారు. కండలుకోసి అర్పించడం వంటి క్రూరకృత్యాలు ఎక్కువగా సాగాయి. ముస్లింలు కూల్చిన వైష్ణవ ఆలయాలు మళ్ళీ నిర్మించుకున్నారు. సర్వజ్ఞ సింగన ఆస్థానంలో వైనాచార్యుడు గురువైనాడు. వెలమ రాజ్యంలో వైష్ణవ మతాన్ని వైనాచార్యులు వ్యాప్తి చేసారు. ఈ పరిస్థితిలో అలాంటి క్రూరకృత్యాలు చూసిన పోతన ఆత్మాహుతి వల్లనో లేదా మరణం వల్లనో మోక్షం సిద్ధిస్తుందంటే. ప్రజలు మూఢభక్తితో ప్రాణాలు కోల్పోయే ప్రమాదమున్నందునా భక్తి సరే గాని, మూఢ భక్తి ప్రాణాలకే ముప్పు తెస్తుందని భావించి ఉంటాడు. అందుకే ఆపదలో నున్న గజము ఆపద నుండి బయట పడడాన్నే మోక్షంగా చెప్పుకొచ్చాడు. ఆ మోక్షానికి కారకుడు దేవుడు అని తెలిపాడు. అందుచేత గజేంద్ర మోక్షమను మాట సంస్కృత భాగవతలోనిదైనా పోతన సమ్మతమే. కనుక జీవితాన్ని ఆషామాషీగా తీసుకోకుండా జీవితాన్ని మూర్ఖంగా ఎలా చేసినా నడుస్తుందనే భావన నుండి ప్రతి వారిని గౌరవించే దిశగా మంచిమార్గం వైపు మలచుకోవాలని, జీవితం ఎన్నో ఒడుదొడుకు లంటాయి. వాటి నుండి బయటపడడమే, ఆనందదాయకమైన జీవితాన్ని అనుభవిండచమే మోక్షం పోతన అభిప్రాయపడి ఉండవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. పురాణ వాఙ్మయ సమాలోచనం, యు.జి.సి. జాతీయ సదస్సు. సంచాలకులు, ప్రొఫెసర్ అనుమాండ్ల భూమయ్య.
2. పోతన భాగవతం-సమాజ దృక్పథం, ఆచార్య రావికంటి వసునందన్.
3. అప్పటి భాగవతంలో ఇప్పటి భారతీయ శిక్షాస్మృతి, బి.హనుమారెడ్డి, వాఙ్మయి, డిసెంబర్, 2008.
4. గజేంద్ర మోక్షంలో పోతన ప్రతిపాదించిన విశిష్టాద్వైతం, డా.అద్దంకి శ్రీనివాస్, వాఙ్మయి, సెప్టెంబర్, 2008.
5. ఆంధ్రుల చరిత్ర – డా. బి. యస్. యల్. హనుమంతరావు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక  సంపుటి -28 : సంచిక - 5  45  హైదరాబాద్  మే : 2025

# మారిషస్ దేశంలో తెలుగు : నాటి స్థితి – నేటి గతి

**డా. ప్రవాసీ చిన్నయ్య** మహాత్మాగాంధీ సంస్థ, మారిషస్. ఫోన్ : 2305 770 5173

సుమారు రెండువందల సంవత్సరాలక్రితం తెలుగువాళ్లు మారిషస్ భూమిమీద కాళ్లు మోపినప్పటినించి, తెలుగుభాష, తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, పండుగలు, పబ్బాలు, నోములు, వ్రతాలు, ఆహారపుటలవాట్లు, కట్టుబొట్టు మొదలైనవి స్థిరపడ్డాయి. వీటన్నిటిని మరచిపోకుండా తెలుగువాళ్లు తమ వ్యక్తిత్వాన్ని, తెలుగుతనాన్ని పెంపొందించుకొంటూ, నిలబెట్టుకొంటూ తమ జీవితాలను గడిపారు. సాంఘికీకరణ చెందటానికి, సమాజంలో తమ పాత్రను గుర్తించటానికి, ఉత్తమపౌరుడిగా రూపొందించటానికి, ముందుకు సాగటానికి తగిన విలువలను మాతృభాషద్వారా తమ పిల్లలను చక్కగా పోషించారు. తల్లిదండ్రులపై ఆదరాభిమానాలు కలిగి ఉండటం, పెద్దలను గౌరవించటం, తోటివాళ్లతో మర్యాదగా నడుచుకోవటం, సభామర్యాదలు తెలిసి ఉండటం మొదలైన మంచిగుణాలు అలవరచుకొంటూ జీవితాన్ని కొనసాగించారు. వాళ్లు ఇక్కడి మాండలికం అయిన క్రీయోల్, భోజ్పురీ భాషలు నేర్చుకొన్నప్పటికీ వాళ్ల జీవితంలో మాతృభాషకు ప్రత్యేకస్థానం ఉంది. మాతృభాషపై గౌరవం, మమకారంఉంది. మాతృభాష వల్లనే మారిషస్ లో నివసించే తెలుగువాళ్లు తరతరాల వారసత్వ సంపదను కాపాడకుంటూ వస్తున్నారు. తెలుగు వారి మాతృభాష తెలుగు సమాజానికి, సాంస్కృతిక, ధార్మిక వ్యవస్థలను నిలబెట్టడానికి అంతే కాకుండా జాతీయజీవన విధానానికి ఎంతో తోడ్పడిందని చెప్పవచ్చు.

మారిషస్ దేశంలో మొదట్లో పాఠశాలల్లో విద్యాబోధన అంతా ఫ్రెంచ్, ఆంగ్లభాషల చుట్టూ కేంద్రీకరింపబడింది. పాఠశాలల్లో భారతీయ భాషల బోధన లేనేలేదు. తెలుగుభాష తెలుసున్నవాళ్లే ఇతరులకు తెలుగుభాష బోధించటం ప్రారంభించారు. ప్రారంభదశలో వాళ్లదగ్గర పాఠ్యపుస్తకాలుగానీ, రాతపుస్తకాలుగానీ ఏమీలేవు. ఒక ప్రత్యేకమైన విద్యా ప్రణాళికగానీ, విషయ ప్రణాళికగానీ, అధ్యాపకుల బోధనా, శిక్షణ లేకుండా, తగిన సౌకర్యాలులేకుండా, భాషాబోధన అభ్యసన ప్రక్రియలు మౌఖికంగా ఒక తరంనించి ఇంకొక తరానికి అందించబడ్డాయి. ఈ విధంగా మారిషస్ దేశంలో అశాస్త్రీయమైన విధానంద్వారా తెలుగు భాషాజ్ఞానం అందించటం జరిగింది. కాలక్రమంలో కాలంతోపాటు తెలుగుభాషాబోధన పరిస్థితి మెరుగుపడటం ప్రారంభమైంది. తెలుగు భాషా సంస్కృతుల వికాసంకోసం పాటుపడిన వాళ్లలో పండితులైన శ్రీ గునయ్య ఒత్తుగారు, శ్రీ రామమూర్తి అప్పన్నగారు అగ్రగణ్యులు. మారిషస్ ఆంధ్రమహాసభ స్థాపనతో దేశమంతటా సాయంత్రపు బళ్లు స్థాపింపబడి, భాషాబోధన ప్రారంభించటం జరిగింది. తెలుగుభాషను




మెరుగుపరచాలనే ఉద్దేశంతో, మారిషస్ ఆంధ్రమహాసభ వాళ్లు ఆంధ్రదేశంనించి ఎన్నెన్నో పుస్తకాలను తెప్పించి, ఉపాధ్యాయులకూ విద్యార్థులకూ ఉచితంగా పంచిపెట్టారు. ఎన్ని కష్టాలు, సమస్యలు, విఘ్నాలు వచ్చినా తెలుగువాళ్లు వెనుకంజ వేయలేదు. గట్టి నమ్మకంతో ముందుకు వెళ్లటానికి సంకల్పించారు.

కాలంతోపాటు ప్రభుత్వం ఆదరణతో భాషావికాసానికీ అభివృద్ధికీ ఎన్నెన్నో అవకాశాలు కలిగాయి. భారతదేశ ప్రభుత్వ పక్షాన ఆచార్య వేటూరి ఆనందమూర్తిగారు, ఆచార్య శివరామమూర్తిగారు, ఆచార్య బ్రహ్మానందంగారు మారిషస్ దేశానికి వచ్చి ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో పనిచేస్తూ ఎక్కువమంది ఉపాధ్యాయులకు తెలుగు భాషాజ్ఞానం అందించారు. మారిషస్ దేశంలో పిల్లలకు ప్రచురించే పుస్తకాలు గ్రాంథికభాషలో కాక వ్యావహారిక భాషలోనే వాళ్లు రాసిపెట్టారు. వాళ్ల ప్రోత్సాహంతోనే ఎక్కువమంది తెలుగుభాషను నేర్చుకుని ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించారు. తమ అభిప్రాయాలనూ, ఆలోచనలనూ, తెలుగులో ధారాళంగా వ్యక్తం చేయగలిగారు. తరగతిగదిలోనే కాక ఇతర సందర్భాలలోకూడా తెలుగుభాషను తగిన విధంగా ఉపయోగించగలిగారు.

అలా 1970వ సంవత్సరంలో భారతీయ భాషలనూ లలిత కళలనూ అభివృద్ధి పరచటానికీ, భారతీయసంస్కృతీ సంప్రదాయాలను వృద్ధిపరచటానికీ, మారిషస్ భారతదేశాల సంయుక్త కార్యాచరణ ప్రయత్నాలవల్ల మహాత్మాగాంధీ సంస్థ నెలకొల్పబడింది. ఈ సంస్థ ప్రత్యేకంగా భారతీయభాషల బోధన విధానాన్ని గురించి కృషిచేస్తూ వచ్చింది. తర్వాతి కాలంలో Mauritius Institute of Education సహకారంతో భారతీయభాషలు బోధిస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణను అందించే బాధ్యత మహాత్మాగాంధీ సంస్థ వహించింది. భారతీయభాషల్లో డిప్లొమా, డిగ్రీలు బోధించే బాధ్యతకూడా ఈ సంస్థ చేపట్టి నేటివరకు కొనసాగిస్తుంది. తెలుగుభాషను, ఉపాధ్యాయ

విద్యను మెరుగుపరచటానికి, బోధనలో నాణ్యతను పెంచటానికి ప్రభుత్వం అనేకచర్యలు చేపడుతూ ఉన్నది. వాటికోసం వివిధ రకాలైన విధానాలను, ఆచరణలను ప్రవేశపెట్టి అమలు చేస్తూ ఉన్నది. రోజురోజుకు మార్పు చెందుతున్న సాంకేతిక వైజ్ఞానిక అవసరాలను బట్టి అమలులోకి వస్తున్న నూతన బోధనా ధోరణులను ఉపాధ్యాయులందరికీ అందుబాటులోకి తేవాలనే ప్రయత్నం ప్రభుత్వం ఈ రెండు సంస్థలద్వారా చేస్తున్నది. ఈ ప్రక్రియలవల్ల ఉపాధ్యాయ విద్యలోగానీ, తెలుగు భాషాబోధన అభ్యసనల్లోగానీ గణనీయమైన మార్పులు రావటం మొదలైంది. నేడు మారిషస్ ప్రభుత్వం ప్రభావశీలం అయిన బోధనాభ్యసన ప్రక్రియకు, సమర్థులైన ఉపాధ్యాయుల శిక్షణకు అధిక ప్రాధాన్యాన్ని ఇస్తూంది. అంతేకాక మహాత్మా గాంధీ సంస్థ, తెలుగు భాషాసంఘం, మారిషస్ తెలుగు మహాసభ, మారిషస్ తెలుగు సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో తెలుగు భాషాసంస్కృతుల ప్రచారానికి ఎన్నెన్నో సదస్సులు ఏర్పాట్లు చేస్తున్నారు. భాషాసంస్కృతుల సేవ చేస్తున్న ఈ సంస్థల కార్యకలాపాల కోసం మారిషస్ దేశ ప్రభుత్వం ప్రతి ఏటా గ్రాంటు రూపంలో ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది.

నిజం చెప్పాలంటే స్వాతంత్ర్యానికి పూర్వం మారిషస్ దేశంలో భాషావికాసానికి తగిన వాతావరణం లేకపోయినా, భాషాబోధనకు కావలసిన సామాగ్రులు లేకపోయినా, ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ తెలుగువాళ్లు భాషను తరంనుండి తరంకు నేర్చుకోగలిగారు. కానీ నేటికాలంలో భాషాబోధన అభ్యసనలకు ఎన్నెన్నో అవకాశాలు ఉన్నా కూడా యువకులు తెలుగు భాషాభ్యసన పట్ల ఆసక్తి చూపించటం లేదు. తెలుగువిద్యార్థులు ఇంగ్లీషు, ఫ్రెంచిభాషలకు, భాషేతర విషయాలైన గణితశాస్త్రం, పరిసరాల విజ్ఞానం మొదలైన విషయాలకు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తున్నారు. ప్రస్తుతం తెలుగు బోధనకు మారిషస్ దేశంలో తొంభైమంది ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయులు, నలభైమంది ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయ స్థాయిలో నలుగురు ఉపన్యాసకులు ఉన్నారు. తొలి తరగతినించి తొమ్మిదో తరగతివరకు ప్రభుత్వం పిల్లలకు పాఠ్యపుస్తకాలను ఉచితంగా సరఫరా చేస్తుంది. సాయంత్రపు బడులలోకూడా తెలుగు భాషాబోధన జరుగుతూ ఉన్నది. అయినా విద్యార్థులు తెలుగు భాష నేర్చుకోటానికి తగినంత సుముఖత చూపించటంలేదు. మారిషస్ దేశంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులుగా, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులుగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాకూడా తక్కువమంది తెలుగుభాష నేర్చుకొంటున్నారని చెప్పవచ్చు. ప్రస్తుతం మారిషస్ దేశంలో విద్యారంగంలో భారతీయ భాషలను బోధించటంలోను గణకయంత్రాన్ని బాగా ఉపయోగిస్తున్నారని గుర్తించాలి. ఈ మధ్యనే గణకయంత్రం ద్వారా భాషలు నేర్పించే విధానం స్థిరపడి Auto- Instructional materials మాదిరి ఉపాధ్యాయుడి అవసరం లేకుండానే భారతీయ భాషలు నేర్చుకోవటం వీలుపడుతున్నది. మహాత్మా గాంధి సంస్థలో ద్వితీయ భాషా బోధన సామగ్రి మొత్తం పాఠ్యగ్రంథాలపై ఆధారపడి ఉండదని చెప్పటం మా అదృష్టం. ఈ సంస్థ తాము బోధించే అనేక భారతీయ భాషల, మాందారీన్ భాష విషయంలో భాషా ప్రయోగశాల వాడుతున్నది. ఇన్ని సౌకర్యాలు ఉన్నా కూడా తెలుగువాళ్లు తెలుగుభాషను నేర్చుకోవటంలో ఆసక్తి చూపించటం లేదని విచారించవలసిన విషయం.

మారిషస్ దేశంలో ఐదు – ఆరు సంవత్సరాల వయసుగల విద్యార్థులు తొలితరగతిలో చేరినప్పుడు వాళ్లకు "నమస్కారం" తప్ప **"తాత, బాబమ్మ, అమ్మమ్మ, అన్న, అక్క మొదలైన కుటుంబ సంబంధ బోధక పదాలు తప్ప"** వాళ్లకు తెలుగు భాష గురించి ఏమీ తెలియదు. మారిషస్ దేశంలో తెలుగుభాష ద్వితీయ/ పర భాషాబోధనగా జరగటంవల్ల పిల్లలకు లక్ష్యభాషకు చెందిన నైపుణ్యాలతో పరిచయం ఉండదు. ఇంగ్లీషు, ఫ్రెంచి మొదలైన విషయాలతోపాటు తెలుగు భాషను ఆరో తరగతి వరకు ద్వితీయభాషగా నేర్చుకొనే అవకాశా లుంటాయి. ఆరు సంవత్సరాలు ప్రాథమిక పాఠశాలలో నేర్చుకున్న తర్వాత, మారిషస్ ఎగ్జామినేషన్ సిండికేట్ నిర్వహించే జాతీయ పరీక్షలు రాసి ఉన్నత పాఠశాలలో ఏడో తరగతిలోకి ప్రవేశిస్తారు. మాధ్యమిక స్థాయిలో ఐదు సంవత్సరాల విద్యాభ్యాసం తర్వాత కేంబ్రిజ్ విశ్వవిద్యాలయం నిర్వహించే School Certificate అయితే పరీక్షలు రాస్తారు. తెలుగు భాషా పట్ల ఆసక్తి చూపించినవారే School Certificate వరకు తెలుగు భాష నేర్చుకొంటారని గుర్తించవలసిన విషయం. ఎందుకంటే మాధ్యమిక స్థాయిలో పూర్వీకుల భాషలను నేర్చుకోవటం అనివార్యం కాదు. S.C పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు మరొక రెండు సంవత్సరాలు చదివి Higher School Certificate- H.S.C పరీక్షలు రాస్తారు. ఈ పరీక్షలు కూడా Cambridge విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జరుగుతాయి. ఉపాధ్యాయ శిక్షణ పొందాలనుకునే అభ్యర్థులు, డిప్లొమా/డిగ్రీ చదువుకోవాలనుకునే విద్యార్థులు H.S.C పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి. శిక్షణోపాధ్యాయులు శిక్షణ పాఠశాలకు, విద్యార్థులు డిప్లొమ/డిగ్రీ క్లాసుల్లోకి చేరినప్పుడు ప్రాథమిక పాఠశాలలో ఆరు సంవత్సరాలు మాధ్యమిక పాఠశాలలో ఏడు సంవత్సరాలు అయితే మొత్తం మీద 13 సంవత్సరాల్లో 1800 గంటలు తెలుగు

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 47 హైదరాబాద్ మే : 2025

భాష నేర్చుకుని ఉంటారు. కానీ వాళ్ల సంభాషణ ద్వారా, రాత పని ద్వారా, పఠనం ద్వారా, వాళ్లు ఇన్ని గంటలు తెలుగు భాషను నేర్చుకున్నా భాషపై అధికారం సంపాదించలేక పోయారని గమనించబడుతుంది. ముందటి సంవత్సరం కంటే మరు సంవత్సరం భాషా స్థాయి తగ్గుతున్నదే కాని పెరగటంలేదని చింతించవలసి ఉంది. విద్యార్థుల తెలుగు భాషా ప్రమాణాల స్థాయి ఆ స్థాయికి తగినట్లు లేకపోవటానికి ప్రథమంగా విద్యార్థుల, విద్యార్థుల తల్లిదండ్రుల నిర్లక్ష్య భావమే కారణం అని ప్రచారంలో ఉంది. మరొక కారణం ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయుల అలసత్వమేననే అభిప్రాయాలు ప్రచారంలో ఉంది. పై తరగతిలో విషయ ప్రణాళిక కాఠిన్యతకూడా కారణంగా భావించబడింది. వీటి సత్యాసత్యా లేమిటి? అనే విషాయాలు పరిశీలనార్హంగా ఉన్నాయి.

ఈ ఆధునిక కాలంలో మారిషస్ దేశంలో తెలుగుభాషను వినే అవకాశాలు చాలా అరుదు అని చెప్పవచ్చు. అసలెవరూ ఇంట్లో తెలుగుభాష మాట్లాడరు. తల్లిదండ్రులకు తెలుగుభాష రాదు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలకు తెలుగు భాషాజ్ఞానాన్ని అందించా లనుకోవటం లేదు. విద్యార్థులు కేవలం తరగతి గదిలో మన తెలుగుభాష వింటారు, కొద్దిగా మాట్లాడతారు. అందరూ మాతృభాష అయిన క్రియోల్ లేదా ఫ్రెంచ్ మాట్లాడుతారు. కేవలం పూజల్లో, మందిరాల్లో పురోహితుల ప్రసంగాల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో, రేడియో కార్యక్రమాల్లో, టీ.వీ. లలో ప్రసారమయ్యే సినిమాల్లో, తెలుగు తరగతిలో మాత్రమే తెలుగు భాషను కొంత వరకు వినే అవకాశం ఉంటుంది. మారిషస్ దేశంలో ద్వితీయభాషగా నేర్చుకొంటున్న విద్యార్థులకు తెలుగులో తమ అభిప్రాయాలను వ్యక్తం చేయవలసిన అగత్యం ఎక్కువగా లేదు. దీనికి కారణం ఈ విద్యార్థుల పరిసరాలలోని ప్రజలు అవసరమైనప్పుడు క్రియోల్ లేదా ఫ్రెంచి భాషలలో వ్యవహరించగలగడం. విద్యార్థులకు తెలుగుభాషా వ్యవహర్తలతో సంభాషించవలసిన సందర్భాలు చాలా తక్కువగా ఏర్పడుతుంటాయి. వినే అవకాశం లేనందువల్ల భాషణంలో విద్యార్థులు కష్టపడుతున్నారని చెప్పవచ్చు. అటూ హిందీ భాషీయులకు విడుదలయ్యే ప్రతి హిందీ సినిమా, టీ.వీ.లో దినమంతా వచ్చే హిందీ కార్యక్రమాలు చూసే అవకాశాలు ఉంటాయి. కాని మాకు అలాంటి అవకాశాలు లేవు. మేం తెలుగు కంటే హిందీ సినిమాలే ఎక్కువ చూస్తాం. తెలుగు సినిమాలు సినిమా హాలుల్లోకి రావు. అందువల్ల క్రియోల్ / ఫ్రెంచ్ మాతృ భాషగాగల విద్యార్థులకు తెలుగుభాష అర్థం చేసుకోవటం, మాట్లాడటం కొంత ఇబ్బందిని కలిగిస్తున్నదని చెప్పవచ్చు. కనుక ఈ విద్యార్థులకు శ్రవణ భాషణ నైపుణ్యాల అభివృద్ధికి ఎక్కువ ప్రాధాన్యం కల్పించవలసి ఉంటుంది. టీ.వీలో వచ్చే తెలుగు ఆటపాటల, సీరియల్స్, సినిమాల, కార్యక్రమాలద్వారా, సినిమా హాలులో విడుదలయ్యే తెలుగు చలన చిత్రాల వల్ల ఇది ఎంతగా సాధ్యమవుతుంది. కాని ఇక్కడి తెలుగు వారి దౌర్భాగ్యం సినిమా హాలులో తెలుగు సినిమాలు చూడటం అంటే మారిషస్ తెలుగు ప్రజలకు ఒక కలలా ఉండిపోయింది.

అంతేకాక ప్రధాన వాచకాలు తప్ప ఉపవాచకాల్ని లేదా అనుబంధ వాచకాల్ని, కథల పుస్తకాలు, విద్యార్థులూ ఉపాధ్యాయులూ చదువుకోవటానికి వీలైనన్ని తెలుగు పుస్తకాలు గ్రంథాలయంలో లేవు. ప్రాథమిక పాఠశాలలో సామాన్యంగా గ్రంథాలయాలు ఉండవు. కొన్ని పాఠశాలల్లో మాత్రమే ఉన్నాయి. కాని ఈ దశలో గ్రంథాలయాల అవసరం ఎంతైనా ఉంది. చిన్న వయస్సులో పిల్లలకు సరియైన పుస్తకాలు చదివించి వారి మానసిక నైతిక ప్రవర్తనలను చక్కగా తీర్చిదిద్దటానికి మాతృభాషలో పుస్తకాలు ఎంతైనా ఉపకరిస్తాయి. కానీ తెలుగు పుస్తకాల కొరతవల్ల చాలా మంది విద్యార్థులు ఆంగ్ల, ఫ్రెంచ్ పుస్తకాలను చదువుతారు. ఒక వేళ తెలుగుభాషలో ఇలాంటి పుస్తకాలు ఉంటే తెలుగు భాష నేర్చుకున్న




విద్యార్థులకు ఆ పుస్తకాలను చదివే అవకాశాలు ఏర్పడేవి. వాళ్లు ఇట్లా విస్తృత పఠనాభ్యాసం ఎక్కువ చేసుకోవటం ద్వారా తీరిక సమయాల్లో ఉపయోగకరంగా గడిపినవారు అయ్యేవారు. మారిషస్ దేశంలో బొమ్మలతో కూడిన ఆకర్షనీయమైన తెలుగు పుస్తకాల కొరతఉంది. విద్యార్థులందరికీ చిన్న చిన్న కథల పుస్తకాలు అందజేస్తే వాళ్ల భాష మెరుగుపడుతుం దని చెప్పవచ్చు. విద్యార్థుల పదజాలాన్ని అభివృద్ధి చేయటానికి, పఠనాశక్తిని, విస్తృత పఠనాభిలాషను పెంపొందించటానికి కథల పుస్తకాల్ని, సంచికల్ని, వార్తా పత్రికల్ని ప్రవేశపెట్టటం అత్యవసరం.

పదో తరగతి తర్వాత పాఠ్యపుస్తకాలను తయారు చేయవలసిన అవసరం ఇందాకా ఏర్పడలేదు. అంతేకాక ఉపాధ్యాయుల శిక్షణ కోనం, డిప్లొమా, డిగ్రీ నేర్చుకున్న విద్యార్థులకోనం పాఠ్యపుస్తకాలను, గ్రంథాలను తయారు చేయవలసిన అవసరం ఎంతగానో ఉంది. ద్వితీయ/ పర భాషగా తెలుగు భాషా బోధనను అభ్యసనా పరిస్థితులలో నూతన శిక్షణ తరగతులకు కావలసిన పాఠ్యగ్రంథాలనూ ప్రచురించే కార్యక్రమాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉంది. ఈ గ్రంథాల నిర్మాణకోసం మారిషస్

దేశపు ప్రభుత్వం తెలంగాణా లేదా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం శిక్షణ కేంద్రాలలోని ఉపన్యాసకులతో మరి అనుభవజ్ఞులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తే చాలావరకు లాభదాయకంగా ఉంటుందని భావిస్తున్నాను. ఆ కమిటీ విద్యారంగం లోని ప్రముఖ రచయితల సహకారాన్ని స్వీకరించి అనుభవజ్ఞులను సంప్రదించి గ్రంథాలను తయారు చేస్తే ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది. తెలుగు భాషాబోధన లక్ష్యాలను సమర్థవంతంగా సాధించటానికి ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు, తెలుగుభాష నేర్చుకొంటున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఇవి ఉపయోగపడవచ్చు. ఈ గ్రంథాలు ఇటు శిక్షణార్థులకు, భాషా నేర్చుకొంటున్న విద్యార్థులకు, అటు ఉపాధ్యాయులకు ఉపయుక్తంగా ఉంటాయని విశ్వసిస్తున్నాను.

దౌర్భాగ్యంగా మారిషస్ దేశంలో విద్యారంగానికి సముచితమైన సేవ చేయడానికి హైదరాబాదులోని తెలుగు అకాడమిలాంటి పాఠ్యపుస్తక సంస్థ అక్కడ లేకపోవడం గుర్తించవలసిన విషయం. కాలక్రమంలో మారిషస్ దేశపు ప్రభుత్వం భారత ప్రభుత్వ సహకారంతో ఇలాంటి సంస్థలతో ముందుకు వస్తుందని మనసారా కోరుకుంటాను. ఇదిగాక తెలంగాణా లేక ఆంధ్రప్రదేశ్ నించి తరచుగా భాషాశాస్త్రవేత్తలు మారిషస్ దేశానికి వచ్చి, భాషాభివృద్ధి కోసం మార్గదర్శకత్వం చేయాలనే మనసార కోరుకుంటాను.

నేటికాలంలో భారత దేశంలోని విశ్వవిద్యాలయాల్లో మాత్రమేకాక మారిషస్ దేశంలో కూడా University of Mauritius, ఓపెన్ యునివర్సిటీ of Mauritius అనే విశ్వవిద్యాలయాల్లోని తెలుగు, తెలుగుకు సంబంధించిన పరిశోధన వ్యాసాలను, రీసర్చిని నిర్వహిస్తున్నారు. మహాత్మాగాంధి సంస్థలోని తెలుగుశాఖకూడా తెలుగు పరిశోధనలకు దోహదం చేస్తున్నది. ఇదంతా చూస్తుంటే మారిషస్ దేశంలో తెలుగు భాషా సాహిత్య పరిశోధన కార్యరంగం ముందుముందు మరింత విస్తరిస్తుందన్న ఆశాభావం దృఢపడుతున్నది. ఇదొక విధంగా మా మారిషస్ తెలుగు ప్రజలకు గర్వకారణమే. భారతదేశం నించి వేలమైల దూరంలోనున్న మారిషస్ దేశంలో తెలుగు భాషపై ఇంత కృషి జరుగుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. కాని జరుగుతున్న విధానం అంత సంతృప్తి కరంగా లేదు. దీనికి ప్రధాన కారణాలు రెండు. ఒకటి మెథడాలజీ, అంటే పద్ధతి సలక్షణంగా లేకపోవటం. రెండోది మాతృభాష పట్ల దృక్పథం లేకపోవటం. ఈ రెండు లోపాలను మేం గుర్తించి, వాటిని సరిదిద్దుకోలేకపోతున్నాం. అందుకు కారణమేమిటంటే మెథడాలజీకి సంబంధించిన ఆధారగ్రంథాలు, పరిశోధనకు అవసరమైన పుస్తకాలు లేకపోవటం. మంచి రెఫరెన్సు పుస్తకాలు అందుబాటులో లేకపోవటం. మేధావుల, మార్గదర్శకుల సహకారాలు లేకపోవటం. ఇంగ్లీషు, ఫ్రెంచిలాంటి యూరోపియన్ భాషల్లో పరిశోధన విధానాలు మంచి పాఠ్య పుస్తకాల రూపంలో, వ్యాసాల రూపంలో, శైలీ గ్రంథాల రూపంలో పుష్కలంగా లభ్యమవుతుంది. అంటే ప్రధానంగా మన మారిషస్ పరిశోధనలకు ప్రేరణ ఇంగ్లీషు, ఇంగ్లీషులోని పుస్తకాలే. పరిశోధన విధానాలను తెలుగులో గ్రంథరూపంలో ఎవరైనా వెలువరిస్తే తెలుగు పరిశోధక విద్యార్థులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. పరిశోధన విధానాలనూ, సిద్ధాంత వ్యాస రచనా పద్ధతులనూ నిర్దేశించే తెలుగు గ్రంథం నేటి కాలంలో మారిషస్ దేశంలో ఎంతో అవసరం. మహాత్మా గాంధి సంస్థవారు పరిశోధన రంగంలో మంచి కార్యక్రమాలు చేపడుతున్నారు. చేపట్టాలన్న ఉత్సాహం కూడా ఉంది. కనుక తెలుగు రీసర్చి విషయమై అవలంబించిన విధానాలను, రిసర్చ్ మెథడాలజీలో పరిశోధనకు కావలసిన పద్ధతుల్నీ, విషయ సామాగ్రి సేకరించే పద్ధతుల్నీ, పరిశోధనలో పత్రికల పాత్ర, పరిశోధనలో తీసుకోవలసిన జాగ్రత్తలను సూచించటానికి ఒక పరిశోధన సమితిని లేక ఉపసంఘాన్ని నియమింపవలసినది.

మా ఉద్దేశం ఏమిటంటే మారిషస్ దేశంలో విద్యార్థులు నిత్య జీవితావసరాలకు తెలుగు భాషను చక్కగా ఉపయోగించి, ఆ భాషద్వారా తమ అభిప్రాయాల్ని ఇంకొకరికి తెలియజేయగలగాలి. అంతే కాకుండా ఇతరులు ఆ భాషలో వ్యవహరించినప్పుడు వాళ్లను స్పష్టంగా అర్థం చేసుకోగలగాలి. లక్ష్య భాషలోని పత్రికలు, సంచికలు, కథల పుస్తకాలు, నవలలు, నాటికలు మొదలైన వాటిని చదివి, అర్థం చేసుకొనే శక్తి కలగిఉండాలి. తెలుగు భాష గురించి అర్థం చేసుకోవడమే కాకుండా, తెలుగు భాషా ప్రయోగాల్ని కూడా చక్కగా తయారుచేసుకోవాలి. మరోలా చెప్పుకోవాలంటే భాషా నిర్మాణం, వ్యాకరణాలతో పాటు సమయ సందర్భాల్ని బట్టి భాషా ప్రయోగాలు చేయటం నేర్చుకోవాలి. ఈ విధంగా విద్యార్థుల్లో వ్యక్తీకరణ సామర్థ్యాన్ని పెంపొందించేలా ప్రయత్నం చేయాలి. మొత్తం మీద తరగతిగదిలో గానీ, ఇంట్లోగానీ వాతావరణం తెలుగుమయంగా ఉండాలి. ఇదే మా ముఖ్యమైన ఆశయం.

ఈనాటి జీవన విధానంలో భాషాసంస్కృతులు ఇంటిదగ్గర లభించే అవకాశం తక్కువ. వీటిని పాఠశాలద్వారానే సాధించాలి. అందుకని బోధన కార్యక్రమాన్ని నిర్వహించే గణనీయమైన పాత్ర ఉపాధ్యాయునిదే అని అనటంలో సందేహమే లేదు. ద్వితీయ భాషాబోధన అభ్యసనల్లో గుర్తించవలసిన అంశం విద్యార్థుల సాధన. ఉపాధ్యాయులు ఆదర్శప్రాయంగా ప్రవర్తిస్తేనే విద్యార్థులు తెలుగు భాషను నేర్చుకోటానికి తగినంత ఉత్సాహం చూపిస్తారు. లేకపోతే కాలంతో పాటు మారిషస్ దేశంలో "డో డో" పక్షి వలే తెలుగు భాష కూడా సమసిపోయే అవకాశం ఉంటుంది.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (49) హైదరాబాద్ మే : 2025

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

డా. గండ్ర లక్ష్మణ రావు, విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

**రిపుభిః సాయం సంధాయ నష్టస్థాన హతక్షయం**
**పంచయస్మిన్ న విద్యంతే నకుర్యాత్తేన సంగతమ్ - 95**

**పద్యానువాదం :**

తెలిసి వైరికి సాయమందించబోకు
వైరి తోగూడ నెన్నడు చేరబోకు
ఎప్పుడైనను బ్రతుకుకే ముప్పు వచ్చు
ఇవి యెరింగియు మసలుట లెల్ల మేలు

**అర్థం :** పగవారితో అనుసరించి తిరుగకూడదు. అది యెటువలె ననిన చెట్టుమీద ఎక్కి మంచి నిద్రబోయి నటువలెను. వున్న స్థలం చెడును, చచ్చును కనుక యామరక సకలజాగ్రత్తల నుండెదనిన రీతి.

**గురుశుశ్రూషయా విద్యా పుష్కలేన ధనేన వా**
**అథవా విద్యయా విద్యా చతుర్థో నో ఫలం భవేత్ - 96**

**పద్యానువాదం :**

గురుల సేవించి విద్యల నరయవచ్చు
పుష్కలమ్ముగ ధనమిచ్చి పొందవచ్చు
విద్య బదులుగా నింకొక విద్య వచ్చు
ఇవియు గాకున్న విద్యల నెరుగ లేరు

**అర్థం :** సకల విద్యలు గురుశుశ్రూష జేసి లేదు ధనము యిచ్చి భక్తిగ చదువుకునేది. విద్య యిచ్చి విద్య చదువుకునేది. యీ మూడు విధాల బలం. నాలుగవ విధం దుర్బలం, నిష్ఫలం అనిన రీతి.

**అపకారోపి నీచానాం వుపకారోపి జాయతే**
**పయః పానభుజంగానాం కేవలం విషవర్ధనం - 97**

**పద్యానువాదం :**

నిత్యమపకారమొనరించు నీచునకును
చేయు ఉపకారమంతయు చెడుగ మారు
పామునకు పాలుపోసిన భంగి యగును
విషము మాత్రమే తనలోన పెంచుచుండు

**అర్థం :** యెప్పుడు అపకారం జేసెడి నీచునకు యోగ్యులు తెలియక యంత వుపకారం చేసినా అపకారమే తోచును. అదెట్లన్నను పాములకు పాలు బోసినాకొద్ది విషమధికంబగును. అపకారికి వుపకారమె విషమనిన రీతి.

**కన్యా వరయతేరూపం మాతా విత్తం పితా**
**శృతి బాంధవాః కులమిచ్ఛంతి పక్వాన్నమితరే జనాః - 98**



**పద్యానువాదం :**

కన్య కాదగు భర్తరూపమునె గనును
తల్లి అల్లుని సంపదల్ తరచి చూచు
మంచి వంశానుగుణముల నెంచు తండ్రి
జనములెల్లరు విందుభోజనమె మెచ్చు

(12 వ ఆకు రెండవ వైపు)

**అర్థం :** వివాహమపుడు కన్య రూపం చూసి వలచును. తల్లి భాగ్యం గలవారి నిచ్చుయించును. తండ్రి విద్యగలవానికై వెదుకును. బంధువులు కులమే యిచ్ఛగింతురు, సకల జనులు పక్వాన్నములే కోరుదురనిన రీతి.

**విస్తీర్ణముదకం స్నానం విస్తీర్ణం పాత్ర భోజనం**
**స్త్రీ పుం శయన స్థానం విస్తీర్ణం గృహమంటపం - 99**

**పద్యానువాదం :**

స్నానమాడగ పుష్కల జలము వలయు
కనవెడల్పగు పాత్ర భోజనము చేయ
పడతితోగూడ నిద్రించు పడక గదియు
ఉండు యిల్లును వైశాల్య మున్న మేలు.

**అర్థం :** స్నానం చేసే వుదకమున్ను, భోజనం చేసే పాత్రమున్ను, భార్యతో పడుకునే స్థలమున్ను , సంసారం చేసే యిల్లున్ను విశాలం వుండదగుననిన రీతి.

**స్త్రీపుం ద్విగుణ మాహారం బుద్ధినాపి చతుర్గుణః**
**సాహసం షడ్గుణం చైవ కామమష్టగుణం భవతి - 100**

**పద్యానువాదం :**

స్త్రీల గుణములు పురుషుల రీతిచూడ
కుడువ రెట్టింపు, బుద్ధియు గుణములందు
నాల్గు రెట్లుగు నుండును,నాతి కామ

మందున నెనిమిది రెట్లని యందురంత

**అర్థం :** పురుషుల కన్న స్త్రీలకు ఆహారం రెండు గుణాలెక్కువ, బుద్ధి నాలుగు గుణాలెక్కువ, సాహసం ఆరు గుణాలెక్కువ, కామం ఎనిమిది గుణాలెక్కువని తెలిశేది.

**విద్యాశిల్ప మనాలిశ్యం,పాండిత్యం మిత్ర సంగ్రహే**
**ఆచార అరణియానివంచైతాన్సక్షణయో నిధి - 101**

**పద్యానువాదం :**

విద్యగలవాడు నేర్పరి వేళ దాట
పండితుండును సమయము పాడుజేయ
బంధువుల యింట చౌర్యము, పట్టి పూర్తి
చేయలేకుంట,యనునివి చేటు దెచ్చు.

అర్థం : విద్యగలవానికి పండితునికి ఆలిశ్యం లేకుంటేను పండితుడు చుట్టరికముచోట దొంగతనం లేకుండుట ఆచారం సగం నడిపి దొంగులుటయే 5 గుణములు యంతవారికి తగనివనిరీతి.

**ఆత్మపుత్రం వరం విద్యా విద్యా చిత్ర వరతన్సతు**
**గృహమార్మాహివాంగాని ప్రతికార్యాణి లక్షయేత్ - 102**

**పద్యానువాదం :**

తనగు గల్గిన విద్యయు ధనము నైన
భార్య పుత్రుల తోడనే పంచవలయు
అన్యులకు తెల్పకుండుట మాన్యమగును
కూర్మమన్నిటి డిప్పలో కూర్చినట్లు

**అర్థం :** తనకు గల అర్థమున్ను, విద్యను, దారపుత్రులకె గాని యితరులకు యెరింగించవలదు. అది యెటువలెననిన తాబేలు తల దాచునో అటువలెనే గృహమర్మం దాచవలెననిన రీతి.

**నాస్తి సర్వేషు విశ్వాసో నచరాణిగ జెరివు**
**పారద్వార పరస్త్రీషు పరక్షేత్ర గృహిణిచ - 103**

**పద్యానువాదం :**

నమ్మ దగనట్టి వానిని నాగుపాము
మదపుటేన్గుల పగవాని, మగువ తెరువు,
పరుల బరువును మోయుట పరుల పొలము
గృహముల విశ్వసించుట కీడు కలుగు.

**అర్థం :** విశ్వాసం సేయదగని వాడు, విషసర్పాలను మదించిన యేనుగులను,పగవాన్ని,వొకనిబరువును, పరస్త్రీలను, పరక్షేత్ర, పరగృహమును నమ్మవద్దనిన రీతి.

**అనిత్యాణిశరీరాని విభువునైవ శాశ్వత**
**నిత్యం సంనిహితో మృత్యు కర్తవ్యో ధర్మ సంగ్రహః - 104**

**పద్యానువాదం :**

ఈ శరీరము నిలువదంచెంచవలయు
ధనము నిలువబోదొకచోట ధాత్రిపైన
కాలపాశమ్ము మనలను కాచియుండు
మానవుడుధర్మమొనరింప మానవలదు.

అర్థం : ఎంతవారికైనా శరీరం నిత్యమని నమ్మవలదు. సంపదలు శాశ్వతమనక అశాశ్వతమనిన్ని మృత్యువు యంతవారికి దగ్గరనే వుండును గనుక ధర్మమే చేసుకునేదనిన రీతి. (సశేషం)

❖ ❖ ❖ ❖

---

**"ఉద్ధరేదాత్మనాऽऽత్మానం నాత్మానమవసాధయేత్ ।**
**ఆత్మైవహ్యాత్మనోబంధు: ఆత్మైవ రిపురాత్మన: ॥"**

**(భగవద్గీత 6-4)**

అందరూ తమను తామే ఉద్ధరించుకోవాలి. వారిని వారు అధోగతిని పొందించుకోకూడదు. ఇంద్రియాలను జయించుకునే ప్రయత్నం చేస్తే తనకు తానే బంధువు అవుతాడు. అదేవిధంగా జయించక పోతే తనకు తానే శత్రువు అవుతాడు.

ఈ లోకంలో పుట్టిన అందరూ ఏవో కర్మల కొరకు మాత్రమే పుడుతుంటారు. పుట్టిన ప్రతివారు తప్పనిసరిగా తామున్న స్థితి నుండి ఉన్నతస్థితివైపు ఎదగడానికి మాత్రమే ప్రయత్నించాలి. ఎవరో వచ్చి తమను ఉద్ధరించే అవకాశం లేదు. తమ కర్మల ప్రకారమే ఎవరైనా తమ చుట్టూ చేరుతారు. అయినా తమకున్న పుణ్యం వల్లనే వారు తమకు ఉపయోగపడతారు. అందువల్ల అనవసరమైన విషయాలపై మనసు కేంద్రీకరించకుండా, ఉన్నతశక్తిపై దృష్టి సారించినప్పుడు మాత్రమే తమను తాము ఉద్ధరించుకునే అవకాశం కలుగుతుంది.

మన చుట్టూ ఎప్పుడూ ఏవో సమస్యలు ఉంటూనే ఉంటాయి. సమస్యలను చూస్తూ, ఇంద్రియాలకు లోలత్వము పొందుతూ స్వల్ప సంతోషాలకు పొంగిపోవడం, చిన్న బాధలకే కుంగిపోవడం వల్ల ఎదగడం కష్టం. అసలు సమస్యలు ఎందుకు వస్తుంటాయి? తమకే అనేక రూపాల్లో కష్టాలు వస్తుంటాయని ఎందుకు మనం భావిస్తున్నాం? ఇవి మనని వేధిస్తున్న ప్రశ్నలు. తట్టుకునే శక్తి ఉన్నంతవరకు ఏదీ సమస్య కాదు. తట్టుకునే శక్తి లేనప్పుడు మాత్రమే ఏ విషయమైన సమస్యగా భావించడం జరుగుతుంది. ఒక చిన్నపిల్లవాడికి ముల్లు గుచ్చుకుంటే బాగా ఏడుస్తాడు. అదే కొంత పెద్దవానికి గుచ్చుకుంటే అంత ఎక్కువగా బాధపడడు. ఇద్దరికీ జరిగిన నొప్పి ఒక్కటే అయినా చిన్నపిల్లవానికి తట్టుకునే శక్తి ఉండకపోవడం వల్ల ఏడవడం జరుగుతుంది. అందుకే మన ప్రయత్నం ద్వారా మనం అన్ని సమస్యలను తట్టుకునే శక్తిని పెంచుకోవాలి.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (51) హైదరాబాద్ మే : 2025

# స్త్రీ పాత్రల పట్టాభిషేకానికి అర్హత గల కథలు

**పెద్దొళ్ళ శ్రావణ్ కుమార్,** పరిశోధక విద్యార్థి, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం. ఫోన్ : 9666400147



ఆమె కథలు పాఠకుడి ఆలోచనకు పదును పెట్టే సత్య సాధనాలు. జరుగుతున్న సమస్యలకు పరిష్కార ప్రతిరూపాలు. సంఘోన్నతికి, సమస్త కుటుంబ సంక్షేమానికి ప్రతిపాదనలు. ఆమె కథలు బతికి చెడిన కుటుంబాల భర్తలకు హామీల మ్యానిఫెస్టోలు. స్త్రీ సాధికారతకు, ఆర్థిక స్వేచ్ఛకు సలహాల సూచనలు. ఆమె కథలు వేధించే భర్తలకు, ద్వేషించే పతులకు హెచ్చరించే చురకత్తులు. వివాదాల, వినోదాల, సాధికారతల, స్వేచ్ఛల ఇతివృత్తాలతో పునరావృత్తం కానీ అంశాలతో పాఠకులను రచనా సామర్థ్యంతో ఆకర్షించే ఆ ప్రముఖ రచయిత్రి పేరే సి. భవానిదేవి. తాను చూసిన వాస్తవ సంఘటనలకు, వినిన హృదయార్ద్ర ఘటనలకు, చదువుకున్న స్త్రీ పడే వేదనలకు, న్యూక్లియర్ కుటుంబాల్లో జరిగే వాదనలకు ఆమె కథలు బహు సృజనాత్మకతకు చిరునామా. ఇంతటి సత్య సమీప ఉపమానాలకు మూలమైన కథల సంపుటి నామధేయమే **'అమ్మా నన్ను క్షమించొద్దు'**. ఈ సంపుటి 18 కథలు గల్గిన పరిష్కార జ్ఞానార్జన నిలయం. మారుతున్న జీవన శైలి యాంత్రీకరణ కావడం, పెరుగుతున్న అమానవీయ ఆలోచనలు పరిమితులు దాటడం, పెరిగిపోతున్న హింసాత్మక ఆలోచనలు విపరీతమవడం వంటి దారుణ, భీకర అకృత్యాలను చూస్తూ ఉండి పోక తన కర్తవ్య బాధ్యతను కథల రూపేణా నిర్వహిస్తున్నారు భవానీదేవి. అమ్మా నన్ను క్షమించొద్దు కథల్లో పాత్రలు, వాటి పేర్లు వివిధ రకాలుగా ఉన్నా, ఆ పాత్రల తాలూకు భావనల అంతరాత్మ, స్త్రీల మనసులోని ఏకాత్మత అనే సూత్రీకరణకు యిది సజీవం సాక్ష్యం. ఈ పందొమ్మిది కథలలో ప్రధానాంశం స్త్రీ. నిత్య జీవితంలో పురుషుడు ఎదుర్కొనే అడ్డంకులు, అవరోధాల కంటే స్త్రీ ఎదుర్కొనే సమస్యలే అధికం. ఆ సమస్యలను అధిగమించి పురుషులకు దీటుగా, సమానంగా అన్ని రంగాలలో ముందు ఉండాలని రచయిత్రి తపన పడ్డారు. ఆ తపనలో నుంచే స్త్రీకి సాధికారత ఉండాలని, తను ఒకరిపై ఆధారపడకుండా జీవించాలని, తనపై పురుషుల పెత్తనం ఉండకూడదని భావించి స్త్రీ పాత్రనే కేంద్రంగా రచించారు.

గరిష్ట స్త్రీ పాత్రలకు మానవీయతను ఆపాదించి, కనిష్ట స్త్రీ పాత్రలకు పొగరుతనాన్ని, గర్వాన్ని, ఆపాదించి ప్రతికూల ఆలోచనలతో ఉన్న స్త్రీలకు అనుకూల స్త్రీల ద్వారా నైతిక విలువలను బోధిస్తూ ఉంటాయి. ఇటువంటి కథే **"నాకీ బొమ్మ చాలు".** ఈ కథలో ప్రేమించి పెళ్ళి చేసుకున్న ప్రమీల గృహిణి. రామకృష్ణకు కోడలిగా తన బాధ్యతను తాను నెరవేర్చకుండా తలపొగరుతో, అహంకారంతో మామ గారి బాగోగులను చూడడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. అసలు ఏమాత్రం మానవత్వం లేకుండా, అరవై ఏళ్ళ వయసు దాటిన మామగారి పట్ల ఏహ్య భావంతో నడుచుకుంటుంది. ఒక భారతీయ కుటుంబ స్త్రీ ఇలా ప్రవర్తించడం వసుధైక కుటుంబానికి విరుద్ధమని తెలుస్తుంది. మానవతా విలువలు తెలియని స్త్రీలు కోడళ్ళుగా అత్తగారింటిలోకి ప్రవేశిస్తే ఆ ఇల్లు అశాంతికి నిలయంగా మారుతోందని ఈ కథలో ప్రమీల పాత్రను చూసి తెలుసుకోవచ్చు.

**'అమ్మా నన్ను క్షమించొద్దు'** కథలో కౌటుంబిక స్త్రీలు సునీత, జానకమ్మ. ఉద్యోగం రీత్యా పట్టణంలో నివాసముంటున్న సునీత, ఆమె ఇంటి పక్కనే నివసించే జానకమ్మ బాధ పడుతుంటారు. తల్లి కోసం కూతురు సునీత, కూతురు రాధ కోసం తల్లి జానకమ్మ ఆవిరామంగా ఆలోచిస్తూనే ఉంటారు. ఒకరి ఆలోచనకు అనారోగ్యం కారణమైతే, మరొకరి ఆలోచనకు ఎడబాటు కారణం.

**'వెలుగులోకి'** అనే శీర్షికతో వచ్చిన కథ సంచలనాత్మకమైంది. గత పూర్వ పరిశోధనలను, కథలను పరిశీలించిన మీదట చూస్తే, ఇటువంటి కథ ఇంతకు పూర్వం వెలువడలేదని భావిస్తున్నాను. స్త్రీకి ఈ సమాజం విధించిన ఆంక్షలు, పెట్టిన నిబంధనలు తనను అజ్ఞానానికి చేరువచేశాయి. స్వేచ్ఛాయుత జీవనానికి అలవాటు పడదామనుకున్న ప్రతీ యువతికి తన కుటుంబంలోనే ఒక శత్రువులా పుట్టుకొస్తాడు. కథలో గీత, గీత తల్లి, గీత చిన్న వదిన వాసంతి, పెద్ద వదినలు కుటుంబ స్త్రీలు. ఈ నలుగురిలో ఒక్కొక్కరికి ఒక్కొక్క భావాత్మక ఆలోచన ఉంటుంది. ఒక్క వాసంతి తప్ప, గీత మనసును, ఆమె ఆలోచనలను, భావాలను ఇంకెవరు అర్థం చేసుకునే స్థితిలో ఉండరు. ఆమె ఇష్టాయిష్టాలను అనుసరించి నడుచుకోకుండా ఆమెకు వచ్చిన పెళ్లి సంబంధాలను చెదగొట్టడం వలన ఆమె దృష్టిలో తండ్రి అపరిష్కృత సమస్యగా మారుతాడు. దాంతో ఆమె స్వేచ్ఛను కోల్పోయి జీతాన్ని ఇంటికి ఇచ్చే యంత్రంలా చూడబడుతుంది.

**"ఆమె విముక్తి"** కథ భావోద్వేగానికి గురి చేసే కథ. అనసూయ అనే పాత్ర, సగటు కుటుంబంలో వివాహిత స్త్రీ పడే యాతన ఎలా ఉంటుంది? ఆమెకు ఏం సమస్యలు ఎదురవుతుంటాయి? అనే ప్రశార్థక విషయాలు అనేకం ఉన్నాయి. ఒక స్త్రీ మాత్రమే ఇంటి చాకిరీ ఎందుకు చెయ్యాలి? అన్నిట్లో మేం తక్కువ కాదు? పురుషుడు ఎందుకు ఇంటి పని చెయ్యడు? వంటి అంశాలతో సాగిన కథ పాఠకులకు, సాహితీ వేత్తలకు కొత్త ఆలోచనను రేకెత్తించింది.

ఈ కథ రాయబడిన కాలం 2007 అయినా, అప్పటికే సమాజంలో ఉన్న సమస్యలను కథా వస్తువులుగా తీసుకోవడం వలన రాబోయే తరం వారైనా ఇలా నడుచుకోరు అనే సదభిప్రాయంతో నడుచుకుంటారు. కుటుంబంలో పురుషులు కూడా ఉన్నప్పుడు ఒక్క స్త్రీ మాత్రమే ఇంటి పని ఎందుకు చెయ్యాలి? అత్తా - కోడళ్ళు అయినా, మరెవరైనా స్త్రీకి కనీస గౌరవం ఇవ్వడం, ఆమెను గురించి గొప్పగా చెప్పడం వలన వారి వ్యక్తిత్వం పెరుగుతుంది. దీని ద్వారా కుటుబ జీవనం సాఫీగా వెళ్తుంది.

**"ముద్దబంతి పూవులో మూగ బాసలు, మూసి ఉన్న రెప్పలపై ప్రేమ లేఖలు"** (మోహనబాబు చిత్రం). కథా శీర్షికకు, ఆ కథలోని ఇతివృత్తానికి సమానార్థం ఉండేలా, కథపేరు చూడగానే పై పాట గుర్తుకు వచ్చి కథాంశాన్ని ముందుగానే అర్థం చేసుకునే విధంగా రాసిన తీరు రచయిత్రి నైపుణ్యానికి మచ్చుతునక. అనురాధ అనే పాత్రను ముద్దబంతి పువ్వుతో పోలుస్తూ, ఆమెకు మాటలు రావు కనుక, తన భావాలను ప్రేమలేఖలో రాస్తుందనే ఇంత పెద్ద కథా వస్తువు తాలూకు భావాన్ని శీర్షికలో తెలియచెప్పడం కథా రచన నైపుణ్యంలో ఒక నూతన కోణం.

స్త్రీలకు ప్రకృతి ధర్మంగా పలు సమస్యలు ఎదురవుతుంటాయి. వాటిని వారు ఆ ప్రకృతి ప్రసాదించిన ధైర్యంతోనే ఎదుర్కొంటారు. కథలో అనురాధ పుట్టు మూగ కాకపోయినా, మధ్యలో నోరు పడిపోయినా అది ఆమె ముందున్న పెద్ద సమస్య. అమ్మాయి మూగ అని తెలిసేసరికి ఆమెను ఎవరు పెళ్లాడడానికి ముందుకు రారు. దీనిని ఆమె సమస్యగా భావించి సహజ మౌనిగా ఉండిపోతుంది. మూగ నోరు అని తెలిశాక తనను ఎవరూ పెళ్లి చేసుకోరని తెలిసే కాబోలు, తన బావను పెళ్లాడతానని నిర్ణయించుకుంది. ఆమెను చూడడానికి వచ్చిన మనోజ్‌కి నిజం తెలియడంతో పెళ్లికి నిరాకరిస్తాడు. మానవ శారీరక వైకల్యాలలో మూగ ఒక వైకల్యం. అంత మాత్రం చేత తను/అతను పెళ్లికి అర్హులు కాదు అని భావించడం సంఘంపై చూసే వైకల్యం ద్రోహమే అవుతుంది. కావున మానవ సహృదయంతో ఎలాంటి వైకల్యం ఉన్నా దయార్థ్ర హృదయంతో అర్థం చేసుకోవాలని చెప్పడం ఈ కథ తాలూకు ప్రధాన ఉద్దేశ్యం.

**"నడక"** - ప్రాచీన కాలపు స్త్రీ అయినా, ఆధునిక కాలపు స్త్రీ అయినా తనకంటూ తోడూ నీడా లేని ఏ స్త్రీనైనా ఆ కాలపు సమాజం న్యూనతా భావంతో చూస్తుంది. భర్త చనిపోయిన భార్యను మన ప్రాచీనులు వితంతువు అని పిలిచారు. ఒక శతాబ్దం లేదా అర్థ శతాబ్దం క్రిందటి వరకు ఈ వితంతువులకు గౌరవం ఉండేది కాదు. మిగతా సమాజం వారిని దేశద్రోహులుగా చూసేది. వారేదో చేయకూడని తప్పు చేసినట్టు చీత్కరించేవారు. నేటి సమాజంలో కూడా ఇలాంటి వారికి సంఘంలో గౌరవం ఉండాలని, వారు మళ్ళీ పెళ్లి చేసుకొని దాంపత్యాన్ని చూడాలని సంఘ సంస్కరణ చేసే కార్యక్రమంలో భాగంగా రచయిత్రి ఈ కథ రాశారు.

సులభ తన భర్తను కోల్పోవడం తనకొక సమస్యగా ఎదురైంది. మహిళకు ఐదోతనం ఉన్నప్పుడే అందరూ గౌరవిస్తారని లోక వ్యవహారం. నిజానికి మానవుడు తోడు లేకపోయినా జీవించ గలుగుతాడు. కాకపోతే కొన్ని సందర్భాల్లో ఇతరులపై ఆధారపడవలసి వస్తుంది. అంత మాత్రాన దానిని ఆ స్త్రీ సమస్యగా భావించకూడదు.

సులభ కూతురైన రేఖ వయసులో చిన్నది అయినా, తను కూడ చెప్పరాని సమస్యను ఎదుర్కొన్నది. వరసకు అన్న అయిన వికాస్ రేఖ పట్ల లైంగికాపేక్షతో వ్యవహరిస్తాడు. లైంగికంగా సమస్యను ఎదుర్కొనలేక, పెద్ద వాళ్ళకు చెప్పలేక రేఖ లోలోపల కుమిలిపోయింది. వికాస్ రేఖ పట్ల ప్రవర్తించిన తీరు దుర్మార్గం. సాటి బాలికను సోదరిగా భావించాల్సిందిగా పోయి, తప్పుడు మార్గంలో వ్యవహరించి నందుకు వికాస్ అంతర్మధనం చెంది మారిపోతాడు. సాటి స్త్రీ పట్ల వక్రబుద్ధి తో కాకుండా సన్మార్గంగా నడుచుకుంటే మానవీయ సమాజ నిర్మాణానికి బాటలు వేయవచ్చు.

**ఇనుప తెర** - పేదరికం, వరకట్న సమస్య, అవిద్య మొదలగునవి ఈ కథలో ఎదురయ్యే నిత్య సాధారణ సమస్యలు. పేదరిక కుటుంబాల్లో పుట్టినవారు, తన పేదరికాన్ని జయించాలని నిత్యం జీవితంతో పోరాటం చేస్తుంటారు. కొందరికి ఉపాధి అవకాశాలు ఉన్నా, వారు కూడా పేదరికంగానే జీవిస్తుంటారు. ఈ పేదరికులకు విద్య దూరమవుతుంది. విలాస జీవితం దూరమవుతుంది. ప్రశ్నించే ధోరణి దూరమవుతుంది. ఇవన్ని దూరం కావాలంటే పేదవారు విద్యకు దగ్గరవ్వాలి అనే భావనతో పేదవారికి చదువు చెప్పించాలన్న ఆలోచనతో వయోజన పాఠశాల భావనను ప్రవేశపెట్టారు. పేదరికాన్ని సమస్యగా భావించకుండా, ఇదొక జీవిత అవరోధంగా భావిస్తే దానికి జయించవచ్చని తెలిపారు.

పై కథల్లో స్త్రీలు స్వయంగా ఎదుర్కొన్న సమస్యల వలన స్వతహాగా పరిష్కారాలను వెతుక్కునే సామర్థ్యము కూడా వారికి ఉందని తెలిపారు. ఈనాటి సమాజానికి ఇటువంటి పాత్రల మనోధైర్యం అనివార్యం అని చెప్పడం రచయిత్రి ఉద్దేశ్యం కావచ్చునని భావన. రచయిత్రి తన పాత్రల ద్వారా కోరుకున్నట్టు స్త్రీ అన్ని రంగాలలో ముందు ఉంటే సంఘము మరింత పురోగతి దిశలో సాగుతోంది.

**ఉపయుక్త గ్రంథ సూచి :**

1. అమ్మా నన్ను క్షమించొద్దు కథలు. 2. తప్తశిల కథలు.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మే : 2025

# పేగు బంధము (కథ)

**ఐతా చంద్రయ్య**, సిద్ధిపేట, ఫోన్ : 984

**తూ**ర్పు ఆకాశానికి నునులేత సూర్యకిరణాలు బంగారు పూతలు పూస్తుంటే బిరబిర గంగెద్దు ముందు నడుస్తూ డోలు వాయిస్తూ పాట పాడుతున్నాడు శరబయ్య. అందరూ అతన్ని గంగెద్దు శరబయ్య అంటారు. ఇల్లిల్లు తిరుగుతూంటే ఆయాసం తొంగి చూస్తుంది. ఎదపొదలో తీరని ఆశల జల్లు అరవయ్యేళ్లు దాటిన వయసును లెక్క చెయ్యడం లేదు.

అర ధనుస్సులాంటి కొమ్ములు, వీపు మీద రంగురంగుల దుప్పట్లు, నుదురుకు పసుపు – కుంకుమతో గంగెద్దు పాట మరియు కలుపుగోలు మాటకనుగుణంగా తలాడిస్తోంది. శరబయ్య ఆకారం – గుండ్రని సొరకాయలాంటి తలకు గుమ్మడి కాయంత తలపాగా, గుబురు మీసాలు, పాల నురుగ లాంటి తెల్లని ధోవతి, చొక్కా సూర్యకిరణాల స్నానం చేస్తూ మెరిసిపోతున్నాయి. మెడలో డోలు, భుజమ్మీద అంగవస్త్రము ఆకట్టుకుంటున్నాయి. దినచర్యలో భాగంగా ఓ ఇంటి ముందు ఆగాడు.

**"రాజా! పేరున్న మహారాజా!**
**గంగెద్దు శరబయ్య నొచ్చిన**
**రండి, పలుకు వినరండయ్యా**
**మహారాజా! రాజమర్తాండా!"**

గడపలో నుంచున్న ఇంటి ఇల్లాలు ఇలవేల్పులా కన్పించింది శరబయ్యకు. ఆవిడ పక్కన పెళ్లికెదిగిన కూతురుంది. శరబయ్య అవతారాన్ని ఆసక్తిగా చూస్తున్నారు.

**"అమ్మా! జగదాంబ తల్లీ!**
**మంగళవారము రోజున లక్ష్మి**
**సక్కంగ కూచునుంది**
**కన్నె పడుచుకు మొగుడొస్తాడు,**
**పువ్వుల్లవెట్టి చూసుకుంటాడు..."**

ఇల్లాలి మొహం ముద్దబంతి పూవులా విచ్చుకుంది. వయస్సు పరువాలను చూపులతో తడుముకుంటున్న కన్నెపిల్ల చెంపల మీద కెంపులు తచ్చాడుతున్నై అరచేతిలో మొహం దాచుకుని లోపలికి పరుగెత్తింది. కాలిపట్టీల మువ్వల సవ్వడి లయబద్ధంగా వినిపించింది. ఐదురూపాయల నాణెం తెచ్చి, గంగిరెద్దుకు మొక్కి శరబయ్య చేతికిచ్చింది. మరో ఇంటిముందు నవ వధువు సిగ్గుల్లో ముగ్గులు పరుచుకున్నై.

**"మహారాజా! రాజ మార్తాండా!**
**శుభోదయం మీకు, దానం మాకు**
**భూరిదానం చెయ్యండి దొరా**
**సకల సుఖాలు పొందండయ్యా..."**

ఆ ఇంట్లో అద్దెకున్న ప్రభుత్వోద్యోగి అంగలేస్తూ బయటకొచ్చి పాట విన్నడు. చేతిలో దినపత్రికతో... మధ్యతరగతి మందహాసము.



**"దొర మనసు మా దొడ్డదయా**
**పట్టిందల్లా బంగారమైతది..."**

ఉద్యోగి నరాల స్వరాల్లో ఉత్సాహం ఉడికొచ్చింది. పదిరూపాయల నోటు శరబయ్య చేతికొచ్చింది. కాళ్లు పక్కుకున్న పాత బంగళా వద్దకు లాక్కెళ్లాయి. మాట/ పాట కనుగుణంగా డోలు మోగుతోంది..

**"అయ్యా! దొర బాబాయ్యా!**
**మీ ఇంట్లో రతనాల వాన కురిసేను**
**ముత్యాల జల్లు మురిసిపోవాలయ్యా!**
**మీ కీర్తి జగమెల్ల చెప్పుకోవాలి..."**

**"అరేయ్! నీ డోలు వాయింపు, పొగడ్తలు ఆపెయ్!"** మెరుపులేని ఉరుము. బంగళాలోంచి స్టైల్‌గా వచ్చిన యువకుని అరుపు అది. అతని మొహం మారేడు కాయలాగుంది.

**''అరేయ్! రతనాల వాన, ముత్యాల జల్లు నీ ఇంటి మీదున్నాయిరా?"** చేతులు నడుమ్మీదున్నాయి. అయినా శరబయ్య అక్కడి నుండి వెళ్ళలేదు. మరో ప్రయత్నం చేసి చూడాలనుకున్నాడు. రకరకాల మనస్తత్వాల సమూహము సమాజము. కొందరి మనసు వెన్నపూసైతే, కొందరికి కఠిన పాషాణ హృదయము. యువకునిది కొండముచ్చు స్వభావం కావచ్చు.

**"ఛీ నీ యవ్వ"** కొండముచ్చుకు పిచ్చెక్కింది. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుని కష్టం చేస్తే నోట్లోకి బుక్క రాదు. వరహాల వరదలెట్లా వస్తాయిరా! నీ ఇంటి మీంచి రాలి పడతాయా?" శరబయ్య ప్రయత్నం రాజీ పడలేదు.

**"మా పగటి వేషాలు మీరెపుడు చూడాలి**
**మీ ఇల్లు ధాన్య రావులతోని నిండాలి**
**మీ దాన ధర్మాలు మాకు చెందాలి**
**గంగిరెద్దుకు మంచి శాలువా లివ్వాలి..."**



ఉత్సాహం రెట్టించి దరువు అందుకుంది. **“ఒరే అడుక్కు తినే గంగెద్దోడా!”** యువకునికి చిర్రెత్తింది. **“ఒంటిమీద పుండుకు నూనె లేదు గాని పశువుల కొట్టంల దీపం బెద్దారన్నట్లు ఎంగిలి మూతి తుడుచుకునేందుకు మంచి తువ్వాల లేదు గాని ఎద్దు మీదికో శాలువానా?”** గుర్కాయించిండు.

అనువుగానిచోట అధికులమనరాదు సామెత గుర్తుకొచ్చింది. డోలు వాయింపు ఆపేశాడు. **“దొరా! దానమిచ్చేవారికి ఒక్క ఇల్లు అడుక్కుతినేవానికి ఆరు ఇండ్లు”** అంటూ వెనక్కు తిరిగాడు.

తన ఇంటిముందు నుంచుండి అంతా గమనిస్తున్న శివకుమార్‌లో ఆసక్తి అంగలేసింది. అప్పుడే మార్నింగ్ వాక్‌కు వెళ్ళొచ్చాడు. గుండెలో జాలి జాలు వారింది. **“పాపం! అడుక్కుతినే గంగెద్దులాయన...”** గొణుక్కుంటూ లోపలికెళ్లి సోఫాలో కూచున్నాడు. మెదడు పొరల్లో అలజడి....

దినపత్రిక టీపాయ్ మీదుంది. వెనకనుండి పట్టాగొలుసుల మువ్వల సవ్వడి.... సంవత్సరం క్రితము తన అర్ధాంగిగా వచ్చిన లక్ష్మి రాయంచలా నడిచి వచ్చింది. పొగలు కక్కుతున్న వేడిచాయ కప్పు పత్రిక పక్కన ఉంచుతూ కళ్లలోకి చూసింది.

భర్త ఏదో దీర్ఘాలోచలో ఉన్నట్టనిపిచింది. వెనక్కు తిరిగి వెళ్లింది. శివకుమార్ మనసు లోగిళ్లలో కల్లా కపటానికతీతమైన బాల్యం గంతులేసింది. చాయను గటగటా తాగేసి శూన్యంలోకి చూస్తున్నాడు.

అప్పుడు తన వయసు ఏడేళ్లు పరీక్షకు చదువుకోవాలని ముందే నిద్ర లేపింది అమ్మ. గుడ్డి దీపం వెలుతురులో పట్టుదలగా చదువుతూంటే **“శివా! నువు ఇయాల నాతోటి రావాలెరా!”** తండ్రి ఆదేశం.... నిశ్చల జలధిలో గులకరాయి లాగైంది.

“నేను నీతో రాను నాయినా!”

“గట్లంటే ఎట్ల కొడుకా? నువు గంగెద్దులోని కొడుకువు గంగెద్దును నమ్ముకోవాలి. నాలుగు పొగడ్తలు విసిరి నాలుగు పైసలు సంపాదించాలి. ఇప్పట్నుంచే నువు ఈ విద్య నేర్చుకోవాలి”. తలపాగా చుట్టుకుంటున్న తండ్రి శత్రువులా కనిపించాడు. “ఆ విద్య నాకు రాదు నాయినా”.

“మరి పెద్ద పెరిగినంత బతుకు దెరువెట్లరా?”

“మూడో తరగతి దాటేసినవు గదా! మన విద్యకు ఈ చదువు చాలు. ఇంగ కులవృత్తి నేర్చుకో”.

తను కుడితలో పడ్డ ఎలుకలాగయాడు. తల్లి ముందుకొచ్చి “వాణ్ని గూడా నీవోలె అడుక్కు తినుమంటవా? రోజుకో ఊర్లె ఇల్లిల్లు తిరగాలె. వద్దు” మందలించింది.

“కులవిద్య నేర్చుకోకపోతే సిమ్మాససనమ్మీద కూచుండబెట్టి రాజ్యమేలిస్తవా? నువు రాజమాతవైతవా?” వెటకారం.

“నా కొడుకు బాగా చదువుకుని మంచి నౌకరి చేస్తడు. మనల్ని కూచోబెట్టి సాదుతడు....” అమ్మ తనను ఒడిలోకి తీసుకుంది. అమ్మ ఒడి కమ్మగా వుంది.

“చదువంటే పోరగాండ్ల ఆటనుకున్నవా? కులవిద్యతోనే బతుకు దెరువుంటది. వాన్ని గావురం జేసి నడుమంత్రపోన్ని తయారు చేస్తున్నవ్...” పాగా చుట్టుకొని ఒంటికాలు మీద లేచాడు తండ్రి.

“గంగెద్దుతోని గంతులేయించుడు గూడా ఒక విద్యనేనా? మాస్టార్లు చదువుల హుషారుగున్నడన్నరు. బడి ఫీజులు కట్టద్దట. ఎంతవరకంటే అంతవరకు ఫిరీగ చదివిస్తరట.” అంటూ రాత్రంతా వెలిగిన దీపాన్ని ఆర్పేసింది. కిటికీలోంచి బయటకు చూసింది. ఆకాశం తెల్లని కొండలాన్పించింది. తండ్రి కోపం నశాళాని కంటిందేమా.... ఏయ్! దొంగముండా! కూసే గాడిదొచ్చి మేసే గాడిదిని చెడగొట్టినట్టు గదేందీ?” చెంప ఛెళ్లుమనిపించాడు. “చదువు – గిదువని వాణ్ని ఎటు గాకుండా చేస్తున్నవ్ గదా!” మరో చెంప చెళ్లుమంది.

తన చిన్నారి మనసు చివుక్కుమంది. వణికిపోయాడు. “నీతోని వస్త నాయినా! అమ్మను కొట్టొద్దు నాయినా. తండ్రి కాళ్లకు చుట్టేశాడు. తన ఒంటిమీదున్న నెక్కరు మీద పంచ చుట్టబడ్డది. చొక్కా మీదికి మరో చొక్కా వచ్చేసింది. నుదుట విభూతి రేఖలు. వాటిమధ్య చందనంబొట్టు. చేతికి గంగెద్దు పగ్గాలు... తన ఇష్టాయిష్టాలతో సంబంధం లేదు.

బలి కోసం తయారైన మేకపిల్లలా తండ్రి వెంట నడవాల్సి వచ్చింది. మనసు మారాము పెడ్తూనే వుంది. తండ్రి వెంట పక్కూరి కెల్తూనే వున్నాడు. “కొడుకా, శివా!” న్నా సముదాయిస్తున్నాడు” ఎంత పెద్ద చదువులు చదివినా కుల కప్పి మీదికి రావు. కళ విద్యలెన్ని నేర్చిన, కులవిద్యల సాటిరావు అన్నారు పెద్దలు”.

పిల్లతోవకు ఒక పక్కన పొలములో వరికర్రలు నాట్యం చేస్తున్నాయి. మరో పక్కన మక్క ఆకులు పిల్లగాలితో ముచ్చట్లాడు తున్నాయి. తన నడుమ్మీది పంచె, తలపాగా వదులైపోతున్నై. అవి పడిపోతాయేమో... భయం వెనక్కు లాగుతోంది. మెడలున్న డోలును సర్దుకోబోతుంటే వెనకనుండి తండ్రి “ఓర్నియవ్వా” భళ్లున నవ్వింది.

"మొదట గిట్లనే వుంటదిరా! అలవాటైతే బాగుంటది శివా!" అంటూ సవరించాడు.

"అయితే నేను పాడేటప్పుడు విని పూర్తిగా నేర్చుకో.

"అయ్యగారికి దండంబెట్టు

అమ్మగారికి దండంబెట్టు" వచ్చు గదరా!

"జెరంత, జెరంత వచ్చు నాయినా!"

చల్లని పిల్లగాలి చెంపల్ని నిమిరింది. తండ్రి తిరిగి "బిడ్డా! మనది అడుక్కుతినే జాతి. అందర్నీ పొగడాలి. రాక్షసుడిలాగున్న మొగోన్ని మన్మథుడనాలే. అష్టదరిద్రున్ని గూడా కుబేరుడనాలి. ఎవరన్నా తిడితే రోషానికి రావద్దు. కుక్కిన పేనులెక్కుండాలె. ఉన్నోడు దానం చెయ్యకపోవచ్చు. లేనోడు దానం చేసి పుణ్యం కట్టుకోవచ్చు".

డోలు వాయించుడు అంతకు ముందే ఇంటివద్ద నేర్పించాడు. కాబట్టి తండ్రి మాటల్ని అనుసరించాలి. పంచె దొంగబర్రెకు లంకె తగిలించినట్టుంది. తలపాగా సతాయిస్తూనే వుంది. తన వయసు గల పక్కూరి పిల్లలు ఊరవతల చిర్రా – గోనె ఆడుకుంటున్నారు.

"అగో! బుడ్డ గంగెద్దులోడు" చిర్రాగోనె ఆడుకుంటున్న పిల్లలు కేరింతలు కొడుతున్నారు. వాళ్లు తనను గేలి చేసినట్టనిపించింది.

"నీ కొడుక్కు కులవిద్య నేర్పుతున్నవా శరబా?" ఓ ముసలాయన వేపపుల్లతో పళ్లు తోముకుంటూ అడిగాడు.

"అవును, మల్ల మొక్కై వంగనిది మానై వంగదు గదా!" తండ్రి కిలుక్కున్న నవ్వాడు. తన గుండెలకు మంగముల్లు గుచ్చుకున్నట్టయింది.

ఊరు తిరుగుతూంటే కాళ్లు పీక్కుపోతున్నై. ఊరి పెద్ద దొర బంగ్లా ముందు తండ్రి చిందులేస్తూ, గంగెద్దుతో వేయిస్తున్నాడు. అసహనాన్ని అదిమిపెట్టి తండ్రిని అనుసరించాల్సి వచ్చింది. డోలు వాయిస్తుంటే చెయ్యి నొప్పి పుడుతూంది. మెడకు బరువుంది.

"ఛీ...నీ యవ్వ! గీ పని నాకొద్దు..." మనసు ఎదురు తిరిగింది. దొరగారు ధోవతి సర్దుకుంటూ బయటికొచ్చిండు. తండ్రి ఉత్సాహం రెట్టింపయిందేమో....

**"మహారాజా! రాజమార్తాండా**
**మీకు సాటి మరెవ్వరు లేరు దొరా!**
**మీ బనారసు పట్టు శాలువా**
**మా గంగెద్దు మీద మురవాలి..."**

దొరగారు మీసాలు తిప్పారు. "అయ్యగారికి దండం బెట్టు...." అనగానే గంగెద్దు తల తిప్పి దండం పెట్టినట్టు చూపించింది.

ఎండ బలం పుంజుకుంది. ఒళ్లంతా పచ్చికారం పూసినట్టైంది. తాను గూడ గంతులేస్తుంటే పంచె, తలపాగా ఊడి దొరగారి కాళ్లమీద పడిపోయినై. పసి హృదయంలో పరితాపం ఉవ్వెత్తున లేచింది. పిక్కలు బలం కూడగట్టుకున్నై. వేటగాడి బాణానికి బెదిరిన లేడిపిల్లలా ఒకటే పరుగు. ఒంటిమీద చిన్నపాటి నెక్కరు, పొట్టిషర్టు తప్ప మరేమీ లేవు.

"ఆగురా శివా... ఆగు" మొత్తుకుంటూ వెనకబడిన తండ్రికి తాను అందలేదు. దొరగారి మనుషుల నుండి తప్పించుకోగలిగాడు. స్టేషన్లో కదులుతున్న రైలుకూత




కన్నతల్లి పిలుపు లాగన్పించింది. పరుగెత్తుకెళ్లి రైలుడబ్బా ఒడిలో వాలాడు. టికెట్ చెక్కర్‌కు దొరికి పోయాడు. తన పరిస్థితి చెప్పాడు. ఆయనకు జాలేసిందేమో... బాల నేరస్తుల కారాగారములో పదిహేడు రోజుల చదువు సాగింది. "విడుదలైం తర్వాత ఎక్కడికెళ్లాలి?" చిన్నబుర్రలో పెద్దప్రశ్న. "సార్! నేనిక్కడే వుంటా!" జైలర్‌ను బతిమాలాడు.

విడుదలైన పిల్లలు అమ్మా నాన్నల్ని కలుసుకోవాలని ఆరాట పడ్తుంటారు. నువ్వేమో జైల్లనే ఉంటానంటావేమిట్రా? మాటల్లో మార్దవం అంతరంగము అతలాకుతలమైంది. కళ్ల నీరు ధారాపాతాలైంది. జైలరు తనను అనాథాశ్రమములో చేర్పిస్తూ "ఈ పిల్లగాడు బాగా చదువుకుని పైకి రావాలి" మేనేజర్తో చెప్పాడు. ఆయనకు పాద నమస్కారం చేశాడు.

హైస్కూలు విద్య అనాథాశ్రమములో, ఆ తర్వాత ఇంటర్, ఇంజనీరింగ్ గవర్నమెంటు హాస్టల్లో పూర్తయినాయి. కావాలనుకున్న ఉద్యోగం కాళ్లముందు కొచ్చింది. ఎప్పుడూ తన యోగక్షేమాలు తెలుసుకుంటున్న జైలర్ కూతురుతో అంగరంగ వైభోగంగా తన పెళ్ళైంది.

చూపులు శూన్యంలో తచ్చాడుతున్నాయి. "అయ్యో! దినపత్రిక గూడా చదవకుండా ఏమాలోచిస్తున్నారు?" అర్ధాంగి లక్ష్మి అందెల సవ్వడితో వచ్చి కమ్మగా భుజం తట్టింది. గతం కనుమరుగైంది. బయటి డోలు వాయిద్యం దగ్గరవుతోంది.

"కూచో లక్ష్మీ!" గాజుల చెయ్యందుకుని కూచోబెట్టాడు. గోముగా చెంప గిల్లాడు. గోదావరి తరంగధ్వనిలా గలగలా నవ్వింది. ఇద్దరూ గుమ్మం వద్దకొచ్చారు.

**"అయ్యగారికి దండం బెట్టు**
**అమ్మగారికి దండం బెట్టు..."**

శరబయ్య వాకిట్లో కొస్తున్నాడు. సూర్య కిరణాలు గంగెద్దు మొహాన్ని మెరిపిస్తున్నాయి. అలసట సతాయిస్తోంది.

**"కొత్త బట్టలు దానమివ్వమని**
**అయ్యగారికి దండంబెట్టు...."**

శరబయ్య పలుకులు వినసొంపుగా వున్నాయి. దంపతులు చూస్తూ నుంచున్నారు.

**"శుక్రవారము లక్ష్మి ఇక్కడే వుంది**
**జయము మా రాజో! మీకు జయమయ్యా!"**

డోలుమోత, పాటలాంటి మాటలు గంగెద్దు మొగ్గలేస్తుంటే, శరబయ్య చిందులేస్తుంటే శివకుమార్ చూపులు నిలబడిపోయినై. "నువ్వు, నీ గంగెద్దు గేటు దాటి లోపలికి రాంఢ్రయ్య!" ఆత్రంగా పిలిచాడు. శరబయ్య కళ్లల్లో ఆశాకిరణాలు...

"వద్దు దొరా! నా స్థానం గిదే..." శక్తినంతా కూడదీసుకుని పాటందుకోబోయాడు.

శివకుమార్ నరాల్లో ఆత్మీయ స్వరమాధుర్యం... గబుక్కున శరబయ్య చెయ్యందుకుని గేటు లోపలికి తీసుకెళ్లాడు. గంగెద్దునక్కడే వదలిపెట్టి శరబయ్యను ఇంటి లోపలికి తీసుకెళ్లాడు. మర్యాదగా కుర్చీలో కూచోబెట్టాడు.

బిత్తరబోయిన శరబయ్య... శివకుమార్‌ను ఆపాదమస్తకం ఎగాదిగా చూశాడు. మనసు తెరమీద గతచిత్రం కదలాడింది. "నువ్వు.... నువ్వు..." తడి లేని గొంతు జీరబోయింది.

"అవును నాయినా!... నేను నీ కొడుకును శివకుమార్‌ను. నువు శివా అని పిలిచేవాడివి..."

అమాంతం కౌగిలించుకున్నాడు. ఒంటినిండా పులకింత పూనింది. కన్నపేగు అయస్కాంత శక్తి ఒకరి ఒడిలో ఒకరిని చేర్పించింది.

"అంతా బాగున్నారా నాయినా?"

"ఆ...ఆ... కులవిద్య అన్నం పెడుతుంది రా!".....

❖ ❖ ❖ ❖ ❖

# అమ్మ

**విను**
**ఫోన్ : 62812 22878**

ఎర్రటెండకు
ఎండిన కట్టెలకు ఏరుకొచ్చి
ఎన్ని గడపలకు మోపులమ్మితే
పొయ్యి మీదికి కాసిన్ని నూకలొచ్చాయో!

గుబురు గుబురు పొదల్లోంచి
ఒక్కొక్క గింజను పోగుజేసి
ఎన్ని సేరుల కరివేపాకు విత్తులేరుకొస్తే
మా కుండలోకి కూరగాయలొచ్చాయో!

అమ్మకి 'అక్రోఫోబియా'
తోటి వాళ్ళందరూ చెట్లెక్కి
మూటల నిండా అడ్డాకులకై
ఆరాటపడుతుంటే
మాయమ్మ గాలికి రాలిన ఆకులనే
ఏరుకొచ్చేది
దీపం బుడ్డి వెలుగులో విస్తరాకు కుడుతుంటే
అమ్మ చేతితో చందమామ
పురుడొస్తున్నట్లుండేది
ఎంత అడవిని చుట్టి వచ్చిందో
ఎన్ని కాలువలు దాటి వచ్చిందో
ఎన్నెన్ని చెట్లను పలకరించిందో
తునికాకు సంచినెత్తుకొని
జారిపడినప్పుడల్లా
ఛిద్రమైన మోకాళ్ళ చిప్పలెలా
విలవిలలాడాయో
నడిరాత్రి నడింట్లో కట్టలు కడుతుంటే
అలసిన అమ్మకు తునికాకులే
మెత్తని పానుపయ్యేవి

భుజాల లోతు వాగు
ఒంటి చుట్టూ కప్పలు జలగలు
పొద్దుగూకులు మునిగి తీసిన ఇసుక
ఊరిలో మేడల గోడలకు సరుకయింది
మా గూడునేమో చిల్లులు పడిన
గొడుగులాగుంది

మాయమ్మ తనువు చెమట ఊట
చుట్టూ పద్నాలుగు పల్లెల్లో
దాని పాదం మోపని గుంట భూమి లేదు
దాని చెమట ఇంకని సెంటు చేను లేదు

గంపెడాశతో రేషన్ షాపుకెళ్తే
ఫింగర్ ప్రింట్ మిషన్ నిరాకరిస్తుంది
పాపం, ఈ సాంకేతిక పరికరాలకేం
తెలుసు
కూలీ తల్లి చేతి వేళ్ళు అరిగి పోయాయని!

నా తల్లి అడుగులకు
అడవి తల్లి ఒళ్ళంతా పులకరించేది
మా యమ్మ దండం పెడితే
దారిలో నున్న నాగుపాములు
దారినిచ్చేవి
నాగరికత నరుడేమో ప్రకృతి ప్రాణం
తీస్తుండు

నెత్తి మీద గడ్డిమోపు
గడ్డి మోపు సిగలో కొడవలి
మాయమ్మ గుట్టెక్కి గుట్ట దిగుతుంటే
పగిలిన పాదాలు స్రవించిన రక్తధార
ఎత్తుపల్లాల ఎరుపు దారిని చూపెట్టింది.

# మధ్య తరగతి మందహాసాలు – ఈ 'సుదూర తీరాలు'

**వి. హరికృష్ణ చారి,** ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఫోన్ : 817 994 1098




హితాన్ని కలిగించేది సాహిత్యం. సాహిత్యంలో అనేక ప్రక్రియలు వెల్లివిరిసాయి. ఆ ప్రక్రియలో పుంఖానుపుంఖాలుగా రచనలు వచ్చాయి. భారతీయ సాహిత్యంలో కావ్యాలు రససిద్ధికి, కీర్తనలు సంకీర్తనలు మోక్ష సిద్ధికి దారి చూపితే, వచన సాహిత్యంలోని కథా ప్రక్రియ ఆనందానికి హేతువుగా నిలిచింది. కథలంటే ఇష్టపడని వారెవరుంటారు? అందుకే కథా ప్రక్రియ మిగతా ప్రక్రియలకంటే ఎక్కువ వ్యాప్తి చెందింది. కథ చెప్పడం ఒక కళ. దాన్ని రాయటం నైపుణ్యం, లోకానుభవంతో కూడుకున్న పని.

19వ శతాబ్దానికి పూర్వం కథలు వినోదానికి వీలునామాగా చరిత్రలోని సంఘటనలకు సాక్ష్యాలుగా నిలిచాయి. కానీ సాంస్కృతిక పునరుజ్జీవనం తరువాత కథ తన దశా దిశను మార్చుకొని సమాజ బాధ్యతను తలకెత్తుకుంది. శ్రామిక, కార్మిక కర్షక, మధ్యతరగతి మనుషుల సమస్యలను కథ తనలో నిక్షిప్తం చేసుకుంది. ఇప్పుడు కథ లక్ష్యం సమస్యలతో సతమతం అవుతున్న మానవుని అంతర్మథనాన్ని ఆవిష్కరించడం, దానికి పరిష్కార మార్గాన్ని అన్వేషించడం.

తెలంగాణ సాహిత్యం ఆ విషయంలో ముందుండటం గమనార్హం. అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, కె.వి నరేందర్, పెద్దింటి అశోక్ కుమార్ వంటి కథా రచయితలు తెలంగాణ బతుకు కథలను కళ్ళకు కట్టినట్లు చూపించారు.

చిన్నపిల్లాడిని పడుకోబెట్టడం నుండి పండు ముసలిని రుద్రభూమికి సాగనంపే వరకు జీవితంలో కథ భాగం అయింది. కథ రాయడానికి వస్తువును అభివ్యక్తీకరించడానికి పాండిత్యం మాత్రమే ఉంటే సరిపోదు. కథకునికి పాఠకున్ని మెప్పించగల నైపుణ్యం, ఏక బిగువున చదివించగల రచనాపటిమ, మారుతున్న కాలానుగుణంగా కథావస్తువు ఎంపిక స్పష్టంగా తెలిసి ఉండాలి. ఈ లక్షణాలన్నీ పుష్కలంగా పునికి పుచ్చుకున్న ప్రముఖ తెలంగాణ కథా రచయిత శ్రీ కటకోజ్వల మనోహరాచారి.

పూర్వపు కరీంనగర్ ప్రస్తుత జగిత్యాలకు జిల్లా చెందిన ఈయన ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఏకలవ్య (బుర్రకథ) వినాయక చవితి (భజన కీర్తనలు) సుమమాల (భక్తి గీతాలు) మందారమాలిక (సమాహార కళాకృతులు) వంటి రచనలతో సాహిత్య అభిమానులందరికీ సుపరిచితులే.

వృత్తిని ప్రేమించే వారు కొందరు ప్రవృత్తిని ప్రేమించే వారు కొందరు. కానీ రెండింటినీ సమానంగా ఆదరిస్తూ, ఆరాధిస్తూ జీవితంలో ముందుకు పోయేవారు అరుదు. బోధనతో శిష్యగణమును, రచనలతో పాఠక జనాన్ని ఇరు వర్గాలను మెప్పిస్తూ అప్రతిహతంగా ముందుకు సాగుతున్న రచయిత మనోహరాచారి. సమకాలిన సమస్యలే కథావస్తువుగా, సంఘ శ్రేయస్సు సదాకాంక్షగా, మధ్యతరగతి మానవుని పరిణామ గమనమే సంభాషణలుగా, సానుకూల దృక్పథపు పరిష్కారమే పరమావధిగా రచనలు చేస్తున్న కథకులు మనోహరాచారి.

లోగడ **"నవ్వుతున్న నేలతల్లి"** అనే తొలి కథల సంపుటిని వెలువరించి కథకునిగా తన శైలిని పాఠక లోకానికి పరిచయం చేశారు. ఇప్పుడు **"సుదూర తీరాలు"** అనే మరో కథల సంపుటితో మన ముందుకు వచ్చారు. ఇవి కేవలం కథలు కావు. వ్యవస్థలోని వాస్తవాలు, పేద బీద అణగారిన ప్రజల వ్యథలు. సహజంగా, సరళంగా, సూటిగా, స్పష్టంగా ఉంటూ చదువరులకు ఆలోచనలను రేకెత్తిస్తాయి. "నవ్వుతున్న నేలతల్లి" కథల సంపుటితో కథకునిగా, సాహిత్యాభిమానుల హృదయంలో స్థానం సంపాదిస్తే, ఈ "సుదూర తీరాలు" కథల సంపుటితో ఆ స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు.

ఈ కథల సంపుటిలో మొత్తం 14 కథలున్నాయి. దేనికదే ప్రత్యేకం. కానీ మన యోచనలతో మమేకం. ప్రతీ కథలో ఎక్కడోచోట ప్రత్యక్షంగాను, పరోక్షంగాను మనల్ని మనం తడిమి చూసుకుంటాం. దైనందిన జీవితంలో సకల చరాచర జీవరాశికి సమస్యలు సహజం. అయితే వాటి పరిష్కారం కోసం పరితపించేవారు కొందరు. పారిపోయేవారు మరికొందరు. రచయిత కోణం నుండి చూస్తే ప్రతి సమస్యకి ఓ పరిష్కారం, ఓపరిహారం ఉంటుంది. దాన్ని అన్వేషించి ఆచరించాల్సింది మనమే అని తెలుస్తుంది. ఒక కథ చదివాక రెండవ కథ చదవకుండా ఉండలేరంటే అతిశయోక్తి కాదేమో! నూతన కథారచయితలకు ఈ సంపుటి మార్గదర్శకంగా ఉంటుంది.

ISSN 2457-0796


మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని మన పూర్వీకులు ఎందుకు చెప్పారో "కాంతి దూతలు" అన్న కథ చదివితే తెలుస్తుంది. "ఎద్దుల గిట్టల తీరు చక్రం జోరు" అన్నట్లు తల్లిదండ్రులు నడుచుకునే పద్ధతి వారి పిల్లలను ఏ విధంగా ప్రభావితం చేస్తుందో చాలా చక్కగా వివరించారు. తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మ ఉమ్మడి కుటుంబం వలన పిల్లలకు అప్రయత్నంగానే మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచారవ్యవహారాలు, నైతికవిలువలు నేర్చుకుంటారు అనేది ఈ కథలో ద్యోతకమవుతుంది. దంపతులిద్దరూ ఉద్యోగులు అయితే పిల్లల ఆలనా పాలనా చూసుకునే వారు లేకపోతే వారి మనస్తత్వాలు ఏ విధంగా పరివర్తనం చెందుతాయో రచయిత ఊహించాడు.

పిల్లలు ఆటలతోనూ, పెద్దవాళ్లు పనులతో, వృద్ధులు జ్ఞాపకాలతో కాలం గడపడం పరిపాటి. **"పసిమనసులు"** కథ పిల్లల్ని వసతి గృహంలో ఉంచి మంచి చదువు చెప్పిస్తున్నామని భ్రమలో బతికే తల్లిదండ్రుల మానక మానసిక స్థితికి అద్దం పడుతుంది. పిల్లలు ఆటలాడటం అల్లరి చేయడం సర్వసాధారణం. దాన్ని తప్పించుకోవడానికి విద్య పేరుతో వాళ్లని బందీని చేస్తే వాళ్లు పెద్దయ్యాక స్వేచ్ఛ పేరుతో తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలి వెళ్తారని చెప్పకనే చెబుతుందీ కథ.

నేటి పల్లెలు అభివృద్ధి పేరుతో ఆధునీకరణ చెందినవని ఆనందపడాలో, ఒకనాటి ప్రకృతి నేడు కృతకంగా తయారయిందని బాధపడాలో అనే సందిగ్ధంలో పడవేసే కథ **"పల్లెతనం"**. **"కాపాడుకుంటేనే ఆస్తి లేకుంటే అది ఎప్పటికైనా గంగలో కలిసే అస్థి"** అన్న విషయాన్ని పల్లెతనం కథ మరోసారి రూఢీ చేస్తుంది.

తల్లిదండ్రుల క్రమశిక్షణను శిక్షగా భావించి, నియంత్రణను నిర్బంధంగా నిర్వచించుకొని తాత్కాలిక తాయిలాలకు తపించి ఆటో డ్రైవర్ చేతులో మోసపోయిన అభాగ్యురాలి కథే **"ఆత్మీయులు"**. స్వార్థం లేకుండా తల్లిదండ్రులు తప్ప ఇంకెవరు సహాయపడరు అనేది ఈ కథ ఇతివృత్తం. అవసరాలకు, ఆనందాలకు లొంగిపోయే ప్రతి యువతి తప్పక చదవాల్సిన కథ.

ఆధునిక సాహిత్యంలోనే కాదు, ప్రాచీన సాహిత్యంలో కూడా రచయితకు మంచి పట్టు ఉందనడానికి ఒక **"కావ్యకన్యక"** అనే కథ చక్కని తార్కాణం. పారిజాతాపహరణమును మూలంగా తీసుకొని శ్రీకృష్ణదేవరాయలకు వారి దేవేరి తిరుమలదేవికి మధ్య అభిప్రాయ బేధాలను, అపోహలను తిమ్మరుసు ఏ విధంగా తొలగించాడు ఈ కథలో తెలుస్తుంది. అపరాధం, అపాయం జరిగినప్పుడు ఉపాయంతో ఎలా సరిదిద్దాలో తిమ్మరుసు పాత్ర ద్వారా పాఠకులకు అవగతం అవుతుంది. ఇందులోని కావ్యభాషాసంభాషణలు కథకు అదనపు ఆకర్షణ.

కరుణ రసం కడవరకు నింపుకున్న కథ **"బడిబాట"**. కుటుంబం కొరకు తను బడి తప్పిస్తూ తన వాళ్లను ఆకలి నుండి తప్పించిన నిర్భాగ్యురాలి కథ. ఈ కథను చదువుతున్నప్పుడు మీ హృదయం ద్రవించడమో, మీ నయనాలు అశ్రువులు స్రవించడమో జరుగుతుంది. ఉపాధ్యాయుడంటే పాఠాలు చెప్పడమే కాకుండా, జీవిత పాఠాల్ని కూడా చెప్పాలన్న సామాజిక స్పృహ అంతర్లీనంగా కనిపిస్తుంది. పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన బాల్యం బీడి తంబాకుల్లో తండ్లాడుతుంటే .... ఆ ఉపాధ్యాయుడు ఏం చేశాడో బడిబాట కథ చదివి తెలుసుకోండి. రచయిత ఒక ఉపాధ్యాయుడు అయ్యుండి కూడా ప్రస్తుత ఉపాధ్యాయ వ్యవస్థలోని సాధక బాధకాలను, గుణదోషాలను నిర్మొహమాటంగా వెల్లడించడం అభినందనీయం.

ప్రతి తండ్రి తన కొడుకు తన కన్నా బాగా ఎదగాలని ఆశపడతాడు. అలా జరిగితే ఆనందపడతాడు. కానీ భవిష్యత్తుకు భరోసా ఇవ్వాల్సిన కొడుకే వర్తమానంలో భారం అవుతుంటే ఆ తండ్రి పరిస్థితి ఎలా ఉంటుందో **"పరిత్యాగం"** కథలో ప్రతిబింబిస్తుంది. కొడుకు ఉద్యోగం కోసం ఊపిరి వదిలిన రామ్మోహన్ పాత్ర మనల్ని వెంటాడుతూ ఉంటుంది. రోగాన్ని దాచి, త్యాగాన్ని చేసి కూతురుకి వైభోగాన్ని అందించిన పరిత్యాగిగా రామ్మోహన్ పాత్ర తండ్రి పాత్రల్లో ఉత్కృష్టంగా నిలిచిపోతుంది. **"కనేవరకు మోసేది తల్లి ,కడవరకు మోసేది మాత్రం తండ్రి"** అన్న ఒక తెలుగు సినిమా సంభాషణ ఈ కథకు అతికినట్లు ఉంటుంది.

సాటి మనుషుల పట్ల కనికరం లేని సమాజ నైజాన్ని **"చేయూత"** కథ మనకు చూపిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగి అయి కూడా సొంత ఇంటిని నిర్మించుకోలేక ఆకస్మికంగా మరణిస్తే ఆ కుటుంబం దుస్థితి ఎలా ఉంటుందో చేయూత కథ ద్వారా తెలుస్తుంది. యాదగిరి పాత చిత్రణ విధానం కొంతమందికి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రభుత్వ ఉద్యోగికి ఇల్లు లేకపోవడం ఏమిటి? అని ముక్కున వేలేసుకునే పాఠకులూ ఉంటారు. కానీ కథను సాంతం చదివితే ఆ పాత్రను ఎందుకు అలా మలిచారో తెలుస్తుంది. కరోనా సమయంలో అద్దె ఇంటి వారి అంత్యక్రియల అవస్థలు గుర్తుకు రాక మానవు ఈ కథ చదువుతున్నప్పుడు. కథ చివరలో వచ్చే గణేష్ లాంటి వారి అవసరం నేటి ప్రజలకు అనివార్యం.

ప్రేమ పాశానికి బలైపోయిన జయంతి కథే **"ప్రేమ పాశం"**. అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురే పదిమందిలో అల్లరి పాలు చేస్తుంటే ఏ తండ్రి అయిన ఎలా సహిస్తాడు? స్థిరత్వం లేని జీవితం, పరిపక్వతలేని ఆలోచన, బ్రతుకును అంధకారం చేసే ఆవేశం జయంతి అనే మగువ జీవితాన్ని ఎంతలా అతలాకుతలం చేశాయో ఈ కథలో ప్రస్ఫుటమవుతుంది. ముఖ్యంగా కోర్టు బోనులో కృష్ణమోహన్ రావు చెప్పిన సంభాషణలు ప్రతి ఒక్కరిని కదిలిస్తాయి. ఆత్మీయులు, ప్రేమ పాశం ఇతివృత్తం పరంగా దగ్గరి పోలికలు ఉన్నా ముగింపు విషయంలో రచయిత జాగ్రత్త వహించారు. ప్రేమపాశం ముగింపు ఆత్మీయులు కథకన్నా పరిపూర్ణంగా, సంతృప్తిగా ఉంటుంది.

రెండు విరుద్ధ నేపథ్యం ఉన్న కుటుంబాలలో నడిచే సంఘటనల సమాహారమే "సుదూర తీరాలు" కథ. కనిపెంచిన తల్లిదండ్రులకు కనిపించనంత దూరం వెళ్లిన మాధవరావు సంతానానికి, జన్మనిచ్చిన

తల్లిదండ్రులను ఆజన్మాంతం జాగ్రత్తగా కాపాడుకునే రాజగంగారాం సంతానానికి మధ్యగల వ్యత్యాసాన్ని విశదీకరిస్తుంది ఈ కథ. ఎదిగిపోవడం అంటే ఎక్కడికో పోవడం, అందలమెక్కటం కాదని గ్రహించేలా చేస్తుంది. సంపాదనాసాంగత్యంలో పడి దేశాలు దాటి ఆన్లైన్ సందేశాలతో సంబంధ బాంధవ్యాలు నేర్పుతున్న నేటి యువతకు చురకలంటించే ప్రయత్నం చేశారు రచయిత.

తండ్రీ కొడుకుల మధ్య అనుబంధాన్ని కొత్త కోణంలో ప్రదర్శించిన కథ **"క్షమించవా!"**. ఎదుటివారిని లొంగదీసుకోవడానికి సామదానభేద దండోపాయాలు ఉన్నాయి. వ్యక్తి స్వభావాన్ని బట్టి ఉపాయాన్ని ప్రయోగించాలి అనేది పెద్దల ఉవాచ. తన కొడుకు స్వభావాన్ని ఎరిగిన తండ్రి వ్యతిరేక దిశలో ప్రేరేపించి కుమారుడ్ని ఎలా వృద్ధిలోకి తెచ్చాడు అనేది కథాంశం. చివరికి తన తండ్రిని ఎలా అర్థం చేసుకున్నాడో తెలిసినప్పుడు కంటతడి పెడతాం. తండ్రి విలువ తండ్రయ్యాక తెలుస్తుంది అన్న విషయం మనందరికి స్వానుభవమే కదా!

మూఢభక్తికి, ముగ్ధభక్తికి చాలా తేడా ఉంటుంది. మొదటిది మోసానికి దారి తీస్తే రెండవది మోక్షానికి దారితీస్తుంది. ఆ భక్తి పేరుతో వ్యాపారం చేస్తున్న మనుషులు కోకొల్లలు. దైవాంశ సంభూతులమని చెప్పి అమాయక ప్రజలను ఎలా మోసం చేస్తున్నారో **"దేవుడయ్య"** కథ మనకు కనువిప్పును కలగజేస్తుంది. బావ బామ్మర్దుల సంభాషణలు చమత్కారంగా ఉండి అంతిమంగా అసలు నిజాన్ని బయటపెడతాయి. ఈ కథ చదివి మూఢ భక్తులు కొంచెం మారిన రచయిత లక్ష్యం నెరవేరినట్లే!

ప్రేమ అనేది ఒక పవిత్ర బంధం. దానికి ఒక వయస్సు ఉంటుంది. సమయం ఉంటుంది. అలా కాకుండా స్టేటస్ కోసమో, ఫ్యాషన్ కోసమో దానిని వాడుకుంటే సక్కుబాయి లాగే దెబ్బ తింటామని చెప్తుంది **"సక్కుబాయి ఓ బాయ్ ఫ్రెండ్"** కథ. నేటి యువతరం స్నేహంకు ప్రేమకు మధ్య ఉన్న హద్దును తెలుసుకోలేక తర్జనభర్జన పడుతున్నారు. వ్యామోహం ఆకర్షణలని ప్రేమగా అపోహ పడి జీవితాలని నాశనం చేసుకుంటున్నారు. అలా వినాశపు అంచుల వరకు వెళ్లి తప్పించుకున్న ఆడంబరపు ఆడపిల్ల కథే **"సక్కుబాయి"**. తల్లిదండ్రుల కళ్ళు గప్పి ప్రేమ మైకంలో ఊహలలోకంలో విహరించే అమ్మాయిల అంతరంగాన్ని బయటపెడుతుంది ఈ కథ. అనవసర, అసంగత పరిచయాలకై అర్రులు చాచే యువతులకు ఈ కథ ఒక గుణపాఠం. వలలో పడినా తప్పించుకోవచ్చు కాని వలపులో పడితే అంతే సంగతులు.

కరోనా టైంలో మందు బాబుల కష్టాలు అంతా ఇంతా కాదు! అలాంటి మందుబాబు రాంబాబు కథ **"మందుభాగ్యుడు"** ఆద్యంతం నవ్వుల పువ్వులు పూయిస్తుంది ఈ కథాగమనం. మద్యం లేకపోతే మన మధ్య ఏం లేదన్నట్లు తయారయ్యింది ఈమధ్య పురుష స్నేహబంధం. నిషకు బానిసై పరులకు అలుసైన మందుబాబు లందరికీ ఇది ఒక హెచ్చరికలా గుర్తుండిపోతుంది ఈ కథ. ప్రభుత్వాలు సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేస్తే గాని ఈ మందుబాబుల ఇ(క)ష్టాలను తీర్చలేమేమో! అని అనిపిస్తుంది అమందుభాగ్యులకు. ఇలా ప్రతి కథలోనూ ఏదో ఒక సామాజికాంశాన్ని లేవనెత్తుతూ, దానికి పరిష్కార మార్గాన్ని చూపిస్తూ, తన రచనాశరాన్ని సంధించారు మనోహరాచారి. మానవ సంబంధాలు, నైతిక విలువలు, బంధాలు, అనుబంధాలు, వైషమ్యాలు ఇలా వైవిధ్యంశాలను కథలుగా మలిచిన తీరు అద్భుతం. ప్రతి కథలో సందర్భానుసారంగా "విచలితం" అనే పదం విరివిగా వాడారు. బహుశా సమస్యల పట్ల చలించే సుగుణం ఉన్నందుకేనేమో! ప్రామాణిక భాషలో తనని తాను నిరూపించుకున్న రచయిత పూర్తి మాండలిక కథలు రాయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఇంతవరకు ఎవరు స్పృశించని, సృజించని అంశాలతో ముచ్చటగా మూడో కథల సంపుటిని రచించాలని అభిలషిస్తున్నాను.


# శిలాక్షరం

**(బి.ఎన్.శాస్త్రి సాహిత్యం - సమాలోచన)**

ప్రముఖ శాసన, చారిత్రక పరిశోధకులు, మూసీ పత్రిక వ్యవస్థాపకులు కీ.శే. బి.ఎన్.శాస్త్రిగారి రచనలన్నింటిపైనా సాధికారికమైన విశ్లేషణా వ్యాసాల సమాహారం 'శిలాక్షరం'.




**సంప్రదించండి.**
**మూసీ మాసపత్రిక**
**ఫోన్ : 934 7971177**

**సంపాదకులు : డా. భిన్నూరి మనోహరి**
**సహ సంపాదకులు : అట్టెం దత్తయ్య**
**వెల : 300/-**



# మూసీ

**సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక**
**మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి**
**వెంటనే శాశ్వత చందాదారులు కండి.**
**సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక**
**పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక**
**యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక**
**శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-**
**సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్ : 934 7971177**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5  హైదరాబాద్ మే : 2025

# హింసా ధర్మం

**డా. వొజ్జల శరత్ బాబు**
ఫోన్ : 99635 33937

ఎవడీ హైందవభూమిపై భయదకాళీ యుండుగన్ నిల్చునో
ఎవడీ ధర్మ వినాశనాతృత స్వకాంక్షీయుండుగనన్ హెచ్చునో
ఎవడీ నేలకు వెన్నుపోటు పొడువహ్వేయ్యేలికై తూలునో
రవమున్ జేయుచు నారసింహుడిగ నే రక్తాక్షుడిన్వానికిన్

ఏమిరా మూర్ఖుడా ఏమేమిటాచర్య
లేమేమి రక్కసి లేకిడివవి
భారతీయుల మెల్ల భాస్వరంబైన నీ
ధర్మమేనాడో తా దగిలిపోవు
హింసనే నీ ధర్మ హేయమై నిల్చునా
నీ బోధలవి గూడి నిన్ను గూల్చు
చీడపురుగుగ బెంచిరి నిన్ను చిత్రంబు
పెంచిన వారికే మంచి లేక
అగ్ని కీలల బడవేసి యంతమొంద
జేయ క్షణము జాలును మాకు చేతనౌను
నీచుడవు నిన్నిట సమాధి నేర్పు జేసి
ధర్మరక్షణ జేతుమీ కర్మభువిన

ధర్మంబు సహనమందుము
కర్మంబును సాధనంబుగా నుందుము నీ
ధర్మమదేమి హింసన్
మర్మపు బోధగ సలుపును మైత్ర్యాహితమై



# మరక మిగిలిన రోజు

**ధూళిపాళ అరుణ**
ఫోన్ : 871234 2323

నా అక్షరం ఈరోజు
ముష్కరుల చేత బందీగా
ఎర్రరంగు పులుముకుంది
ఏరులు పారుతున్న
ఈ పాశవిక రక్తచరిత్రను
ఎన్నిరోజులు రాసుకోను?
నవ్వులు విరిగిపోయిన
కంటి దుఃఖపు కాలువలకు
ఏ ఓదార్పు ఆనకట్టలను
అడ్డువేయగలను?

ప్రకృతి సౌందర్యంలో
పులకిస్తున్న ఆనంద దేహాలు
మృత్యుక్రీడలో ఓడి
నేలతల్లి ఒడిలోకి ఒరిగి
ఋణం తీర్చుకుంటూ
అందించిన చివరి ఊపిరులు

ప్రాణం వెలను కొల్లగొట్టిన
దురహంకార వలయంలో
రేవటి జీవనోదయాన్ని
పొంగిన రుధిర ధారలతో
విషాదపు చీకట్ల కింద
దాచబోతున్న అభాగ్యజీవులు

స్వచ్ఛమైన నా దేశ పతాకంపై
తుడిచివేయలేని మరకను
మిగిల్చిన దురదృష్ట దినాన్ని
ఏమని స్మరించుకోను??






**చిరునామా**

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**

చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా
సంపాదకుడు, మూసీ మాసపత్రిక,
ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,
బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,
హైదరాబాద్-500013.

చందాలకు ఆన్‌లైన్ అకౌంట్
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.
అకౌంట్ నెం. 52019740642
IFS Code : SBIN0020083
editormusi@gmail.com




**జీవగణితం (కవితలు)**
రేడియమ్
వెల : 100/-
**ప్రతులకు :** జె. కొండన్న (రేడియమ్)
ఇం.నెం. 23-4-338, సుల్తాన్‌షాహీ,
పోస్ట్ : శాలిబండ, హైదరాబాద్ - 500 065
ఫోన్ : 929 152 7757




**జోడు దివ్వెలు (భారవి నీతి హేతి - మాఘ సౌరభము)**
**మూలము, భావ వివరణ సహితం**
కృతి కర్త : బ్రహ్మశ్రీ మేడవరము సత్యనారాయణ శాస్త్రి
భావ వివరణము : మేడవరము అనంతకుమార శర్మ
వెల : 250/-
**ప్రతులకు :** మేడవరము మాణిక్యాంబ, ఫ్లాట్ నెం. 506, 5వ ఫ్లోర్, సాయిసుధా రెసిడెన్సీ, విద్యానగర్, నిజాం సాగర్ రోడ్, కామారెడ్డి. 503 111
ఫోన్ : 98493 01943




**తిరుపతి క్షేత్రం - రెడ్లు**
ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి
వెల : 130/-
**ప్రతులకు :** పేట శైలజ, 418, బండ్ల వీధి,
తిరుపతి - 517 501.
ఫోన్ : 98493 07333




**గణతంత్ర మొగ్గలు**
డా. భీంపల్లి శ్రీకాంత్
వెల : 30 /-
**ప్రతులకు :** డా. భీంపల్లి శ్రీకాంత్
8-5-38, టీచర్స్ కాలనీ,
మహబూబ్ నగర్ - 509 001.
ఫోన్ : 90328 44017




**నమ్మలేని నిజాలు**
రేడియమ్
వెల : 150 /-
**ప్రతులకు :** జె. కొండన్న (రేడియమ్)
ఇం.నెం. 23-4-338, సుల్తాన్‌షాహీ,
పోస్ట్ : శాలిబండ, హైదరాబాద్ - 500 065
ఫోన్ : 929 152 7757




**శ్రీరామాయణము (సీతాయాశ్చరితమ్ మహత్)**
ఆరవల్లి శ్రీదేవి
సహ సంపాదకులు : డా. తిరునగరి శరత్‌చంద్ర
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత్రి, 1-19-118, ఎస్1, రెండవ ఫ్లోర్, నవకార్ అపార్ట్‌మెంట్స్, కొత్త బస్తి, వెంకటాపురం, సికింద్రాబాద్ -500015
ఫోన్ : 99594 99975




**లీలాశుక విరచిత శ్రీకృష్ణ కర్ణామృతం (తెలుగు అనుసరణం)**
ఆరవల్లి శ్రీదేవి
వెల : 200 /-
**ప్రతులకు :** రచయిత్రి, 1-19-118, ఎస్1, రెండవ ఫ్లోర్, నవకార్ అపార్ట్‌మెంట్స్, కొత్త బస్తి, వెంకటాపురం, సికింద్రాబాద్ -500015
ఫోన్ : 99594 99975




**సుస్వర రామాయణము**
వాడపల్లి రాధ
అమూల్యము
**ప్రతులకు :** వాడపల్లి రాధ, ఫ్లాట్ నెం. 303, లేక్ షేర్ రెసిడెన్సీ, ఎం.జె. కాలనీ, వివేక్ నగర్, కుకట్ పల్లి, హైదరాబాద్ - 500 072.
ఫోన్ : 903 204 4635

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 5 (62) హైదరాబాద్ మే : 2025

# పేరేంటో తెలుసా !!

**డా. మేఘ స్రవంతి**
ఫోన్ : 95059 16391




ఎంత బాధ, ఎంత ఆవేదన విలవిలలాడే అలలపోటులా ఉండే..
గుండె సుడిగుండం అయ్యిందే..
కళ్ల వంతెన తెగి కన్నీటి యేటి పరుగు బుగ్గలను చీల్చుకొని..
గొంతును చిదుముతూ గుండెలపైకి దూసుకు పోతుంటే..
ఆ ఊటని ఆపలేని, తెగిన
ఆ కంటి కుంట ఏం చెయ్యాలో తెలియక నీరసించగా..




తన మనోవ్యథ తనను తానే వినాలని
ఓ కాగితాన్ని చేరింది
సృజనను స్పృశిస్తూ
ఆ గాథను మొదలుపెట్టింది.
ఉప్పొంగి ఉప్పొంగి వెల్లబుచ్చింది.
చుట్టూ ఉన్న ప్రకృతిని వికృతి చేస్తూ వచ్చింది.
విలయుడి తాండవం అంతా ఆ వేదనై చేసింది.
వేదాంతిలా వాపోయింది.
విపరీత వైపరిత్యాల విన్యాసాల పర్యంతం తెలిపింది.
విధి విలాసాల, వీధి జీవుల జీవన చిత్రాలను గీసి చూపింది.
కర్కోటక కర్కాటకుల తీరుతెన్నులను విప్పి చెప్పింది.
ఒకటా రెండా వేలసంగతుల గతులను వెలిబుచ్చింది.
అలా కొన్ని క్షణాల్లోనే ఏదో ఊరడించడం మొదలుపెట్టిందని తెలుసుకునే సమయానికి
ఓ అందమైన నవయవ్వని
నా ముందర నిశ్చింతగా, నిశ్చలంగా, నిత్య విజేతగా నిలబడింది.
మనసును నెమ్మది చేసి, ఆవేదనను ఆలింగనం చేసుకొని
అల్లకల్లోలాలను ఆపేంత బలం మోసుకుంటూ
నా కళ్లకు అడ్డుకట్ట వేసి వంతెన కట్టి
తేటగా చూపించిన ఆ అందమైన రూపం పేరేంటో తెలుసా...
**కవిత**
దాని పూర్తి పేరు స్వరూప కవిత
నిజస్వరూప కవిత.



Regd No. R.N.37723/80
P.R.No.HSE-824/2023-2025
Date of Publication 1st of Every Month Date of Posting 5th / 6th of Every Month
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad - 500 001.

# హరిహర త్రిశక్తి క్షేత్రం

నవాలయ ఆవరణం, శ్రీ విద్యాపురం, వలిగొండ, యాదాద్రి జిల్లా.



## ఆలయ నిర్మాణ, నిర్వహణకు సహకరించండి.....

దాతలు తమ సహకారం ఆన్‌లైన్ ద్వారా కూడ అందించవచ్చు.

**State Bank of India, Nallakunta Branch,**

**A/c. No. 62011461764, IFSC Code : SBIN0020083**

రండి... ఈ ధర్మయజ్ఞంలో అందరం పాలుపంచుకుందాం.

# వేద సంస్కృతి పరిషత్

వైదిక సాంస్కృతిక ఉద్దీపన పరిశోధనా సంస్థ

సెల్ : 9704227744, 9347971177

Website : www.vsparishath.com, E-mail : vsp613@gmail.com

From :
**The Manager, MUSI Telugu Monthly Magazie**
# 2-2-1109/BK - LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad- 500 013.
Cell : 9347971177, Email : editormusi@gmail.com

Printed, Published and Owned by : B.Manohari, Printed at Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
Published at H.No.2-2-1109/BK, LIG - 10, Batukammakunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana
Editor : Dr.Sagi Kamalakara Sharma